PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 137 | విజయవాడ, బుధవారం 20 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 20 December 2023 | Rs

మరో 41 మంది ఎంపీలపై సస్పెన్షన్

- ఈ సెషన్‌లో మొత్తం 141 మంది ఎంపీలపై వేటు
- అప్రజాస్వామికంలో ఆల్‌టైం రికార్డ్

7

నేటి నుండి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం సమగ్రశిక్షా ఉద్యోగులు నేటి (బుధవారం)నుండి సమ్మెలోకి దిగనున్నారు. ఈ మేరకు ఎస్ఎస్ఎ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు బి కాంతారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రెగ్యులర్ చేయడం, హెచ్ఆర్ పాలసీ అమలు, ఉద్యోగ భద్రత, తక్షణమే గ్రాస్‌పే తదితర సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. . రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల మంది సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెలో భాగస్వాములు కానున్నారు.

యుటిఎఫ్ మద్దతు

సమగ్రశిక్ష ఉద్యోగుల పోరాటానికి యుటిఎఫ్ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ మేరకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు,, కెఎస్ఎస్ ప్రసాద్‌లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు గత మూడు నెలల నుంచి జీతాలు కూడా ఇవ్వలేదని వారు తెలిపారు.

141 మంది ఎంపీల గెంటివేతకు వ్యతిరేకంగా

22న దేశవ్యాప్త నిరసన

ఇండియా ఫోరం పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అన్ని ప్రజాస్వామ్య మర్యాదలను మంటగలుపుతూ పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపిలను మూకుమ్మడిగా సస్పెండ్ చేసిన మోడీ ప్రభుత్వ నియంతృత్వ చర్యకు వ్యతిరేకంగా ఈనెల 22న దేశవ్యాపిత నిరసనలకు ఇండియా ఫోరం పిలుపునిచ్చింది. 28 రాజకీయ పార్టీలతో కూడిన ఇండియా ఫోరం నాల్గవ దఫా సమావేశం మంగళ వారం నాడిక్కడి అశోకా హెటల్‌లో జరిగింది. ఈ సమావేశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సిఎం భగవంత్ మాన్, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఎన్‌సిపి నేత శరద్ పవర్, ఆర్జెడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్, ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పిడిపి నేత మెహబూబా ముఫ్తీ, శివసేన నేత ఉద్దవ్ ఠాక్రే, ఆర్ఎల్డీ నేత జయంత్ చౌదరి తదితరులు హాజరయ్యారు.

ఎన్నికల తర్వాతే ఏదైనా..

'ఇండియా' ఫోరం తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను బరిలో నిలపాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆప్ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ సమావేశంలో ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే ఆ ప్రతిపాదనను ఖర్గే సున్నితంగా తిరస్కరించారు. ముందు ఎన్‌డిఎను గద్దె దింపి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడటమే 'ఇండియా' లక్ష్యంగా ఉండాలని, ఆ తర్వాతే ప్రధాని అభ్యర్థిత్వం, ఇతర అంశాలు చూడవచ్చునని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. ఎంపిల మూకుమ్మడి సస్పెన్షన్‌ను ఖండిస్తూ సమావేశం తీర్మానం చేసింది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు



ఇండియా ఫోరం సమావేశంలో వివిధ పార్టీల అగ్రనేతలు, పంజాబ్ , ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు

అన్ని పార్టీల నేతల భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలు వేగవంతం చేయాలని కూడా నిర్ణయించారు. ప్రధానమంత్రి పదవికి ఏ నాయకుడిని ప్రతిపాదించి ఎన్నికలను ఎదుర్కోకూడదని కూడా నిర్ణయించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మీడియాకు సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. ఎన్నికల తరువాత ఫోరమ్‌కి మెజారిటీ వస్తే ఎంపిలు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రధానిని ఎన్నుకుంటారని అన్నారు. సీట్ల పంపకాలపై మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ "స్థానిక నేతలు మొదటి రౌండ్ చర్చలు జరుపుతారు. విభేదాలు అలాగే ఉంటే సీనియర్ నేతలు జోక్యం చేసుకుంటారు. ఉత్తరప్రదేశ్, తెలంగాణ సీట్ల పంపకాల సమస్యలు పరిష్కారమవుతాయి. పంజాబ్, ఢిల్లీ సమస్యలను ఎలా పరిష్కరించవచ్చో చూసేందుకు ప్రయత్నిస్తాం. మనం ముందుగా విజేతలుగా రావాలి. మాకు ఎంపిలు లేకపోతే, ప్రధానిని ప్రొజెక్ట్ చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి?" అని అన్నారు.

రాష్ట్ర స్థాయిలో సీట్లు సర్దుబాటు: ఏచూరి

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రంలో పొత్తులు, అవగాహనలపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించామన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఇది ఖరారు అవుతుందని అన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలపై నిరసనలు, బహిరంగ సభలు నిర్వహించడంతో ప్రజలను సంఘటితం చేస్తామన్నారు.

'త్వరలో అన్నీ మొదలవుతాయి': కేజ్రీవాల్

ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ "సమావేశం బాగా జరిగింది. ప్రచారం, సీట్ల పంపకం, ప్రతిదీ త్వరలో ప్రారంభమవుతుంది. ఇంకా (కన్వీనర్ ఎంపిక కాలేదు)" అని చెప్పారు.

బిజెపిపై సమిష్టిగా పోరాడాలి: డి రాజా

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా మాట్లాడుతూ కనీస ఉమ్మడి కార్యక్రమంపై ప్రస్తావన వచ్చిందని, ఇప్పుడు ఎంపిల సస్పెన్షన్ అంశం ప్రజాస్వామ్యంపై దాడి, పార్లమెంటరీపై దాడి అని ముందుగా నిర్ణయించామని అన్నారు. కాబట్టి దేశవ్యాప్తంగా నిరసనలు, సామూహిక నిరసనకు పిలుపునిచ్చామన్నారు. సీట్ల పంపకాలను వీలైనంత త్వరగా ముగించి, బిజెపికి వ్యతిరేకంగా గట్టి సమష్టి పోరాటాన్ని సాగించాలని అన్నారు.

నేడు 'యువగళం' విజయోత్సవ సభ

- హాజరు కానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

గౌతమ్ నవ్‌లఖాకు బెయిల్

చైనాలో పెను భూకంపం

- 127 మంది మృతి



రావిచంద్రి కూడలిలో రైతులు, పోలీసుల మధ్య వాగ్వివాదం

రోడ్డెక్కిన రైతులు

- ధాన్యం ట్రాక్టర్లతో నిరసన
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

• లోపలి పేజీలో.. •



గుంటూరు దీక్షా శిబిరంలో భోజనాలు చేస్తున్న అంగన్‌వాడీలు (వార్త 2వ పేజీలో)

ప్రభుత్వం పగులకొడుతున్నది

తాళాలు కాదు... అంగన్‌వాడీల గుండెలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం

వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచన

మహిళలతో పెట్టుకున్న ప్రభుత్వాలు గెలిచిన దాఖలా లేదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం పగులకొడుతున్నది అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు కాదని, కడుపుమండిన అంగన్‌వాడీ టీచర్లు, మినీవర్కర్లు, హెల్పర్ల గుండెలనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, మంతెన సీతారాంతో కలిసి ఆయన మాట్లాడారు. 18వ తేదీన రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంవై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిందని, దీనికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఎం.ఎ.బేబీ హాజరయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. అంగన్‌వాడీల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించిందని చెప్పారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించకపోతే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలకు తల్లులు, ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాతంత్రవాదులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె ఎనిమిది రోజులకు చేరిందని, సమస్యను పరిష్కరించేందుకు మిగతా 2లో

పార్లమెంటులో నిలదీయండి

- విశాఖ బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రైవేటీకరణపై ఎంపిలకు సిపిఎం లేఖ
- పోలవరం నిధులనూ రాబట్టేలా చూడాలి

2

'సోమిరెడ్డి' దీక్ష భగ్నం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేస్తున్న సత్యాగ్రహ దీక్షను మంగళవారం పోలీసులు భగ్నం చేశారు. ఆయనను బలవంతంగా వ్యానులో ఎక్కించి దీక్షా స్థలి నుంచి తరలించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియోజకవర్గమైన సర్వేపల్లిలోని పొదలకూరు మండలం వరదాపురం వద్ద రుస్తుం మైనింగ్‌లో అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. కొందరు వైసిపి నేతలు లీజుదారులను బెదిరించి క్వారీని స్వాధీనం చేసుకున్నారని విమర్శలున్నాయి. గడువు ముగిసినా అక్రమంగా మైనింగ్‌ను తవ్వితీస్తున్నారని ఆరోపిస్తూ సోమిరెడ్డి మూడు రోజులుగా అక్కడే దీక్ష చేపట్టారు. మంగళవారం వేకువజామున 2 గంటల సమయంలో దీక్షా స్థలానికి పోలీసులు చేరుకుని దీక్షను భగ్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, టిడిపి కార్యకర్తలకు మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడ నుంచి నేరుగా సోమిరెడ్డిని ధనలక్ష్మీపురంలోని ఆయన నివాసానికి తీసుకెళ్లి వదిలిపెట్టారు.


సోమిరెడ్డిని ఎత్తుకెళ్తోన్న సిఐ రాంబాబు

ప్రీ క్రిస్మస్ వేడుకల్లో ఎబివిపి దాడి


- సింహపురి యూనివర్సిటీలో ఘటన
- ఒకరికి గాయాలు, పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మతోన్మాదులు రెచ్చిపోతున్నారు. ప్రశాంతమైన విశ్వవిద్యాలయాల్లోనూ మతచిచ్చుపెడుతున్నారు. నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (విఎస్‌యు)లో ప్రీ క్రిస్మస్ వేడుకల్లో చొరబడి దాడికి పాల్పడ్డారు. యూనివర్సిటీ సిబ్బందిపై దాడికి పాల్పడడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ప్రీ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడానికి యూనివర్సిటీ అధికారులు అనుమతిచ్చారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలో వేదిక ఏర్పాటు చేసుకొని, వేడుకలకు సిద్ధమయ్యారు. ఇంతలోనే ఎబివిపి జెండాలు పట్టుకున్న కొందరు వ్యక్తులు వేడుకల్లో చొరబడ్డారు. అడ్డువచ్చిన సిబ్బంది, విద్యార్థులపై దాడికి పాల్పడ్డారు. ఇక్కడ ఇలాంటి కార్యక్రమాలు జరగనివ్వమని హెచ్చరించారు. వేడుక కోసం ఏర్పాటు చేసిన సామగ్రిని కింద పడేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వేడుకను సిబ్బంది, విద్యార్థులు రద్దు చేశారు. గాయపడ్డ సిబ్బంది వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విఎస్‌యు విసి సుందరవల్లి.. తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీ విసి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమవారం అక్కడ క్రిస్మస్ ఏర్పాట్లు చేయగా, ఎబివిపి దాడికి పాల్పడింది. ఈ సంఘటన మరువకముందే నెల్లూరు ఈ సంఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలో ఇలాంటి దాడులను తిప్పకొట్టాలని అభ్యుదయ వాదులు కోరుతున్నారు.



వేడుకలను అడ్డుకుంటున్న ఎబివిపి



విజయవాడలో జరిగిన అంగన్‌వాడీల ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.ఎ.గపూర్



కర్నూలులో కలెక్టరేట్ ఎదుట ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సిఐటియు, ఎఐటియుసి నాయకులు



విజయనగరం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో చిన్నారులు

వంటా-వార్పు, భిక్షాటనతో నిరసన

8వ రోజూ కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి- యంత్రాంగం

సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అంగన్‌వాడీల నిరవధిక సమ్మె ఎనిమిదో రోజూ కొనసాగింది. మంగళవారం నాడు కలెక్టరేట్లు, తహశీల్దార్ కార్యాలయాలు, ఎంపిడిఒ కార్యాలయాలు, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించి అక్కడే భోజనాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగించారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టడానికి అధికారులు కొన్నిచోట్ల ప్రయత్నించగా వారిని స్థానికులు, అంగన్‌వాడీలు అడ్డుకున్నారు.

అనంతపురం కలెక్టరేట్, శ్రీసత్యసాయి చిలమత్తూరు, గాండ్లపెంట, సోమందేపల్లి తదితర ప్రాంతాల్లో వంటా-వార్పుతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. గుంతకల్లులో కళ్లకు నల్లరిబ్బను కట్టుకుని గాడిదకు వినతిపత్రం అందజేశారు. రాయదుర్గంలో మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఒంటి కాలిపై నిలబడ్డారు. నంద్యాల జిల్లా నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె మండల కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట వంటా-వార్పు చేపట్టారు. సున్నిపెంటలో రాస్తారోకో నిర్వహించారు. చాగలమర్రిలో భిక్షాటనతో నిరసన తెలిపారు. వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట బైటాయించారు. ఎక్కడికక్కడే వంటా-వార్పు నిర్వహించారు. వేంపల్లె భిక్షాటన, జమ్మలమడుగులో పొర్లుదండాలతో నిరసన తెలిపారు. నెల్లూరు జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టేందుకు అధికారులు ప్రయత్నించగా స్థానికుల ప్రతిఘటన ఎదురవ్వడంతో వెనక్కి తగ్గారు. ప్రకాశం జిల్లా కనిగిరి, మద్దిపాడు, దర్శి, వెలిగండ్ల, బాపట్ల జిల్లా రేపల్లె, అద్దంకిలో వంటావార్పు నిర్వహించారు. పర్చూరులో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. నిజాంపట్నంలో భిక్షాటన చేశారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద, పల్నాడు జిల్లా చిలకలూరిపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి సమ్మె శిబిరాల్లో వంటా-వార్పు నిర్వహించి అక్కడే భోజనాలు చేశారు. తుళ్లూరు, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట, వినుకొండలో భిక్షాటనతో నిరసన తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరం, మచిలీపట్నం, మొవ్వ, అవనిగడ్డ, కంకిపాడు తదితర మండలాల్లో వంటావార్పు నిర్వహించారు. భిక్షాటన చేశారు. ఏలూరు జిల్లా ఏలూరు, చింతలపూడి, టి.నర్సాపురం, కొయ్యలగూడెం, నిడమర్రు, జీలుగుమిల్లి, నూజివీడు, జంగారెడ్డిగూడెం, మండవల్లి, ఆగిరిపల్లి, ఉంగుటూరు, ముసునూరు, భీమడోలు, బుట్టాయగూడెం, కలిదిండి, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా ఆచంట, ఆచంట (పెనుమంట్ర), పోడూరు, పాలకొల్లు, మొగల్తూరులో భిక్షాటనతో నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద నిర్వహిస్తున్న సమ్మెకు పలు గ్రామాల సర్పంచులు మద్దతు తెలిపారు. రాజమహేంద్రవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చెవిలో పూలు పెట్టుకుని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కాకినాడ జిల్లా వంటా-వార్పు, కిర్లంపూడిలో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం దిబ్బిడి అంగన్‌వాడీ కేంద్రం తాళం పగలగొట్టడాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ఎస్.రాయవరంలో ధర్నా నిర్వహించారు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి, చింతూరు, విఆర్.పురం, కొయ్యూరు కేంద్రాల్లో భిక్షాటన నిర్వహించారు. విఆర్.పురం మండలం చిన్నమట్టపల్లి అంగన్‌వాడీ సెంటర్ తాళాలు తీయడానికి సచివాలయ సిబ్బంది ప్రయత్నించగా ఎంపిటిసి సభ్యులు పూనెం ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యాన స్థానికులు అడ్డుకున్నారు. కూనవరం మండలం బెస్త బజార్ అంగన్‌వాడీ సెంటర్ తాళాలు బద్దలు కొట్టి సరుకులు అంచనా వేస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్, పంచాయతీ సిబ్బందిని అంగన్‌వాడీలు నిలదీశారు. విశాఖ జిల్లా ఆనందపురంలో ఒంటికాలిపై నిలబడి భిక్షాటన చేశారు. విజయనగరం కలెక్టరేట్ సమ్మె శిబిరంలో పలువురు తల్లులు తమ పిల్లలతో కలిసి పాల్గొన్నారు. 'జగన్ మామా మా ఆయమ్మకు జీతం పెంచండి' మా టీచర్ల కోర్కెలు తీర్చండి' అంటూ చిన్నారులు పలకలపై రాసి ప్రదర్శించారు. జామి, గజపతినగరం, రామభద్రపురంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని మండలాల్లోనూ వంటావార్పుతో నిరసన తెలిపారు. శ్రీకాకుళం, పొందూరు, బూర్జ, టెక్కలిలో వంటా-వార్పు, ఎచ్చెర్లలో మానవహారం నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఐసిడిఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు ప్రయత్నిస్తుండగా ప్రజల సాయంతో అంగన్‌వాడీలు అడ్డుకుంటున్నారు.

అంగన్‌వాడీకి అస్వస్థత, హెల్పర్‌కు గుండెపోటు

తిరుపతి జిల్లా రేణిగుంటలో అంగన్‌వాడీ హెల్పర్ సరోజమ్మ (55) గుండెపోటుకు గురయ్యారు. ఆమె పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రం తాళాలను సచివాలయ అధికారులు పగలగొట్టడంతో ఈ విషయం తెలిసి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. 108కు ఫోన్ చేయగా, అర్ధగంట తరువాత వస్తామని చెప్పడంతో, ఆటోలో ఆమెను ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.


గుండెనొప్పితో బాధపడుతున్న సరోజమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న అంగన్‌వాడీ నాయకులు

ప్రభుత్వ తీరు వల్ల తీవ్ర మనస్తాపంతో ఏలూరు ముసునూరు మండలం అన్నపనేనివారిగూడేనికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి అస్వస్థతకు గురై వాంతులు చేసుకున్నారు. సహచరులు ఆమెను పిహెచ్‌సికి తీసుకెళ్లారు. బిపి బాగా పెరిగిందని వైద్యులు నిర్ధారించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరుకు, అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విజయవాడలోకార్మిక సంఘాల ధర్నా

విజయవాడ ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీల ఎనిమిదో రోజు సమ్మె శిబిరాన్ని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గపూర్ ప్రారంభించారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన లెనిన్ సెంటర్‌లో ధర్నా జరిగింది.

అనంతరం ర్యాలీగా అంగన్‌వాడీల సమ్మె శిబిరానికి చేరుకున్నారు. గపూర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ తక్షణం రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కోనసీమ జిల్లా మామిడికుదురు, రాజోలులో అంగన్‌వాడీల సమ్మె శిబిరాల్లో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి పాల్గొని మాట్లాడారు. ఎనిమిది రోజుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తోన్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేకపోవడం శోచనీయమన్నారు.

ఉద్దేశపూర్వకంగా చర్చలు విఫలం

- అంగన్‌వాడీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల ఐక్యవేదిక హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు; చిత్రంలో వి. ఉమామహేశ్వరరావు, పొలారి

అంగన్‌వాడీ కార్మికుల న్యాయమైన కోర్కెలపై ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తుండగా ప్రభుత్వం కావాలని ఉద్దేశ పూర్వకంగా చర్చలు విఫలం చేస్తోందని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్మికుల సమ్మెకు మద్దతుగా దాసరి భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు పొలారి, ఇతర అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం మొదటి దఫా చర్చలు చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి సమక్షంలో, రెండో దఫా చర్చలు బొత్స సత్యనారాయణ, ఉషశ్రీ చరణ్, బుగ్గన రాజేంద్రనాథ్‌తోపాటుగా, చీఫ్ సెక్రటరీ, సజ్జల రామకృష్ణారెడ్డి, ఐసిడిఎస్ అధికారులతో 17వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జరిగాయని తెలిపారు. వేతనాలు పెంపకం, గ్రాడ్యుటీ తప్ప ఇతర అంశాలపై మాత్రమే మాట్లాడి వెళ్లిపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం జరుపుతున్న చర్చల తీరు గమనిస్తే కావాలనే నిర్లక్ష్యం చేసి, సజావుగా జరగకుండా, కంటి తుడుపు చర్యగా వ్యవహరిస్తోందని తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్షా ఆరువేల మంది ప్రభుత్వానికి అన్నిరకాల సేవలు అందిస్తూనే, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకు, చిన్నపిల్లలకు ఆరోగ్య సంరక్షణ కోసం రోజుకు 16 గంటలు పనిచేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మూడు సులభమైన పద్ధతులున్నాయని తెలిపారు. అందులో ఒకటి ఎన్నికల ముందు వైఎస్ జగన్.. అంగన్‌వాడీ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వేతనం కంటే అదనంగా వెయ్యి రూపాయలు ఇవ్వాలని, రెండు.. ప్రభుత్వం నియమించిన 11వ పిఆర్‌సి ప్రకారం రూ.20 వేలు ఇవ్వాలని, మూడు.. సుప్రీంకోర్టు ప్రకటన ప్రకారం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా ఐఎఎస్ ఆఫీసర్ల ఆదేశాలతో పోలీసులు, వైసిపి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలకొట్టి, ఆక్రమించుకోవడం సబబు కాదని హెచ్చరించారు. మహిళా కార్యకర్తలను సమ్మె ఉపసంహరించుకుని విధుల్లో చేరాల్సిందిగా బెదిరించే చర్యలను ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన సమస్యలపై చర్చలు సఫలం అయ్యేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కార్మికుల పోరాటం న్యాయసమ్మతమన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని, ఈ నేపథ్యంలో వేతనాలు పెంచడం న్యాయం కాదా? అని ప్రశ్నించారు. ఎంపి, ఎమ్మెల్యే వేతనాలు పెంచుకున్నారని, కష్టపడి పనిచేస్తున్న వారి వేతనాలు పెంచమంటే ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కార్యకర్తను కరోనా వారియర్స్‌గా అభివర్ణించిన జగన్ తక్షణమే న్యాయమైన డిమాండ్లపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలు అంగన్‌వాడీ కార్మికులకు మద్దతుగా నిలిచి పోరాటాన్ని ఉధృతం చేస్తాయని హెచ్చరించారు. చంద్రబాబు, లోకేష్, పవన్‌పై చేస్తున్న దాడి లాగానే, అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలతో కలిపి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు వెంకట సుబ్బయ్య, ఐఎఫ్‌టియు నాయకులు రవిచంద్ర పాల్గొన్నారు.

పార్లమెంటులో నిలదీయండి

- విశాఖ బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రైవేటీకరణపై ఎంపిలకు సిపిఎం లేఖ
- పోలవరం నిధులనూ రాబట్టేలా చూడాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అంటూ 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడానికి గత మూడేళ్లకు పైబడి కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని, దీన్ని అడ్డుకోవాలని రాష్ట్రానికి చెందిన ఎంపిలందరికీ లేఖ రాసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఆ లేఖను మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, మంతెన సీతారాంతో కలిసి మీడియాకు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల అండతో కార్మికులు పోరాడి ఇప్పటి వరకు స్టీలు ప్లాంటును నిలబెట్టారని తెలిపారు. కేంద్రం ఇప్పుడు ప్రైవేటు పరం చేయడానికి కొత్త మార్గాలు వెతుకుతోందని, ఉత్పత్తికి కీలకమైన బ్లాస్ట్ ఫర్నేస్-3 పని చేసేందుకు సుమారు రూ.1,200 కోట్లు అవసరం ఉందని పేర్కొన్నారు. ఆ నిధులను మంజూరు చేయడమో లేక అప్పు తీసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడమో మాని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించాలని కుతంత్రాలు చేస్తోందని విమర్శించారు. జిందాల్ స్టీల్ యాజమాన్యంతో ఉన్నతాధికారులు గతవారంలో ఢిల్లీలో చర్చించినట్లు వచ్చిన వార్తలతో స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం తీవ్ర ఆందోళన చెందుతోందని వివరించారు. ఇప్పటికైనా బ్లాస్ట్ ఫర్నేస్-3 పనిచేయించేందుకు నిధులు కేటాయించాలని, నిర్వహణ బాధ్యత సెయిల్‌కు అప్పగించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటు వారిని విశాఖస్టీల్ ప్లాంట్‌లోనికి అనుమతించరాదని కోరారు.

పోలవరం నిధులనూ రాబట్టాలి

పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం వల్ల లక్షలాది కుటుంబాలు ముఖ్యంగా అత్యధిక గిరిజన కుటుంబాలు నిర్వాసితులవుతున్నారని, వారికి చెల్లించాల్సిన నష్టపరిహారం, పునరావాస పునర్నిర్మాణ సౌకర్యాల కల్పన కోసం ఇంకా దాదాపు 33 వేల కోట్ల రూపాయలు సమకూర్చవలసి ఉన్నప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం అందుకు సంబంధించిన నిధులను విడుదల చేయకుండా తాత్సారం చేస్తోందని తెలిపారు. ముంపు ప్రాంతాలు పేరిట ఆయా గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులను సైతం కల్పించడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయని చెప్పారు. చివరికి ఇటీవల సంభవించిన తుపాను వల్ల జరిగిన నష్టపరిహారాన్ని కూడా ఎన్యుమరేషన్ చేయలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసిత ప్రజానీకానికి చెల్లించవలసిన నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్రయోజనాల కల్పనకు కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు పార్లమెంటు సభ్యులందరూ సమస్యను ఈ సెషన్‌లోనే లేవనెత్తి వారికి న్యాయం చేసేందుకు కృషి చేయాలని కోరారు.


భోగాపురం మండలం పోలిపల్లి సమీపాన బహిరంగ సభకు సిద్ధమైన వేదిక

నేడు 'యువగళం' విజయోత్సవ సభ

- హాజరు కానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి/భోగాపురం

టిడిపి యువనేత, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం-నవశకం పాదయాత్ర విజయోత్సవ సభ విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద బుధవారం జరగనుంది. మధ్యాహ్నం మూడు గంటలకు సభ ప్రారంభమై ఏడు గంటల వరకు కొనసాగే అవకాశం ఉంది. భారీ స్థాయిలో స్టేజీ, సభా ప్రాంగణం ఏర్పాట్లు చేశారు. వేదికపై 600 కూర్చునే విధంగా సిద్ధం చేశారు. వాటిలో వంద సీట్లు జనసేన పార్టీ నాయకులకు కేటాయించారు. ఈ సభకు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, టిడిపి కీలక నేతలు, అన్ని నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జులు హాజరు కానున్నట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు తెలిపారు. సభ ఏర్పాట్లను ఆయనతోపాటు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు తదితరులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి, జనసేన పార్టీల నుంచి సుమారు ఐదు లక్షల మంది తరలివస్తారని తెలిపారు. రాయలసీమ ప్రాంతం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చేందుకు ఐదు ప్రత్యేక రైళ్లను బుక్ చేశామని చెప్పారు. అద్దె ప్రాతిపదికన ఆర్‌టిసి బస్సులను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వమే రైళ్లను అద్దెకు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం బస్సులు ఇచ్చేందుకు నిరాకరించడం తగదన్నారు. మరో వంద రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు వర్ల రామయ్య, బుద్దా వెంకన్న, అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. కాగా, సభా ప్రాంగణానికి సమీపంలోని సన్‌రే రిసార్ట్‌కు నారా లోకేష్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారమే చేరుకున్నారు.

తాళాలు కాదు... అంగన్‌వాడీల గుండెలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణివల్లే రాష్ట్రంలో ఉన్న 55,605 అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయని, లక్ష మంది పైగా అంగన్‌వాడీ మహిళలు వీధుల్లోకి వచ్చారని తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరితో దాదాపు 32 లక్షల మంది పేదగర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలుకు ఆటా పాటా, ఆహారం, ఆరోగ్యం దూరం చేస్తున్నారని విమర్శించారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని, అంగన్వాడీలకు కేంద్ర ప్రభుత్వం 2011 నుండి వేతనాలు పెంచలేదని, కనీసం రాష్ట్ర ప్రభుత్వమ యినా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని కోరారు. వేతనం పెంచడానికి డబ్బు లేదంటున్న ప్రభుత్వం విశాఖ గెస్ట్‌హౌస్‌కు రూ.450 కోట్లు ఎలా ఖర్చు పెడుతుందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు తదితర న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలని ఎనిమిది రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వమే జటిలంచేసే చర్యలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ఈ కాలంలో గ్యాస్, నిత్యావసర సరుకులు, కరెంటు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ఛార్జీలు విపరీతంగా పెరిగినా అంగన్‌వాడీల వేతనాలు పెరగలేదని తెలిపారు. 2019 ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్రం కన్నా వెయ్యి ఎక్కువ ఇస్తానని జగన్ వాగ్దానం చేశారని, మేనిఫెస్టోలో కూడా పెట్టారని, దాన్నే అమలు చేయమని అంగన్‌వాడీ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయన్నారు.

పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని నాలుగు సంవత్సరాలుగా అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చి దశలవారీగా అనేక ఆందోళనలు చేసినా ప్రభుత్వంలో ఏమాత్రమూ చలనం లేదని పేర్కొన్నారు. అనివార్యంగా డిసెంబర్ 12 నుండి రాష్ట్రంలో ఉన్న లక్ష మంది పైగా అంగన్‌వాడీలు తమ సెంటర్లను మూసేసి సమ్మె బాట పట్టారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే అంగన్వాడీ యూనియన్ల నాయకులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలు దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాల పిల్లలకు సేవలు అందిస్తున్నారు. గర్భిణీ, బాలింతలకు ఆహారంతో పాటు ఆరోగ్య సలహా సేవలూ అందిస్తున్నారని వివరించారు. వారు సమ్మెలోకి వెళ్లడంతో గ్రామాల్లో పేదలు పనులకు వెళ్లడానికి కూడా పిల్లలను చూసుకునే వాళ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఒకవైపు చర్చలకు ఆహ్వానిస్తూ రెండోవైపు ప్రభుత్వ అధికారులే అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొడుతున్నారని విమర్శించారు. అర్ధరాత్రి అపరాత్రులు లేకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీలను అవమానిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ సమ్మె విరమించకపోతే విధులకు గైర్హాజరైనట్లుగా భావించి కలెక్టర్ చర్యలు తీసుకుంటారని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించ డం, అంగన్‌వాడీలకు ఒళ్లు బలిసి సమ్మెచేస్తున్నారని నోరు అదుపులేకుండా మాట్లాడిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు, అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్న టెంట్లు పీకేయడం వంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడ్డ రైల్వేకోడూరు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

అక్క చెల్లెమ్మలంటూ సమస్య పరిష్కారం చేయకుండా ప్రభుత్వమే కేంద్రాల తాళాలు పగలగొట్టడం, ప్రభుత్వ జులుం ప్రదర్శించడం, అన్ని డిపార్టుమెంట్ల వాళ్లని రంగంలోకి దించడం వల్ల మిగిలిన పనులన్నీ ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ఒకశాఖ ఉద్యోగులకు వ్యతిరేకంగా మరోశాఖ వారిని ఉసిగొల్పడం దారుణమని చెప్పారు. మిగిలిన ప్రజలకు సేవలు అందించాల్సిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, పోలీస్ యంత్రాంగం మొత్తం అంగన్‌వాడీ సెంటర్ల చుట్టూతిప్పటం వలన పరిపాలన స్తంభించే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లు తెరవద్దని మద్దతు తెలియజేసిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు కట్‌చేస్తాం, అమ్మఒడి, పెన్షన్ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆపేస్తామని బెదిరించడాన్ని ఖండించారు. ఇప్పటికైనా బేషజాలంకు పోకుండా ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

కొనసాగుతున్న కసరత్తు


- తాడేపల్లికి ఎమ్మెల్యేల క్యూ
- తమకు ఇవ్వకుంటే సతీమణులకు ఇవ్వాలని వేడుకోలు
- నెలాఖరుకు కొలిక్కిరానున్న అభ్యర్థుల ఎంపిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2024 ఎన్నికలకు సంబంధించి బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను రూపొందించేందుకు సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపికను నెలాఖరుకు ఖరారు చేసేందుకు వైసిపి కసరత్తు చేపట్టింది. పార్టీ చేయించుకున్న సర్వేలను రీజనల్ కో-ఆర్డినేటర్లకు అందజేసి టికెట్ అంశంపై సిట్టింగ్‌లకు తేల్చిచెబుతున్నారు. ఇప్పటికే మొదటి విడతలో ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో 11 మంది ఇన్‌ఛార్జులను మారుస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల పార్టీకి క్షేత్రస్థాయిలో వ్యతిరేకత రావడంతో మలిజాబితా విడుదలపై ఆచితూచి అడుగులు వేస్తోంది. సోమవారం ఉభయగోదావరి జిల్లాల నేతలతో చర్చించిన ముఖ్యమంత్రి మంగళవారం కొంతమంది నేతలు, ఆశావహులతోనూ చర్చలు జరిపారు. గోదావరి జిల్లాలకు సంబంధించి సిట్టింగులకు టికెట్‌లపై తేల్చిచెప్పినా జాబితాను ప్రకటించకపోవడంతో పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసేందుకు తాడేపల్లికి క్యూ కట్టారు. తమ మీద వ్యతిరేకత వుంటే తమ సతీమణులకైనా టికెట్లు ఇవ్వాలని తాడేపల్లి చుట్టూ తిరుగుతున్నారు. మంగళవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కుటుంబంతో కలిసి సిఎంను కలిశారు. రాష్ట్రంలో 82 మంది ఎమ్మెల్యేలను మార్చాలని వైసిపి తీసుకున్న నిర్ణయం సిట్టింగ్‌లలో తీవ్రమైన ఆందోళనను రేకెత్తిస్తోంది. సిఎంను ఒప్పించుకునేందుకు సిట్టింగ్‌లు విశ్వప్రయత్నాలను చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు సిఎంను కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వచ్చిన వారిలో మంత్రులు పినిపే విశ్వరూప్, గుమ్మనూరు జయరామ్ కూడా వున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో తూర్పుగోదావరి జిల్లా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాల మార్పులపై వీరితో సిఎం జగన్ చర్చించి అనంతరం ప్రత్యామ్నాయం చూపుతామని హామీ ఇస్తున్నట్లు తెలిసింది. సిట్టింగులతో మాట్లాడాక పోటీచేసే స్థానాల విషయమై స్పష్టత ఇస్తున్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్య, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ప్రసాదరాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే మంత్రి ఉషశ్రీ చరణ్, కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే రఘురామరెడ్డి, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషా, మాజీ మంత్రి శంకరనారాయణ తాడేపల్లికి వచ్చి సిఎంఒలో పార్టీ ముఖ్యనేతలతో చర్చించినట్లు తెలిసింది. సీటు ఇవ్వడం కుదరదని, అధికారంలోకి వచ్చాక ప్రత్యామ్నాయం చూస్తామని చెప్పినట్లు తెలిసింది. గోదావరి జిల్లాల్లో పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఖరారైనా వ్యతిరేకత రాకుండా అందరితో చర్చించాక ఇన్‌ఛార్జులను ఖరారు చేసి జాబితాను ప్రకటించే అవకాశాలున్నట్లు తెలిసింది.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ర్యాపిడ్ టెస్టు కిట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ర్యాపిడ్ టెస్టు కిట్లను సిద్ధం చేయాలని వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. రోజుకు కనీసం వెయ్యి పరీక్షలు నిర్వహించేలా ర్యాపిడ్ కిట్లను సిద్ధం చేయాలన్నారు. జ్వరం లేదా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి టెస్టు తప్పనిసరి చేయాలన్నారు.



శ్రీవారి సేవలో రాష్ట్ర గవర్నర్

ప్రజాశక్తి -తిరుమల, రేణిగుంట

తిరుమల శ్రీవారిని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి ఆహ్వానం పలికారు. అర్చక బృందం ఇస్తికఫాల్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికింది. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని టిటిడి చైర్మన్, ఇఒ అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విజిఒ నందకిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు సాదర వీడ్కోలు

తిరుపతి, తిరుమలలో రెండు రోజుల పర్యటన ముగించుకొని మంగళవారం సాయంత్రం రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి విజయవాడకు తిరుగు ప్రయాణమైన గవర్నర్‌కు సాదర వీడ్కోలు లభించింది. జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వర రెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ భారతి, ఆర్‌డిఒ నిశాంత్ రెడ్డి వీడ్కోలు పలికారు.

ఉనికి కోసమే లోకేష్ పాదయాత్ర

- ముగింపు సభలో యాంకరింగ్ కోసమే పవన్
- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజాదరణ కోల్పోయిన టిడిపి ఉనికి కోసమే నారా లోకేష్‌తో పాదయాత్ర చేయించిందని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. పాదయాత్ర ఫ్లాప్ కావడంతో సినిమా సెలబ్రిటీ అయిన పవన్‌కల్యాణ్ యాంకరింగ్‌తో పాదయాత్ర ముగింపు సభకు టిడిపి సమాయత్తం కావడం సిగ్గుచేటన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరూ గుర్తించని యాత్రగా లోకేష్ యాత్ర మిగిలిపోయిందన్నారు. పాదయాత్రకు ప్రజల్లో ఆదరణ లేక యాంకర్ ఉదయభానును తెచ్చి మీటింగ్ పెట్టుకోవాల్సిన దుస్థితి టిడిపికి వచ్చిందని విమర్శించారు. బాలకృష్ణది కూడా సభలో యాంకరింగ్ పాత్రేనని ఎద్దేవా చేశారు. వైసిపి అభ్యర్థులకు ఇతర ప్రాంతాల్లో అవకాశం కల్పిస్తే టిడిపికి వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు కూడా చంద్రగిరి నుంచి కుప్పం నియోజకవర్గానికి మారారనే అంశాన్ని టిడిపి గుర్తుంచుకోవాలన్నారు.

విద్యుత్ తీగ తగిలి వన్యప్రాణి మృతి?

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

పంటను అడవి పందులు పాడు చేయకుండా రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి వణ్యప్రాణి మృతి చెందింది. ఈ ఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం పిచ్చయ్యబావి తండా సమీపంలో మంగళవారం వెలుగు చూసింది. అయితే, నాలుగు రోజుల కిందటే ఈ ఘటన జరిగినా మృతి చెందిన జంతువు ఏదీ అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. విద్యుత్ తీగలు తగిలి చనిపోయిన వన్యప్రాణిని కొందరు వ్యక్తులు రహస్యంగా సమీపంలోని కొండపైకి తీసుకెళ్లి దహనం చేశారన్న సమాచారంతో మంగళవారం అటవీశాఖాధికారులు ఘటనా స్థలికి వెళ్ల అస్థికలు, ఇతర ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. పిచ్చయ్యబావితండాకు వెళ్లి వన్యప్రాణి చనిపోయిన అంశంపై కూపి లాగారని సమాచారం. దీనిపై జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రను సంప్రదించగా.. ఏదో జంతువును చంపి దహనం చేసినట్లు తెలిసిందని, దహనం చేసిన జంతువు అస్థికలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నామని చెప్పారు. నివేదిక వచ్చాకే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అయితే, చనిపోయిన జంతువు పెద్దపులి అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రుషికొండను బోడికొండ చేశారు : పురందేశ్వరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

వైసిపి ప్రభుత్వం విశాఖలోని రుషికొండను బోడికొండగా మార్చేసిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డి.పురందేశ్వరి విమర్శించారు. విశాఖలో ఆమె మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ విశాఖలో రైల్వే జోన్ కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్థలం కేటాయించకుండా బిజెపిపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విశాఖలో ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వని కారణంగానే అక్కడ ఆస్పత్రి పనులు ముందుకు కదలడం లేదని తెలిపారు. భూమి చూపని కారణంగానే విశాఖలో మెడికల్ కాలేజీ రాలేదన్నారు. వీటిన్నింటికీ గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. వైజాగ్ - చెన్నై కారిడార్‌తో లక్షా 80 వేల మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. పాలకొల్లులోని టిడ్కో ఇళ్లను తనఖా పెట్టి రూ.184 కోట్లను ప్రభుత్వం రుణంగా తీసుకుందని విమర్శించారు. సమావేశంలో ఎంపి జివిఎల్.నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న లక్ష్మణరావు



ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

మానసిక వికాసానికి బాలోత్సవాలు దోహదం

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు


ప్రజాశక్తి-విజయవాడ అర్బన్, ప్రతినిధి

చిన్నారుల మానసిక వికాసానికి బాలోత్సవం వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. పిల్లల ఆకాంక్షల అణచివేత వల్లే నేడు బాలోత్సవాలు విశేష ప్రాచుర్యం పొందాయని, ఒత్తిడి నుంచి బయటపడి మానసిక వికాసం పొందేందుకు ఇదే మార్గమని విద్యార్థులు భావిస్తున్నారని తెలిపారు. విజయవాడ మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో మూడు రోజులపాటు జరగనున్న బాలోత్సవం 6వ పిల్లల పండుగ పద్మవిభూషణ్ ఎంఎస్.స్వామినాథన్ వేదిక (సిద్ధార్థ ఆడిటోరియంలో)పై ఆనందోత్సాహాల మధ్య మంగళవారం ప్రారంభమైంది. తొలుత జాతీయ జెండాను లక్ష్మణరావు, బాలోత్సవం జెండాను బాలోత్సవం అధ్యక్షులు రామరాజు ఆవిష్కరించారు. అనంతరం రామరాజు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో లక్ష్మణరావు మాట్లాడారు. రాష్ట్రంలో 74 లక్షల మంది విద్యార్థుల్లో 36 లక్షల మంది కార్పొరేట్ స్కూళ్లలోనే చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన ఆట మైదానాలు ఉంటే కార్పొరేట్ స్కూళ్లను అపార్టుమెంట్లలో నిర్వహిస్తున్నారని వివరించారు. క్రీడా మైదానాల్లేక, ఆట, పాటల్లేక విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఒత్తిడితో సతమతమవుతున్న విద్యార్థులను బాలోత్సవాలు ఎంతగానో ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఆరేళ్ల కిందట విజయవాడలో ఏర్పడిన అమరావతి బాలోత్సవం ప్రతిసారీ వేలాది మంది పిల్లలను వికాసవంతులను చేసే కృషి ముమ్మరంగా చేస్తోందన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలకు బాలోత్సవాలు విస్తరించాయని తెలిపారు. 26 జిల్లాల్లో 40 చోట్ల బాలోత్సవాలు జరుగుతున్నాయని, వీటిని వంద చోట్లకు విస్తరించి నిర్వహించాలని నిర్వాహకులు ఆలోచిస్తుండడం మంచి విషయమన్నారు. ప్రజలు కూడా ముందుకొచ్చి వీటిని మరింత ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ డిజిఎం మనీష్ కుమార్, ఎన్‌టిఆర్ జిల్లా డివైఇఒ కెవిఎన్ కుమార్, అమరావతి బాలోత్సవం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ పాల్గొన్నారు. తొలుత బాలోత్సవం కార్యదర్శి కొండలరావు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

ఒపిఎస్ అమలు చేసే పార్టీకే మద్దతు

- ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం దశల వారీగా పోరాటం
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/ గూడూరు



ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒపిఎస్ అమలు చేసే పార్టీకే తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్క వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఆర్థిక బకాయిల విడుదల కోసం దశలవారీగా ఉద్యమాలను చేపట్టనున్నామన్నారు. అందులో భాగంగానే మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి సమస్యలను తీసుకెళుతున్నామని చెప్పారు. ఈ నెల 27న మండల, తాలూకా కేంద్రాల్లో ఆరు గంటలు, జనవరి మూడున జిల్లా కేంద్రంలో 12 గంటలు, జనవరి ఏడున రాష్ట్ర కేంద్రంలో 36 గంటల పాటు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కర్నూలు జిల్లా సిబెళగల్ మండలం పోలకల్‌లో యుటిఎఫ్ సీనియర్ నాయకులు చెన్నకేశవరెడ్డి అంత్యక్రియలలో వారు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ దశలవారి ఉద్యమంలో భాగంగా పాణ్యం ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డికి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె. సుధాకర్‌కు యుటిఎఫ్ ప్రతినిధి బృందం వినతి పత్రాలను అందజేసింది. అనంతరం విలేకరులతో వెంకటేశ్వర్లు, ప్రసాద్ మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రూ .11 వేల కోట్లకు పైగా చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తారీకు వేతనాలు చెల్లించాలని కోరారు. 15వ తేదీ వరకు కూడా జీతాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సకాలంలో బ్యాంకు వాయిదాలు చెల్లించకపోవడంతో పెనాల్టీలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పిఎఫ్, ఎపిజిఎల్ఐ, పిఆర్‌సి, డిఎ, అరియర్లు, సురేందర్ లీవులు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె. శ్రీనివాస్, కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సైనికురాలిగా పనిచేస్తా

- మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఈసారి ఎన్నికల్లో తనకు సీటు లేదని ప్రచారం చేసినంత మాత్రాన భయపడేది లేదని, నగరిలో ఎవరికి సీటు ఇచ్చినా జగనన్న సైనికురాలుగా పనిచేస్తా' అని టూరిజం శాఖా మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. తిరుమల శ్రీవారిని ఆమె మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. గడప గడపకూ తిరుగుతూ పార్టీ కోసం పనిచేసిన వారికి కచ్చితంగా జగనన్న సీటు కేటాయిస్తారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందంజలో ఉండే ఎమ్మెల్యేల్లో తాను ఒకరినని, తాను జగన్‌కు సైనికురాలినని, ఆయన కోసం ప్రాణత్యాగం చేయడానికైనా సిద్ధమని తెలిపారు. తనకు టికెట్ నిరాకరించినా ఆయన వెంటే ఉంటానన్నారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన 'వై నాట్ 175' లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగస్వామ్యం అవుతానని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని, ముఖ్యమంత్రి సూచనలకు కట్టుబడి ఉంటానన్నారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశానని తెలిపారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు లేరని రోజా ఎద్దేవా చేశారు.

అంగన్‌వాడీల డిమాండ్స్ నెరవేర్చాలి

- ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలు డిసెంబరు 12 నుంచి చేస్తున్న నిరవధిక సమ్మెకు ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రూపాదేవి, కె ధనలక్ష్మి సంపూర్ణ మద్దతు తెలిపారు. సమ్మె డిమాండ్స్, విఒఎల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీరాజ్‌శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి రాజశేఖర్‌కు మెయిల్ ద్వారా, సెర్ప్ సిఇఒ ఇంతియాజ్‌కు కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చకుండా వేధించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. సెంటర్ తాళాలు పగులకొట్టడం చట్టవిరుద్ధమన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే వెలుగు విఒఎలు కూడా ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతారని అన్నారు.

ఎన్‌ఆర్‌ఐల సేవలను పార్టీ మరువదు

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ ఎదుగుదలల్లో ప్రవాస భారతీయులు పోషిస్తున్న పాత్ర, వారు అందిస్తున్న సహకారం ఎన్నటికీ పార్టీ మరువదని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. జనసేన ఆశయాలను కాపాడుకుంటూ రాష్ట్ర భవిష్యత్తు కోసం చేసే ప్రయాణంలో ఎన్ఆర్ఐలు తమ వంతు పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ ఆస్ట్రేలియా కన్వీనరు కోలికొండ శశిధర్ ఆధ్వర్యంలో యుకె, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, జర్మనీ, నెదర్లాండ్‌కు చెందిన జనసేన ఎన్ఆర్ఐ బృందాలు పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పార్టీ సహాయ నిధికి రూ.1.30 కోట్లు విరాళంగా అందజేశారు. ప్రవాస భారతీయుల మద్దతు అభినందనీయమని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

త్వరలో సీలేరు పంప్డు స్టోరేజ్ ప్రాజెక్టుకు అనుమతులు

- విద్యుత్ సౌధ సూపరింటెండెంట్ ఇంజినీర్ రవీందర్ రెడ్డి

ప్రజాశక్తి -సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)



ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి మండలం సీలేరు వద్ద పార్వతీనగర్ సమీపంలో నిర్మించబోయే 1350 మెగావాట్ల సామర్థ్యంగల పంప్డు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ, ఫారెస్ట్ క్లియరెన్స్ అనుమతులు మరో మూడు నెలల్లో రానున్నాయని విజయవాడ విద్యుత్ సౌధ సూపరింటెండెంట్ ఇంజినీర్ (సివిల్) రవీందర్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రదేశాన్ని డిఎఫ్ఒ సిహెచ్.సూర్యనారాయణ, చింతపల్లి సబ్ డిఎఫ్ఒ బెర్నాడ రాజు, ఎపి జెన్కో అధికారుల బృందంతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాలు నిర్మించి దాదాపు 50 సంవత్సరాలు కావొస్తోందని, కొత్త టెక్నాలజీతో హైడల్ పవర్ ఉత్పత్తి చేయాలన్న తలంపుతో పంప్డు స్టోరేజీ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు.

ఇప్పటికే సీలేరులోని ఈ ప్రాజెక్టుకు కొన్ని అనుమతులు వచ్చాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సీలేరు అటవీ రేంజ్ పరిధిలో 215 హెక్టార్లు భూమి అవసరం ఉందని, ఆ భూమికి బదులుగా భూమిని అటవీ శాఖ ఇవ్వడానికి సిద్ధమైందని, ఈ క్రమంలోనే సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో భూమిని పరిశీలించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) చంద్రశేఖర్ రెడ్డి, ఇఇ జి.ప్రభాకర్, ఎడిఇలు పైడిరాజు, టి.అప్పలనాయుడు, ఎఇలు సిహెచ్.సురేష్, చింతపల్లి రాజు, సీలేరు రేంజ్ అధికారులు శ్రీనివాసరావు, వీరేంద్ర, డిఆర్ఓ సింహాచలం పడాల్, దారకొండ సెక్షన్ ఆఫీసర్ సతీష్ పాల్గొన్నారు.



ఆర్ఎఆర్ఎస్ ప్రచురణలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఆహార, పోషక భద్రత రైతులతోనే సాధ్యం

- ఎన్‌జి రంగా వ్యవసాయ వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - అనకాపల్లి

దేశంలోని ప్రజలకు ఆహార, పోషక భద్రత రైతుల పంటలతోనే సాధ్యమని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. అనకాపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం జరిగిన 64వ కిసాన్ మేళా సభను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. వ్యవసాయం పట్ల ఎప్పటికప్పుడు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 2050 నాటికి దేశ జనాభా భారీగా పెరగనుందని, వారందరికీ ఆహారం అందాలంటే రైతులకు కావాల్సిన సాంకేతికతను అందించాల్సిన బాధ్యత వ్యవసాయ శాస్త్రవేత్తలపై ఉందన్నారు. అందుకోసం వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందాల్సి ఉందని పేర్కొన్నారు. పంచదార, వరి, కూరగాయలు వంటి ఎగుమతుల ద్వారా దేశానికి మంచి ఆదాయం చేకూరుతోందని తెలిపారు. రసాయనిక, యాంత్రీకరణ విధానాలతో రైతులు ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవచ్చని సూచించారు. జడ్ఆర్ఎఎస్, కిసాన్ మేళా, శిక్షణ సందర్శన వంటి కార్యక్రమాల్లో రైతుల సమస్యలను గుర్తించి వారికి కావలసిన అంశాల పట్ల పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ బోర్డు సభ్యులు సాయిలక్ష్మి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాథరావు, వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ పాల్గొన్నారు. తొలుత వ్యవసాయంపై ఆర్ఎఆర్ఎస్ ముద్రించిన పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు.

17 మంది ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

17 మంది ఐఎఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం జిఓ ఆర్‌టి నెంబర్ 2451ని విడుదల చేసింది. గ్రామ, వార్డు సచివాలయం అడిషనల్ డైరెక్టరు 2017 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ హెచ్‌ఎం ధ్యానచంద్రను యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం, కల్చరల్ ఎమ్‌డిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో తెనాలి సబ్ కలెక్టరు 2020 బ్యాచ్‌కు చెందిన గీతాంజలి శర్మను నియమించింది. శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టరు 2020 బ్యాచ్‌కు చెందిన టిఎస్ చేతన్‌ను గ్రామ, వార్డు సచివాలయం డైరెక్టరుగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఆదోని సబ్ కలెక్టరు 2020 బ్యాచ్‌కు చెందిన అభిషేక్‌కుమార్‌ను నియమించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టరు జె శివ శ్రీనివాసులు బిసి వెల్ఫేర్ డైరెక్టరుగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు అక్కడ పనిచేస్తున్న కె హర్షవర్ధన్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పజెప్పింది. రంపచోడవరం సబ్ కలెక్టరు శుభం భన్సాల్ తిరుపతి జాయింట్ కలెక్టరుగా బదిలీ అయ్యారు. పెనుకొండ సబ్ కలెక్టరు కొల్లా బత్తుల కార్తీక్ అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టరుగా, మార్కాపురం సబ్ కలెక్టరు సేదు మాధవన్ ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ సిఇఒగా, కందుకూరు సబ్‌కలెక్టరు శోభిక ఎస్ఎస్ మధ్యాహ్న భోజన పథకం స్పెషల్ ఆఫీసరుగా నియమించింది. పెద్దిటి ధాత్రిరెడ్డిని శిక్షణానంతరం పాడేరు సబ్ కలెక్టరుగా నియమితులయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సబ్ కలెక్టరుగా శిక్షణ పూర్తి చేసుకున్న అశుతోష్ శ్రీవాత్సవను, అదే విధంగా కందుకూరు సబ్ కలెక్టరుగా గొబ్బిల విద్యాధరిని, తెనాలి సబ్ కలెక్టరుగా ప్రకార్ జైన్‌ను, మార్కాపురం సబ్ కలెక్టరుగా రాహుల్‌మీనాను, ఆదోని సబ్ కలెక్టరుగా శివనారాయణ శర్మను, రంపచోడవరం సబ్ కలెక్టరుగా సూరపాటి ప్రశాంత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది.

నేటి నుంచి బడ్జెట్ భేటీలు

- మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆర్థికశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

బడ్జెట్ కసరత్తు సమావేశాల్లో భాగంగా అన్ని శాఖలతో భేటీలు నిర్వహించేందుకు ఆర్థికశాఖ సిద్ధమైంది. బుధవారం నుంచి మూడు రోజులపాటు ఈ సమావేశాలు నిర్వహించనుంది. ఈ సమావేశాల్లో అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన కార్యక్రమాలు, ప్రాధాన్యతా పథకాలు, రాష్ట్రాలకు కేంద్రం అందిస్తున్న ప్రాయోజిత పథకాలు, ఆర్ఐడిఎఫ్, ఇఎపి పథకాలపైనా చర్చ నిర్వహించనున్నారు. ఇదే సమయంలో ఎస్సీ, ఎస్టీ, బిసి తరగతులకు కావాల్సిన నిధులు, పిల్లల బడ్జెట్, మహిళల బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్ రూపకల్పలపైనా చర్చించనున్నారు. వీటి కోసం ఎంత నిధులు కావాలి, గత బడ్జెట్‌లో ఎంత నిధులు ఖర్చు చేశారన్నదానిపైనా చర్చ జరగనుంది. రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే ఆదాయం ఎంత ఉంటుందన్నది కూడా చర్చల్లో కీలకంగా ఉంటుందని సమాచారం. ఈ కసరత్తు భేటీల్లో భాగంగా బుధవారం సంక్షేమ శాఖలు, గృహ నిర్మాణం, కార్మిక, క్రీడా, యువజన శాఖలతో సమావేశమవుతారు. గురువారం పాఠశాల విద్య, వృత్తి నైపుణ్యం, ఉన్నత విద్య, వ్యవసాయం, పశు సంవర్ధకశాఖ, పౌర సరఫరాలు, ప్రణాళిక, విద్యుత్ రంగాలపైనా, శుక్రవారం నీటి పారుదల, రవాణా, రహదారులు, మున్సిపల్, పట్టణాభివృద్ధి, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామ, వార్డు సచివాలయాలు, మౌళికాభివృద్ధి శాఖలతో సమావేశాలు నిర్వహిస్తారు.

సిఎం అంగీకరించినా విడుదల కాని విఆర్ఎ డిఎల ఉత్తర్వులు

- ఎపిజెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించినా విఆర్ఎల డిఎలకు సంబంధించిన ఉత్తర్వులు ఇప్పటికీ విడుదల కాలేదని ఎపిజెఎసి అమరావతి పేర్కొంది. ఐదేళ్లు దాటినా విఆర్ఎల వేతనాలు పెరగలేదన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎపి విఆర్ఎ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 27 వేలమంది విఆర్ఎలను అన్ని ప్రభుత్వ విభాగాలు వారి గ్రామస్థాయి అవసరాలకు ఉపయోగించుకుంటున్నారన్నారు. 2018 నుంచి 2020 వరకు ఇచ్చిన డిఎను వెనక్కి తీసుకున్నారని పేర్కొన్నారు.

ఎపి విఆర్ఎల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పోలుకొండ రాంబాబు

ఎపి విఆర్ఎల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉన్న పోలుకొండ రాంబాబును రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిజెఎసి అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఎపిజెఎసి అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ఛైర్మన్ పారె లక్ష్మి, ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దొప్పలపూడి ఈశ్వర్, విఆర్ఎ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ, ఎపి క్లాస్-4 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మల్లేశ్వరరావు, విఆర్ఒల అసోసియేషన్ స్టేట్ అసోసియేట్ ఛైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

ఖనిజాల అన్వేషణకు ప్రభుత్వంతో సమన్వయం

- సిహెచ్ వెంకటేశ్వరరావు
- విజయవాడలో తొలి జిఎస్ఐ క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఖనిజాల అన్వేషణకు సంబంధించిన విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో మెరుగైన సమన్వయాన్ని కొనసాగిస్తామని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) దక్షిణ ప్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ సిహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మొదటి క్యాంపు కార్యాలయాన్ని జిఎస్ఐ మంగళవారం విజయవాడలోని కానూరులో ఎపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇఎస్ఐ రాష్ట్రానికి మినరల్ డేటాను అందజేస్తుందన్నారు. క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వివిఎల్ కాంతారావు కీలకపాత్ర పోషించారన్నారు. కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో తమకు స్థానికంగా సహకరించిన ఎపిఎమ్‌డిసి డిఎంజి, డైరెక్టర్ విజి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మహాపాత్ర మాట్లాడుతూ మెరుగైన సమన్వయం కోసం రాష్ట్రంలో చేపట్టే ఖనిజాన్వేషణ ప్రాజెక్టులపై జిఎస్ఐ, రాష్ట్ర డిఎంజిల మధ్య పరస్పర సహకారం, బ్లాక్‌ల వేలం, ఖనిజ లభ్యత సమాచారం పంచుకోవడం, సాంకేతిక మార్గదర్శకత్వం అవసరాలకు కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యాలయంలో ఎపి డైరెక్టర్ (టెక్నికల్ కో ఆర్డినేషన్) స్టేట్ యూనిట్, డాక్టర్ అపూర్బా బెనర్జీ, డైరెక్టర్ ఆఫ్ మైనింగ్ అండ్ జియోలజీ (డిఎంజి) డి శ్రీనివాసరావు, డైరెక్టర్ వివేక్‌శర్మ, ఎపిఎమ్‌డిసి అధికారులు పాల్గొన్నారు.

పులివెందులలో సిబిఐ అధికారులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వివేకానందరెడ్డి కేసు విషయమై సిబిఐ అధికారులు మంగళవారం పులివెందులకు వచ్చారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అప్పటి విచారణ అధికారి రామ్‌సింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డిపై ఈ నెల 15న పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. థర్డ్ డిగ్రీ ఉపయోగించి కేసులో సంబంధం లేని వ్యక్తుల పేర్లు చెప్పాలని బలవంతం చేసినట్లు అప్పటి సిబిఐ అధికారి రామ్‌సింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వివేకా పిఎ కృష్ణారెడ్డి గతంలో కోర్టును ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై వారిపై కేసు నమోదైంది. కేసుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని పులివెందుల పోలీసులను కోర్టు ఆదేశించింది. సిబిఐ అధికారి రామ్‌సింగ్ తరుపున మంగళవారం స్థానిక పులివెందుల కోర్టుకు సిబిఐ అధికారులు వచ్చారు. విచారణ సమయంలో కృష్ణారెడ్డి నుంచి సేకరించిన వాంగ్మూలాన్ని కోర్టుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. పులివెందులలో న్యాయమూర్తి లేకపోవడంతో జమ్మలమడుగు కోర్టుకు వెళ్లారు. పులివెందులలో సిబిఐ అధికారుల కదిలికతో వివేకానందరెడ్డి హత్య కేసు మళ్లీ తెరపైకి వచ్చింది.

షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌పై ఐటి దాడులు

- రెండో రోజూ కొనసాగిన తనిఖీలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగర శివారులోని పారిశ్రామికవాడలో ఏర్పాటైన షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీలో ఐటి దాడులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన 40 మంది ఐటి అధికారులు సోమవారం రాత్రి చేపట్టిన సోదాలు మంగళవారం వరకూ కొనసాగాయి. 50 మంది సిఆర్‌పిఎఫ్ పోలీసుల భద్రత మధ్య సోదాలు జరుగుతున్నాయి. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీ గత నాలుగేళ్లుగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కాంట్రాక్టుల దగ్గర నుంచి జలాశయాల వెనుకజలాల నుంచి రివర్స్ హైడల్ ప్రాజెక్టు కాంట్రాక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే కాంట్రాక్టు పనులను దక్కించుకున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐటి అధికారుల విభాగం తనిఖీలు కొనసాగిస్తోంది. కంపెనీ దస్త్రాల పరిశీలనతో పాటు, దాని అనుబంధ సంస్థలు, కడప, హైదరాబాద్ నగరాల్లోని కంపెనీ యజమాని సమీప బంధువుల ఇళ్లను కూడా సోదాలు చేసినట్లు తెలిసింది.

సీజ్ చేసిన కారు రిలీజ్‌కు లంచం

- ఎసిబికి చిక్కిన ఒంగోలు సెబ్ సిసి

ప్రజాశక్తి- ఒంగోలు

సీజ్ చేసిన కారును విడిచిపెట్టేందుకు లంచం అడిగిన సెబ్ అధికారిని ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి అధికారుల వివరాల మేరకు.. ఓ కేసులో సీజ్ చేసిన కారును విడిచిపెట్టేందుకు ఒంగోలు సెబ్ కార్యాలయంలో క్యాంపు క్లర్క్‌గా (సిసి) విధులు నిర్వహిస్తున్న ఫరూక్ అహ్మద్ రూ. 15వేలు లంచం డిమాండ్ చేశారు. కారుకు సంబంధించిన వ్యక్తి తొలుత రూ. ఎనిమిది వేలు ఇచ్చాడు. కారు రిలీజ్ చేయమని అడగ్గా మిగిలిన రూ. ఏడు వేలు ఇవ్వాలని ఫరూక్ డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన సదరు వ్యక్తి ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల సూచనల మేరకు రూ.ఏడు వేలు తెచ్చి ఫరూక్ అహ్మద్‌కు ఇస్తుండగా ఎస్‌సిబి డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

సంపాదకీయం


ప్రజాస్వామ్యం ఖూనీ

నూతన పార్లమెంట్ భవనంలో ప్రజాస్వామ్యానికి సమాధి కడుతున్నారు! చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన 141 మంది ఎంపిలను శీతాకాల సమావేశాలు పూర్తయ్యేవరకూ పార్లమెంట్‌లో అడుగుపెట్టొద్దంటూ హుకుం జారీ చేశారు. మమ్మల్నే ప్రశ్నిస్తారా అన్నట్టుగా ఉంది నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం తీరు. లోక్‌సభలో చొరబడిన ఆగంతకులకు పాస్‌లు ఇచ్చిన బిజెపి ఎంపిపై చర్యలు తీసుకోలేదు. కనీసం ప్రశ్నించలేదు. పైగా ప్రధాని, హోం మంత్రి ఎక్కువ రోజులు సభకు రారు. సభలో మాట్లాడరు. బయట ఇంటర్వ్యూలు ఇస్తారు. పార్టీ సమావేశాల్లోనూ మాట్లాడతారు. భద్రతా వైఫల్యం తీవ్రమైన అంశం, అందరూ ఖండించాలి, ప్రతిపక్షాలు రాజకీయం చేయడం మానుకోవాలి, దీని వెనుక ఉన్న వ్యక్తుల మూలాలను, వారి ఉద్దేశాలను తెలుసుకోవడం కూడా అంతే అవసరం అంటూ సభ బయట సభా నాయకుడు సుద్దులు చెబుతున్నారు. భద్రతా వైఫల్యానికి బాధ్యత వహించి, దాన్ని సరిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవడం మాని ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేస్తున్నారు. "డిసెంబర్ 13న ఏం జరిగింది? ఎలా జరిగింది? హోం మంత్రి ప్రకటన చేయాలి?" ఇదే ఇండియా వేదికలోని పార్టీలు చేస్తున్న ఏకైక డిమాండ్.

మణిపూర్ నెలల తరబడి అగ్నిగుండంగా మారినా పార్లమెంట్‌లో మాట్లాడరు. చిట్టచివరికి ప్రధానిని మాట్లాడించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు అవిశ్వాసం పెడితే గంటల తరబడి ప్రతిపక్షాలను దూషిస్తూ సాగిన ప్రసంగంలో రెండు నిమిషాలు కూడా మణిపూర్ మంటలపై మాట్లాడలేదు. బాధితులకు భరోసా ఇవ్వలేదు. తమ పాలనలో, డబుల్ ఇంజిన్ ఇలాకాల్లో... ఎన్ని ఘోరాలు జరిగినా, తమ ఎంపీలు ఎన్ని నేరాలు చేసినా నోరు మెదపరు. లైంగికంగా వేధించారంటూ దేశ రాజధానిలో రెజ్లర్లు పోరాడి, కన్నీరు మున్నీరైనా పట్టించుకోరు. ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్‌భూషణ్ పార్లమెంట్‌లో దర్జాగా కూర్చుంటున్నారు. అదానీ మోసాలపై ప్రశ్నలడిగిన మహువా మొయిత్రా పార్లమెంట్ సభ్యత్వాన్ని కోల్పోయారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఎన్నికైన ప్రతినిధుల కర్తవ్యం. ఆ చర్చల ఆధారంగా ప్రజా సమస్యలకు పరిష్కారాలను వెతకాలి. అందుకు భిన్నంగా నిరంకుశత్వమే మోడీ ప్రభుత్వ అజెండాగా ఉంది. 14, 78, 49... ఇలా వరుసగా మూడు రోజుల్లో 141 మందిని సస్పెండ్ చేశారు. ఇంకా ప్రతిపక్షాలకు చెందిన 47 మంది సభ్యులే సభలో మిగిలారు. గతంలో ఇంతమంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి, బిల్లులను ఆమోదించుకునేందుకు తెగబడిన సర్కారే కేంద్రంలో లేదు.

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యాలు బిజెపి ప్రభుత్వాల ఏలుబడిలోనే ఎక్కువగా సంభవిస్తున్నాయి. 22 ఏళ్ల క్రితం పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగినప్పుడు ప్రధానిగా వాజ్‌పేయి, హోం మంత్రిగా అద్వానీ ఉన్నారు. నాటి ఉగ్రదాడి వార్షిక దినం సందర్భంగా దాడులు చేస్తామంటూ ఖలిస్థానీ తీవ్రవాది గురుపత్వంత్‌సింగ్ పన్ను ప్రకటించిన హెచ్చరికతో పూర్తిస్థాయి భద్రత ఉన్నప్పుడే, ప్రతి ఒక్కరినీ నాలుగైదు సార్లు శల్యపరీక్షలు చేసే యంత్రాంగం ఉన్నప్పుడే, మోడీ, అమిత్‌షా నాయకత్వంలోని సర్కారు హయాంలోనే తాజా ఘటన జరిగింది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, మణిపూర్ మారణకాండను చర్చనీయాంశం చేయడమే లక్ష్యమంటూ ఆగంతకులు పొగ బాంబులు వేసి ఊరుకున్నారు. వారు తలచుకుంటే విషవాయువులు, తుపాకులు తేగలిగే వారేమో! గొప్పలు మావి.. ఘోరాలు కిందివారివి అన్నట్టు ఈ ఘటనలోనూ మోడీ జోడీ నాయకత్వం అఘోరించింది. జరిగిన దానికి తనదే బాధ్యత అని లోక్‌సభ స్పీకర్ ప్రకటించేసుకున్నారు. దేశవ్యాప్తంగా దర్యాప్తు చేస్తున్న సంస్థలు, సస్పెండైన భద్రతా అధికారులు హోం మంత్రి నేతృత్వంలో పనిచేస్తున్నారో! స్పీకర్ నేతృత్వంలో పనిచేస్తున్నారో! మరి. తమ ఎంపి ప్రతాప సింహ ఇచ్చిన పాసులపై ఆగంతకులు రావడానికి గల కారణాలపై సమాధానం చెప్పేందుకు అధికారపక్షం ముందుకు రాకుండా సస్పెండ్ చేస్తూ పోవడం సిగ్గుచేటు. ప్రధాని, హోం మంత్రి సభలో ఉండాలని, సమాధానం చెప్పాలని అడగడం సభ్యుల కర్తవ్యం. అందుకు వారిని సభ నుంచి బహిష్కరించడం సమాధానం కాదు. ప్రజాస్వామ్యం అంతకన్నా కాదు. ప్రజాస్వామ్యాన్ని సమాధి చేయడమే!

మహనీయుల మాట



దేవుడు మానవ కల్పితం.
స్వర్గ నరకాలు లేనే లేవు.
మతం, గుళ్లు, గోపురాలు అక్కర్లేదు.
కావలసింది మానవత్వం.

– లూథర్ బర్‌బాంక్,
ప్రముఖ వృక్ష శాస్త్రజ్ఞుడు.

ఆర్టికల్ 370 - కాంగ్రెస్ కప్పదాటు వైఖరి

విశ్లేషణ



ఎస్. వినయ కుమార్

ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివాదాస్పదంగా మారింది. న్యాయకోవిదులు, మేధావులు సుప్రీం తీర్పు వల్ల కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో మున్ముందు అవాంఛనీయ పరిణామాలు జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగంపై పట్టు కలిగిన న్యాయవాదిగా పేరున్న ఫాలి నారిమన్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ లోకుర్ వంటి వారు 370 ఆర్టికల్ రద్దు చెల్లదన్నారు. కాని చిత్రం ఏమిటంటే ఆర్టికల్ 370 రద్దు చేయరాదని డిమాండ్ చేస్తూ వచ్చిన ఆ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కప్పదాటు వేస్తోంది. ఆర్టికల్ 370 రద్దుతో కాంగ్రెస్ ఏకీభవిస్తూనే, దాన్ని అమలు చేసిన పద్ధతి బాగాలేదని గోడమీది పిల్లి వాటంగా చెప్పింది.

ఆర్టికల్ 370ని రద్దు చేయాలని మొదటి నుండి బిజెపి డిమాండ్ చేస్తోంది. దాని లక్ష్యం కాశ్మీరీల ప్రయోజనం కాదు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రక్రియలో భాగంగా 370 ఆర్టికల్‌ను రద్దు చేయడంతో పాటు జమ్ము కాశ్మీర్ లోని లడఖ్ ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మోడీ ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ముస్లిం విద్వేషం సృష్టించి మెజారిటీ హిందూ ఓట్లు పొందడం బిజెపి కి ప్రధానం. కాంగ్రెస్ కూడా ఈ విషయంలో బిజెపి చెప్పుల్లో తన కాళ్లు దూర్చి హిందువుల ఓట్లు రాబట్టుకోవాలని తహతహలాడుతోంది. బిజెపి మతతత్వ విధానాలు మన రాజ్యాంగ విలువలకు, స్వాతంత్ర్యోద్యమ విలువలకు విరుద్ధమైనవి. ఈ విషయం ప్రజల ముందు వివరించి బిజెపి రాజకీయాలను ఎండగట్టాల్సిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ దానికి విరుద్ధంగా మతతత్వ ఎజెండాలో బిజెపి తో పోటీ పడాలని భావిస్తోంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఎన్నికల తర్వాతయినా కాంగ్రెస్ సోయి లోకి రాలేదు.

సుప్రీం తీర్పుపై సిపిఐ(ఎం) ఘాటుగా స్పందించింది. "ఈ తీర్పుతో సుప్రీం కోర్టు తేనెటీగల తుట్టెను కదిపింది. రాష్ట్ర శాసన సభ అభిప్రాయానికి బదులు గవర్నర్ అభిప్రాయాన్ని తీసుకొంటే చాలని, తద్వారా రాష్ట్రాల సరిహద్దులు కూడా మార్చుతూ రాష్ట్ర విభజన చేయవచ్చని సుప్రీం చెప్పినట్లయింది. సమైక్యత పేరుతో కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఇవ్వడానికే తీర్పు దోహదపడ్తోంది". అని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హెచ్చరించారు. దీనివల్ల రాజ్యాంగంలోని సమాఖ్యత త్వానికి విఘాతం కలుగుతుందని సిపిఐ(ఎం) హెచ్చరించింది.

సిపిఐ కూడా ఇదే తరహా స్పందనను వ్యక్తం చేసింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఒక ప్రకటన చేస్తూ సుప్రీం తీర్పును ప్రశ్నించారు. "బిజెపి ప్రభుత్వం చాలా హడావిడిగా జమ్ముకాశ్మీర్ ప్రజలను సంప్రదించకుండా ఆ రాష్ట్రంపై నిర్ణయం చేసింది. బిజెపి చూపిన మొండితనం దాని నియంతృత్వ ధోరణికి గుర్తు అని ఆయన విమర్శించారు. ఆర్టికల్ 370 రద్దులోని చట్టబద్ధతపై చెప్పిన తీర్పులో సుప్రీం అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటేసిందని, తాజా సుప్రీం తీర్పు సమాఖ్య వ్యవస్థకు పెద్ద విఘాతమని డిఎంకె విమర్శించింది. శివసేన సుప్రీం తీర్పును ఆహ్వానించింది. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను కూడా విలీనం చేసి గ్రేటర్ కాశ్మీర్‌కు ఎన్నికలు జరపాలని ఉద్ధవ్ థాకరే చెప్పారు. విలీనం తర్వాత ఎన్నికలు జరగడమంటే ఇక ఇప్పట్లో కాశ్మీర్ ఎన్నికలు లేనట్లే.



మాజీ హోం మంత్రి, కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం... అభిషేక్ సింఘ్వీతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దును వెనకేసుకొచ్చారు. రద్దు చేసిన విధానంపైన మాత్రమే తాము సుప్రీం కోర్టుతో విబేధిస్తున్నామని చెప్పారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ ఆర్టికల్ 370 రద్దుపై మౌనం వహించడం గమనార్హం.

'ఇండియా' కూటమిలో భాగస్వాములైన నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సి), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) సుప్రీం తీర్పుతో గట్టిగా విబేధించాయి. పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ సుప్రీం తీర్పును 'మరణ శాసనంగా అభివర్ణించారు. జమ్ము కాశ్మీర్‌కు మాత్రమే కాదు భారతదేశం అన్న అవగాహనకు కూడా తీర్పువల్ల విఘాతం కలిగిందన్నారు. కాగా నేషనల్ కాన్ఫరెన్సు నాయకుడు ఒమర్ అబ్దుల్లా సుప్రీంకోర్టును ఒప్పించడంలో తాము విఫలమైనందుకు జమ్ము కాశ్మీర్ ప్రజలు తమను క్షమించాలి అని, 2019 ఆగస్టు 5న 370ని రద్దు చేస్తూ మన నుండి లాక్కొన్న గుర్తింపు, గౌరవాలు మళ్లీ మనకు ఏదో ఒకరోజు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మాత్రం 2019లో లోక్‌సభలో ఈ అంశంపై అన్ని పార్టీలు తమ అభిప్రాయాలు తెలిపాయి. ప్రభుత్వం అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటేసింది. మేము సుప్రీం కోర్టుకు వెళ్లాం. ఇప్పుడు సుప్రీం కోర్టు తన నిర్ణయం తెల్పింది. ఇక ఇప్పుడు చెప్పగలిగిందేమీ లేదు. ప్రతిఒక్కరూ సుప్రీం కోర్టు నిర్ణయంతో ఏకీభవిస్తారని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ 2019 లోనే ఆర్టికల్ 370 రద్దును సమర్ధించింది.

ఆర్టికల్ 370ఎ కేంద్రం రద్దు చేయడానికి ఒకరోజు ముందు 2019 ఆగస్టు 4న శ్రీనగర్ లోని గుప్కర్ రోడ్డులోని నేషనల్ కాన్ఫరెన్సు అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా నివాసంలో కాంగ్రెస్ సహా పిడిపి, ఎన్‌సి పార్టీలు సమావేశమై ఆర్టికల్ 370ని సమర్ధిస్తూ ఉమ్మడి ప్రకటన చేశాయి. 2020 నవంబర్ తర్వాత పిఎజిడి నుండి కాంగ్రెస్ తప్పుకొంది. అది తప్పుకోవడానికి ఒకరోజు ముందు కేంద్ర మంత్రి అమిత్‌షా పిఎజిడిని గుప్కర్ గ్యాంగ్ గా అపవిత్ర గ్లోబల్ ఘట్బంధన్ గా అభివర్ణించారు. అంతకు ముందు జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా తొలగించాక అక్కడి ప్రజలు ఉపాధి కుంభకోణాలతో, భూమి మాఫియా, వైన్‌షాపులు, స్మార్ట్ మీటర్లు వగైరా రూపంలో దారుణమైన బాధలు పడాల్సి వచ్చిందని కాశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ చెప్పింది.

ఆర్టికల్ 370 నేపథ్యం

దేశ విభజన సందర్భంగా కాశ్మీర్ రాజు హరిసింగ్ తాను స్వతంత్ర రాజుగానే కొనసాగుతానని చెప్పారు. ఒక తుది

> ఆర్టికల్ 370ని రద్దు చేయాలని మొదటి నుండి బిజెపి డిమాండ్ చేస్తోంది. దాని లక్ష్యం కాశ్మీరీల ప్రయోజనం కాదు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రక్రియలో భాగంగా 370 ఆర్టికల్‌ను రద్దు చేయడంతో పాటు జమ్ము కాశ్మీర్ లోని లడఖ్ ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మోడీ ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ముస్లిం విద్వేషం సృష్టించి మెజారిటీ హిందూ ఓట్లు పొందడం బిజెపి కి ప్రధానం. కాంగ్రెస్ కూడా ఈ విషయంలో బిజెపి చెప్పుల్లో తన కాళ్లు దూర్చి హిందువుల ఓట్లు రాబట్టుకోవాలని తహతహలాడుతోంది.

నిర్ణయానికి రాక ముందే స్థానిక ఆదివాసీల ముసుగులో పాకిస్తాన్ సైన్యాలు కాశ్మీరుపై దాడి చేశాయి. మహారాజ హరిసింగ్ లోయను వదలి సురక్షితంగా వేరే ప్రాంతానికి వెళ్ళారు. ఆ దశలో ఆనాటి నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా (ఫరూక్ అబ్దుల్లా తండ్రి) ప్రధాన పాత్ర పోషించి భారత సైన్యాలు అక్కడ జోక్యం చేసుకొనేట్లు చూశారు. కాశ్మీర్‌లో 80 శాతం జనాభా ముస్లింలున్నా వారు పాకిస్తాన్‌తో విలీనం కావాలనుకోలేదు.

అయితే ఏదో ఒక ఒప్పందం లేకుండా, భారతదేశం తన సైన్యాలను అక్కడికి ఎలా పంపగలదని నెహ్రూ ప్రశ్నించారు. నెహ్రూ వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని గమనంలో ఉంచుకొని ఆ రాష్ట్ర ప్రజల రక్షణ కోసం భారత రాజ్యాంగంలో 370 ఆర్టికల్‌ని చేర్చుతూ హరిసింగ్‌తో ఒక ఒప్పందానికి వచ్చారు. ఆ ఒప్పందంలోని ప్రధాన అంశం "ఇద్దరు ప్రధానులు రెండు రాజ్యాంగాలు" (దో ప్రధాన్, దో విధాన్). భారత ప్రభుత్వం ఆ రాష్ట్ర రక్షణతో పాటు విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీలను చూసుకోవాలి. ఇతర అంశాలను కాశ్మీరు రాష్ట్ర అసెంబ్లీ నిర్ణయిస్తుంది. కాశ్మీరు తన స్వంత రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలి. ఆ షరతుల ప్రకారం భారత ప్రభుత్వం తన సైన్యాలను అక్కడికి పంపింది. ఆలోగా పాకిస్తాన్ కాశ్మీరు లోని మూడవ వంతు భాగాన్ని ఆక్రమించుకొంది. ఐక్యరాజ్య సమితి తీర్మానం ప్రకారం రెండు దేశాలూ తమ సైన్యాలు అక్కడ నుంచి ఉపసంహరించుకున్నాక ప్రజాభిప్రాయ సేకరణ (ప్లెబిసైట్) జరపాలి. కాని అది ఇప్పటిదాక జరగలేదు. తన ఆధీనంలో ఉన్న కాశ్మీరును ఆజాద్ కాశ్మీరుగా పాకిస్తాన్ ప్రకటించింది. క్రమంగా భారత్ కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని దిగజార్చింది. 17 ఏళ్ల పాటు షేక్ అబ్దుల్లాను జైల్లో ఉంచింది. ఈ మధ్య కాలంలో ప్రధాన మంత్రి హోదాను ముఖ్యమంత్రి హోదాగా, సదర్-ఎ-రియాసత్ హోదాను గవర్నరుగా మార్చారు. క్రమంగా భారత రాజ్యాంగాన్ని కాశ్మీరుకు వర్తింపచేశారు. ప్రజాతంత్ర ప్రక్రియ అక్కడ క్రమంగా బలహీన పడింది.

ఫరూఖ్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని 1984లో రద్దు చేశారు. ఆ తర్వాత 1987లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ రిగ్గింగ్ చేసి గెలిచిందని ఆయన ఆరోపించారు. అక్కడి ప్రజల్లో పూర్తిగా భ్రమలు తొలగి, యువకులు హింసా రాజకీయాల్లోకి వెళ్లారు. మిలిటెన్సీ పెరిగిపోయింది. దీన్ని అవకాశంగా తీసుకొని పాకిస్తాన్ తన మిలిటెంట్లను అక్కడికి పంపనారంభించింది. పరిస్థితి రోజు రోజుకూ దిగజారింది. ఆ సమయంలో ఫరూక్ అబ్దుల్లాను ఏడేళ్ల సుదీర్ఘకాలం జైలుకు పంపారు. ఆ స్థితిలో సోవియట్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అమెరికా సృష్టించిన అల్‌ఖైదా తన లక్ష్యం సాధించాక కాశ్మీరు లోయలోకి అడుగు పెట్టింది.

కాశ్మీరు పరిస్థితిని టెర్రరిజమ్ మరింత క్షీణింప చేసింది. స్థానిక ముస్లిం జనాభాకు, కాశ్మీరు పండిట్లకు మధ్య ఉన్న సామరస్యం స్థానంలో మతతత్వ కోణం జోడించారు. ఈ వక్రీకరణ టెర్రరిస్టులకు ఉపయోగపడింది. టెర్రరిస్టుల లోని ఒక సెక్షన్ హిందువులను లక్ష్యంగా చేసుకుంది. కాశ్మీరు లోని ముస్లిలందరూ టెర్రరిస్టులనే భావనతో అప్పటి గవర్నరు జగ్మోహన్ ప్రవర్తించారు. పండిట్లు కాశ్మీరు లోయను వదిలి వెళ్తే! తాను మిలిటెంట్లను ఏరేయగలనని గవర్నర్ భావించారు. గవర్నరు ప్రోత్సాహంతో పండిట్లు లోయను వదిలి కాందిశీకుల శిబిరాల్లో తలదాచుకొన్నారు. టెర్రరిస్టుల వల్ల ముస్లిం జనాభా సైతం చాలా బాధలను అనుభవించింది. వారిని కూడా టెర్రరిస్టులు చంపారు. కొందరు ముస్లింలు కూడా లోయను వదిలేసి వచ్చారు. రెండు పొరుగు దేశాల మధ్య ఏర్పడిన సమస్యకు మతం రంగు అద్దారు.

భారత ప్రభుత్వం అక్కడి ప్రజల జాతి ఆకాంక్షలను అణిచి వేసింది. ఎన్నికైన ప్రభుత్వాలను పదే పదే తొలగించింది. తమకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలన్న డిమాండును పట్టించుకోలేదు. అవుట్‌లుక్ పత్రిక (2000 అక్టోబరు 16) జరిపిన అభిప్రాయ సేకరణలో 74 శాతం మంది కాశ్మీరీలు తమకు ప్రత్యేక గుర్తింపు కావాలని కోరారు. 16 శాతం మంది కాశ్మీరుకు స్వయం ప్రతిపత్తి కావాలన్నారు. కేవలం రెండు శాతం మాత్రమే పాకిస్తాన్‌తో విలీనం కావాలని కోరారు. 39 శాతం మంది ప్రజలు తమకు భారత రాజ్యాంగం పరిధిలోనే పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. మిలిటెంట్ల ప్రధాన కార్యకలాపాలు 1990 నుండి ప్రారంభమయ్యాయి. అంటే 1987లో రిగ్గింగ్ ద్వారా జరిగిన ఎన్నికల తర్వాత అన్నమాట. కేంద్ర ప్రభుత్వంతో పాటు కాశ్మీరీలు ఎన్నుకొన్న ప్రభుత్వాలు కూడా అక్కడి సాధారణ ప్రజల అభ్యున్నతికి కృషి చేయనందున కాశ్మీర్ సమస్య మానని పుండులా మారింది.

/వ్యాసకర్త 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు /

కవిత్వం

పాపం రైతన్న !

నిన్న మొన్న కుదిపేసిన
తుపాను గందరగోళం
సృష్టించింది
రైతుల పంటలు నేలపాలు
రైతు బ్రతుకు అప్పుల పాలు
ఎడతెరపని కర్షక బ్రతుకుల్లో
కల్లోలం లేపింది.
పేదల బ్రతుకుల్లో
మాత్రం నిరాశ మిగిల్చింది...
ఎక్కడ చూసినా
ప్రగతికి అవరోధం
దెబ్బ తిన్న రోడ్లు, నిండుకున్న చెరువులు
జన జీవనం అస్తవ్యస్తం
అయినా అందని ప్రభుత్వ సాయం.

– ఎల్. ప్రఫుల్ల చంద్ర,
సెల్ : 6300546700.

ఉపాధ్యాయులకు అంగన్‌వాడీ టీచర్ల విధులు?

అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను ఉపసంహరింప చేయకుండా, అంగన్‌వాడీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు అటాచ్ చేసి మిడ్ డే మీల్ పెట్టమని చెప్పడాన్ని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య వ్యతిరేకించింది. కానీ నంద్యాల జిల్లా కలెక్టర్ అంగన్‌వాడీ ఉపాధ్యాయుల విధులను ప్రభుత్వ ఉపాధ్యాయులకు కేటాయించారు. దీన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ ఉపాధ్యాయుల మీద పని ఒత్తిడి అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వారికి అదనంగా అంగన్‌వాడీ విధులు కూడా చేర్చడం సరికాదు. దీనివల్ల ఉపాధ్యాయుల బోధనా విధులకు ఆటంకం కలుగుతుంది. కావున ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. నంద్యాల జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలి.

– వాసిలి సురేష్,
నెల్లూరు జిల్లా.

మోడీ పాలనలో నలుగుతున్న నాలుగో స్తంభం

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

'పత్రికా స్వేచ్ఛ వదలరాని విలువైన ప్రత్యేక హక్కు' అన్నారు గాంధీ. పత్రికా రంగం ప్రజాస్వామ్య నాల్గవ స్తంభం. మానవత్వ విలువల, సామాజిక బాధ్యతల, నైతిక పాత్రికేయత సమాజ నిర్మాణానికే మూలం. భారత జాతీయోద్యమంలో, స్వాతంత్ర్య సమరంలో, స్వేచ్ఛా సాధనలో, జాతీయ భావాల ప్రచారంలో, ఉద్యమాల నిర్మాణంలో, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజాసమీకరణ, ఐక్యతలలో, బలమైన ప్రజాభిప్రాయ నిర్మాణంలో పత్రికారంగం కీలకంగా కృషి చేసింది. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో, బ్రిటిష్ రాణి ప్రత్యక్ష ఏలుబడిలో బ్రిటిష్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛపై అనేక పరిమితులు విధించింది. లండన్ నుండి ప్రచురించే పత్రికలు భారత స్వాతంత్ర్య పోరాట ఘటనలను వక్రీకరించాయి. స్వాతంత్ర్యం తర్వాత భారత రాజ్యాంగ అధికరణ 19, దాని ఉపాధికరణలు వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛలను అందించాయి. జాతీయోద్యమంలో పాత్రికేయ కట్టడితో బాధలు పడిన భారత తొలి పాలకులు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించలేదు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పత్రికా స్వేచ్ఛను ప్రోత్సహించినట్లు, తనపై 'శంకర్స్ వీక్లీ' విమర్శలను ఆహ్వానించినట్లు చరిత్ర చెప్తోంది. ప్రభుత్వ విధానాల విమర్శ వ్యక్తి విమర్శ కాదని, దిద్దుబాట్లకు అవకాశం ఇస్తుందని, దేశ నిర్మాణంలో అది అవసరమని నెహ్రూ ఉద్దేశం కావచ్చు. అయితే రాజ్యాంగంలోని 352(2) అధికరణం ప్రకారం ఇందిర ఎమర్జెన్సీని రుద్దారు. 25 జూన్ 1975 నుండి 21 మార్చి 1977 వరకు 21 నెలల పాటు సాగిన ఎమర్జెన్సీ కాలంలో పత్రికా స్వేచ్ఛ హరించబడింది. పాత్రికేయులను జైళ్ళలో పెట్టారు. కాని సమాజాన్ని మత పరంగా చీల్చలేదు. వైదికవాదులను ముస్లిం, క్రైస్తవులపై ఉసిగొల్పలేదు. ఆధిపత్య వర్ణాధికారంతో అల్ప సంఖ్యాకులను పరాయీకరించలేదు. ప్రపంచీకరణలో ఉత్పత్తి రంగాలు, జాతి సంపదలతో పాటు సేవలనూ ప్రయివేటీకరించారు. ఈ నేపథ్యంలో పాత్రికేయ విధానంపై పరిమితులు ప్రారంభమయ్యాయి. వార్తాప్రసారం ప్రభుత్వాధికారంగా మారింది. కాని, వార్తా ప్రసార వ్యవస్థలు అందులో ప్రవేశించరాదన్న భావాన్ని కల్పించారు. అయినా నాటి ప్రభుత్వాలు క్రమం తప్పకుండా పత్రికా సమావేశాలను నిర్వహించేవి.

> నేటి పాలకులు 19వ అధికరణను తుంగలో తొక్కారు. పత్రికా సమావేశాల ఊసే లేదు. సంఘీయులు పాత్రికేయులను విదేశాల్లో కూడా అవమానించారు. దాడులు చేశారు. నిజాలను బయటపెట్టి, నిర్మోహమాటంగా ప్రశ్నించిన, దేశభక్త, సత్యశోధక, ప్రజాపాత్రికేయులు, నిర్వాహకులను పాలకులు 'నేర పరిశోధన' సంస్థల దాడులకు గురిచేస్తున్నారు. తమను సమర్థించని పాత్రికేయుల కంప్యూటర్లను విచ్ఛిన్నం చేశారు. వాటిలో తప్పుడు సమాచారాలను ఎక్కించారు. దొంగసాకులతో ప్రాథమిక సమాచార నివేదిక, విచారణలు లేని, బెయిలు అవకాశం లేని చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిరోధక చట్టం (ఉపా) కింద వారిని నిర్బంధిస్తున్నారు. జైళ్ళలో కుక్కుతున్నారు.



నేటి పాలకులు 19వ అధికరణను తుంగలో తొక్కారు. పత్రికా సమావేశాల ఊసే లేదు. సంఘీయులు పాత్రికేయులను విదేశాల్లో కూడా అవమానించారు. దాడులు చేశారు. నిజాలను బయటపెట్టి, నిర్మోహమాటంగా ప్రశ్నించిన, దేశభక్త, సత్యశోధక, ప్రజాపాత్రికేయులు, నిర్వాహకులను పాలకులు "నేర పరిశోధన" సంస్థల దాడులకు గురిచేస్తున్నారు. తమను సమర్థించని పాత్రికేయుల కంప్యూటర్లను విచ్ఛిన్నం చేశారు. వాటిలో తప్పుడు సమాచారాలను ఎక్కించారు. దొంగసాకులతో ప్రాథమిక సమాచార నివేదిక, విచారణలు లేని, బెయిలు అవకాశం లేని చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిరోధక చట్టం (ఉపా) కింద వారిని నిర్బంధిస్తున్నారు. జైళ్ళలో కుక్కుతున్నారు. టెలిగ్రాఫ్ ఆంగ్ల దినపత్రిక సంపాదకుడు ఆర్.రాజగోపాల్, అంతర్జాల పత్రిక 'న్యూస్ క్లిక్' నిర్వాహకులు ప్రబీర్ పురకాయస్థ, ముకేశ్ చక్రవర్తి మొదలగువారు ఈ జాబితాలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో 19 ఏళ్ల దళిత బాలిక అగ్రవర్ణ సామూహిక అత్యాచారహత్యకు గురయ్యారు. ఆ సమాచార సేకరణకు వెళుతున్న కేరళవాసి, ఢిల్లీ పాత్రికేయుడు సిద్ధిఖ్ కప్పన్‌ను ఉపా చట్టం కింద అక్టోబర్, 2020లో అరెస్టు చేసి మథుర జైల్లో పెట్టారు. అక్కడ ఆయనకు కోవిడ్ వచ్చినా బెయిలివ్వలేదు. రెండేళ్ల తర్వాత బెయిల్ ఇచ్చినా మరొక కేసులో జైల్లోనే ఉంచారు. 2022 డిసెంబర్ 23న అలహాబాద్ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఇద్దరు స్థానికుల రూ.లక్ష హామీ షరతు విధించింది. కేరళీయ, ఢిల్లీ పాత్రికేయునికి స్థానిక నగదు పూచీకత్తు సాధ్యమా? అయితే న్యాయస్థానాలు కూడా పాత్రికేయుల ప్రభుత్వ అనుబంధాన్ని బట్టి బెయిల్ నిర్ణయం తీసుకుంటున్నాయి. ఆర్ణబ్ గోస్వామి బెయిల్ కోసం ఒకేసారి కింది కోర్టు నుండి సుప్రీంకోర్టు దాకా అభ్యర్థనలు దాఖలు చేసినా న్యాయమూర్తులు అభ్యంతర పెట్టలేదు. పాత్రికేయులకు న్యాయం చేయడం న్యాయస్థానాల బాధ్యతన్నారు. బెయిల్ ఇచ్చి, ఆ తీర్పు ప్రతి అందినంత వరకు ఆగవద్దని, అంతర్జాల ప్రతి ఆధారంగానే చర్య తీసుకొమ్మని ఆదేశించారు.

ఈ రోజు 72 శాతం పత్రికలు, టీవీ లు న్యూస్-18 పేరుతో ముకేశ్ అంబానీవే. కోల్‌కతా పాత్రికేయురాలు రాధిక రాయ్, ఆమె భర్త ఆర్థిక నిపుణులు ప్రణయ్ రాయ్ 1984లో 24 గంటల ప్రసార స్వతంత్ర న్యూ ఢిల్లీ టివి (ఎన్డిటివి) నిస్థాపించారు. వార్తాప్రసారాలపై ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని ఛేదించారు. నిష్పక్షపాత వార్తలను అందించారు. ప్రధాని మోడీ ఎన్‌డిటివి కి ప్రకటనలు ఆపు చేయించారు. వ్యాజ్య వ్యూహం పన్నారు. వారి పత్రికా స్వేచ్ఛపై దాడిచేశారు. 2022 ఆగస్టులో బహుళ జాతిసంస్థ యజమాని, మోడీ మిత్రుడు గౌతమ్ అదానీ ఎన్‌డిటివిలో 29.18 శాతం వాటాను కబ్జా చేశారు. నవంబర్‌లో మరో 8 శాతం వాటాను కొన్నారు. డిసెంబర్‌లో రాయ్ దంపతుల నుండి 27.53 శాతం వాటాను మాయాజాలంతో సంపాదించారు. దీంతో ఎన్‌డిటివిలో అదానీ వాటా 64.71కి ఎదిగింది. మోడీ అనానుకూల, ప్రజానుకూల పాత్రికేయత మూతపడింది. పత్రికల సంపాదక ప్రమాణాల పెంపుకు, పత్రికా స్వేచ్ఛ రక్షణకు స్థాపించిన స్వతంత్ర సంస్థ 'భారత ఎడిటర్స్ గిల్డ్'కు మౌనమే మిగిలింది. దేశంలో ప్రతి రాజకీయ పార్టీకి దినపత్రికలు, టీవీ ఛానళ్ళున్నాయి. 2021 ఫిబ్రవరికి 900 అనుమతించిన ప్రయివేట్ ఉపగ్రహ ఛానళ్ళున్నాయి. ఇవి తమ యాజమాన్య కార్పొరేట్ సంస్థలకు, తమకు వాణిజ్య ప్రకటనలిచ్చిన సంస్థలకు, కార్పొరేట్ అనుబంధ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తాయి.

ప్రజాస్వామ్యానికి, సమాజానికి ప్రజలే కీలకం. ఈ రోజు ప్రజలు మతాధారంగా చీల్చబడుతున్నారు. పాలకులు మెజార్టీ మతస్తులకు మతోన్మాదాన్ని ఎక్కించారు. వారి మెదళ్ళను అబద్దాలతో, చారిత్రక వక్రీకరణలతో నింపారు. ఈ పనిలో పాలకవర్గ దళారి సంస్థల ధృతరాష్ట్ర విశ్వవిద్యాలయం (వాట్సాప్) ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు పురుషుల క్రికెట్, నేరాలు, చలన చిత్ర ప్రముఖులు, రాజకీయ నాయకులు పత్రికారంగ ప్రధాన అంశాలు. సామాన్యులకు, స్త్రీలకు, సామాజికంగా వెనక్కు నెట్టబడ్డవారికి స్థానం లేదు. నేటి పాలకులు రాబోయే ఎన్నికల్లో కూడా నెగ్గితే ప్రజా పాత్రికేయతకే కాదు, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, పేద ప్రజా బాహుళ్యానికి ముప్పు.

సమాజ మార్పునకు పత్రికా రంగం తక్షణ స్వల్పకాలిక ఆయుధం. సత్య సేకరణ, వాస్తవ నివేదిక పాత్రికేయతకు ప్రధానం. పాత్రికేయతనూ, పాత్రికేయులనూ నేటి పాలకులు చీల్చారు. ప్రభుపక్ష పాత్రికేయులను ప్రయోజనాలతో ప్రోత్సహిస్తున్నారు. ప్రజా పాత్రికేయుల మీద ఊహించని రీతుల్లో విపరీతమైన ఒత్తిడి పెంచుతున్నారు. స్వేచ్ఛగా నిజాలు రాయడానికి, పాలక పక్ష ప్రజాస్వామ్య, రాజ్యాంగ, ప్రజావ్యతిరేక విధానాలను, భావజాల, సాంస్కృతిక దుర్మార్గాలను ప్రస్తావించడానికి కూడా జంకే విధంగా పరిస్థితులు తీసుకొస్తున్నారు. జన సామాన్యానికి అవసరమైన ప్రజా పాత్రికేయులను కాపాడుకోవలసిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులందరిది. రాజ్యాంగమిచ్చిన పాత్రికేయ రక్షణకు ప్రజాసంఘాలు, పౌర హక్కుల వేదికలు, ప్రత్యామ్నాయ పార్టీలు కూడా పోరాడాలి.

/ వ్యాసకర్త సెల్ : 9490204545 /

వాతావరణ మార్పు ప్రభావిత పేద దేశాలను ఆదుకోవాలి : ఐరాస పిలుపు

న్యూయార్క్ : వాతావరణ మార్పులకు ప్రభావితమవుతున్న పేద దేశాలకు సహాయం చేయడానికి ప్రపంచ సహకారం, భాగస్వామం కావాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఎ) అధ్యక్షులు డెన్నిస్ ఫ్రాన్సిస్ విజ్ఞప్తి చేశారు. దుబాయ్‌లో ఇటీవల జరిగిన కాప్28 సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై మీడియాతో మాట్లాడుతున్న సందర్భంలో ఫ్రాన్సిస్ ఈ పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులతో చిన్న ద్వీప దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు, తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు, భూపరివేష్టిత దేశాలు ఎదుర్కొంటున్న క్లిష్టమైన సవాళ్లను గురించి ఫ్రాన్సిస్ మాట్లాడారు. 'వాతావరణాన్ని స్థిరీకరించడంలో సహాయం చేయడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం అన్ని భాగస్వామ్య దేశాల సంకల్పంగా ఉండాలి' అని అన్నారు. ముఖ్యంగా వాతావరణ మార్పులకు ముఖ్య కారణమతున్న దేశాల సంకల్పంగా ఉండాలని తెలిపారు. ఇటీవల పసిఫిక్ రీజన్‌లో చేసిన పర్యటనలో చిన్న ద్వీప దేశాలు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితిని స్వయంగా పరిశీలించినట్లు వెల్లడించారు. వాతావరణ మార్పుల కారణంగా సముద్ర మట్టాలు వేగంగా పెరుగుతున్నాయని, దీంతో వరద ముప్పు, ప్రజల పునరావాసం, వలసలు వంటి తీవ్ర సమస్యలను ద్వీప దేశాలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ సమస్య పసిఫిక్ ప్రాంతాన్ని దాటి కరేబియన్, హిందూ మహా సముద్రంలోని చిన్న ద్వీప దేశాలకూ విస్తరించిందని అన్నారు. ఇలాంటి భయంకరమైన పరిస్థితితో ఈ దేశాల అస్తిత్వానికే ముప్పు ఏర్పడిందని అన్నారు.

అభివృద్ధిలో భాగమైనా చాలీచాలని వేతనమే

- అల్పాదాయంతో ఫీల్డ్ అసిస్టెంట్ల అవస్థలు
- కుటుంబాలు గడవక ఇబ్బందులు
- జనవరి 5న
- విజయవాడలో భారీ ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కీలకంగా వ్యవహరిస్తూ పంచాయతీల అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. శాశ్వత వనరులు ఏర్పాటు చేయడంలో వీరే ముఖ్యమైన వ్యక్తులు అయినప్పటికీ వారికి చాలీచాలని వేతనాలే వస్తున్నాయి. 15 ఏళ్ల నుండి పనిచేస్తున్నా.. గౌరవవేతనం పేరుతో రూ.5,740 మాత్రమే ఇస్తున్నారు. ఉపాధి హామీ పథకం ప్రారంభం నుంచి ఉద్యోగాన్ని నమ్ముకుని గ్రామీణ ప్రాంతంలో కూలీలు వలసలు వెళ్లకుండా అదే గ్రామంలోనే ఉపాధి చూపిస్తూ పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. కనీస వేతనం అమలు చేయాలని రూ.26 వేలు ఇవ్వాలని అప్పటి నుండి పాలనలో ఉన్న అన్ని ప్రభుత్వాలనూ వారు వేడుకుంటున్నారు. అయినా కనీస స్పందన లేదు. ఏయేటికాయేడు అదిగో ఇదిగో అంటున్నా వారికి అన్యాయమే జరుగుతోంది. వారిని తొలగించేందుకు వీలున్న మార్గాలను వెతుకుతున్న అధికారులు వారి పనిని గుర్తించి న్యాయం చేయడంపై దృష్టి సారించడం లేదు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగ కార్మికులకు ఎక్కడైనా సర్వీసును, అర్హతను బట్టి ప్రమోషన్స్ సౌకర్యాలు ఉంటాయి. అయితే ఈ వ్యవస్థలో మ్యాన్‌డేస్ టార్గెట్ విధానం తెచ్చి డిమోషన్ చేయడం అలవాటుగా మారింది. తమను సీనియర్లు, జూనియర్లుగా గుర్తించి న్యాయం చేయాలని వారు కోరారు. అలాగే ప్రతి గ్రామానికీ 7,500 పనిదినాలు నిర్దేశించడం సరికాదని వారు చెబుతున్నారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకోవడమూ సరికాదనేది వారి వాదన. గ్రామ పంచాయతీ భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పనిదినాలను నిర్దేశించాలనేది వారి ప్రధాన డిమాండుగా ఉంది.

రాష్ట్రాన్ని యూనిట్‌గా పెట్టుకుని పనిదినాలు నిర్దేశిస్తే ఎక్కువ మంది డిమోషన్ అవుతారని, వారికి న్యాయం జరగదని చెబుతున్నారు. సర్వీసు బట్టి ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిగా ఇవ్వాలని కోరుతున్నారు. పిఎఫ్, ఇఎస్ఐ హెచ్‌ఆర్ వంటివి వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ ఒత్తిడి లేకుండా చూడాలని కోరుతున్నారు. సీనియారిటీ బట్టి డిగ్రీలు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, టెక్నికల్ అర్హతతో ప్రమోషన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే అలాంటి వారికి ఆ కుటుంబం రోడ్డున పడకుండా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జనవరి 5న విజయవాడలో భారీ ధర్నా నిర్వహించి, తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

జగన్‌పై దాడి కేసు విచారణ నిలిపివేత ఉత్తర్వులు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో అప్పటి విపక్ష నేత, ప్రస్తుత సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో దాడి చేసిన కేసులో విశాఖ ఎన్ఐఎ కోర్టు జరుపుతున్న విచారణ నిలిపివేత ఉత్తర్వులను హైకోర్టు మంగళవారం మరోసారి పొడిగించింది. 3 వారాలపాటు విచారణను నిలిపివేయాలని ఆదేశించింది. ఇరుపక్షాల వాదనల నిమిత్తం విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఆదేశాలు జారీ చేశారు. '2018 అక్టోబరు 25న విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్‌పై కత్తితో జనిపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి హత్యాయత్నం చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్ఐఎ దర్యాప్తు చేపట్టింది. కత్తితో దాడి వెనుక కుట్ర, ప్రేరణ వంటివాటిని తర్వాత విచారిస్తామని ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఎ వివరించింది. ఆ తర్వాత వాటి జోలికి వెళ్లలేదు' అని జగన్ పిటిషన్ దాఖలు చేయడంతో ఎన్ఐఎ కోర్టు విచారణను గతంలో హైకోర్టు నిలిపివేసింది. ఇప్పుడు మరో మూడు వారాలపాటు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఎన్ఐఎను ఆదేశించింది.

క్యాంపు ఆఫీసుల కేసు పై విచారణ

- త్రిసభ్య ధర్మాసనం వినాలి : ప్రభుత్వం
- అవసరం లేదు : అమరావతి రైతులు

ప్రజాశక్తి-అమరావతి

ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష కోసం విశాఖలో ప్రభుత్వ క్యాంపు కార్యాలయాల ఏర్పాటు వ్యవహారంపై హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ చేయాలని ప్రభుత్వం మంగళవారం వాదించింది. గతంలో ఇదే అంశంపై త్రిసభ్య ధర్మాసనం విచారించిందని, ఈ పరిస్థితుల్లో సింగిల్ జడ్జి విచారణ చేయడానికి వీల్లేదని పేర్కొంది. విశాఖలో ప్రభుత్వ క్యాంపు ఆఫీసుల ఏర్పాటుకు అనువైన ప్రదేశాల గుర్తింపునకు ఐఎఎస్‌ల కమిటీ ఇచ్చిన రిపోర్టు మేరకు ప్రభుత్వం జిఓ 2283ను జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ రైతులు దాఖలు చేసిన పిటిషన్లను త్రిసభ్య ధర్మాసనానికి నివేదించాలని, విచారణ నుంచి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లును తప్పుకోవాలని కోరడం లేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు వేలూరు మహేశ్వరరెడ్డి, చింతల సుమన్ వాదించారు. రాజధాని రైతుల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు ప్రతివాదన చేస్తూ, క్యాంపు కార్యాలయాల ఏర్పాటు అంశానికి వాదనలు వినిపిస్తూ, క్యాంపు కార్యాలయాల తరలింపు వ్యవహారం కొత్త అంశమని, ఆఫీసుల తరలింపునకు సంబంధం లేదన్నారు. త్రిసభ్య ధర్మాసనమే విచారణ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

21న రెవెన్యూ వర్క్‌షాపు

- సిసిఎల్ఎ కమిషనరు సాయిప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించే అంశంలో అధికారుల్లో కొంత అయోమయం నెలకొందని, వారి అనుమానాలను నివృత్తి చేసేందుకు ఈ నెల 21న రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు సిసిఎల్ఎ కమిషనరు సాయిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. నిషేధిత భూముల తొలగింపు సమయంలో ఆయా సర్వే నెంబర్లను ఒకటికి రెండు సార్లు పరిశీలించాలని సూచించారు. అసైన్డ్ ల్యాండ్స్ యాక్ట్ 35 ఆఫ్ 2023 ప్రకారం 100 శాతం విఆర్ఒ, తహశీల్దారు, ఆర్‌డిఒ 10 శాతం వెరిఫై చేయాలన్నారు. జాబితా నుంచి తొలగింపు ప్రక్రియను జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షిస్తారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రభుత్వం పేర్కొన్న సూచనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసిపి కేంద్ర కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం జరిగిన ఈ వేడుకలకు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసనమండలి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ యేసు క్రీస్తు సూచించిన మార్గాన్ని అనుసరించాలని కోరారు. రాష్ట్రంలో క్రీస్తు చూపిన బాటలో సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఫాస్టర్ థామస్ యేసు క్రీస్తు సందేశాన్ని వివరించారు.

ఉచిత ఇసుక విధానం లోపభూయిష్టం

- హైకోర్టులో ప్రభుత్వ వాదన

ప్రజాశక్తి-అమరావతి

గత టిడిపి సర్కార్ ఉచిత ఇసుక విధానం లోపభూయిష్టమని, కేవలం బలవంతులదే పైచేయిగా ఉందని, సామాన్యులకు ఏ రకంగానూ ప్రయోజనం లభించలేదని రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. ఉచిత ఇసుక విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం చేకూరిందన్నారు. సీనరేజీ ఛార్జీల రాబడి పోయిందన్నారు. ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణానికి నష్టం ఏర్పడిందని, గత ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.100 కోట్ల జరిమానా విధించిందని గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా ఆ జరిమానాను రద్దు చేసిందన్నారు. ఇసుక వ్యవహారంపై దాఖలైన కేసులో నారా చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దన్నారు. చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం విచారణ జరిపారు. ఎజి వాదనలు ముగియడంతో చంద్రబాబు వాదనల నిమిత్తం విచారణ బుధవారానికి వాయిదా పడింది.

హాకీ అత్యుత్తమ ఆటగాళ్లుగా హార్దిక్, సవిత

- ఎఫ్ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



లాసన్నె: 2023 ఏడా దికిగాను హాకీ అత్యుత్తమ ఆటగాళ్లుగా భారత్‌కు చెంది న హార్దిక్ సింగ్, గోల్ కీపర్ సవిత పునియా అవార్డు లను గెలుచుకున్నారు. ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్(ఎఫ్ఐహెచ్- 2023 ఏడాదికిగాను మంగళవారం ప్రకటించిన అత్యుత్తమ ఆటగాళ్ల పేర్లను వెల్లడించింది. హార్దిక్‌సింగ్‌తోపాటు వాన్-డి-వార్డ్(నెదర్లాండ్స్) కూడా 2023 ఏడాదికి అత్యుత్తమ ఆటగానిగా ఎంపికయ్యాడు. దీంతో మహిళల విభాగం గోల్ కీపర్‌గా అత్యుత్తమ క్రీడాకారిణిగా ఎంపికైన మూడో ప్లేయర్ సవిత మాత్రమే. ఎపర్ట్స్ ప్యానల్, నేషనల్ అసోసియేషన్స్, జాతీయ జట్లకు ఆడిన కెప్టెన్లు, కోచ్‌లతోపాటు అభిమానులు, మీడియా ప్రతినిధులు వేసిన ఓట్ల ఆధారంగా ఎంపిక చేశారు. గోల్‌కీపర్ సవితతోపాటు నెదర్లాండ్స్ గోల్‌కీపర్ పర్మిన్ బ్లాక్, ఎఫ్ఐహెచ్ రైజింగ్ స్టార్స్‌గా తెరెసా లిమా(స్పెయిన్), గాస్పర్డ్ సావియర్(ఫ్రాన్స్) ఎంపికయ్యారు. అలాగే చైనా మహిళల హాకీ హెడ్ కోచ్ అలీసన్ అన్నన్, జర్మనీ పురుషుల జట్టు కోచ్ ఆండ్రీ హెన్నింగ్ ఎఫ్ఐహెచ్ కోచ్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను గెలుచుకున్నారు. ఈ అవార్డు రేసులో మొత్తం 114మంది నిలువగా భారత్‌కు చెందిన హార్దిక్.. భారతజట్టు ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించడంతో అతనికి అవార్డు సొంతమైంది.

ఎంపి, ఎమ్మెల్యేలపై కేసుల వివరాలు ఇవ్వండి

- మద్రాస్ హైకోర్టు

చెన్నై: తమిళనాడులోని ఎంపిలు, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు ఇవ్వాలని ఆ రాష్ట్రప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. 2024 జనవరి 30లోగా ఈ వివరాలు సమర్పించాలని, జనవరి 31న విచారణ జరుపుతామని ప్రభుత్వానికి తెలిపింది. ఎంపిలు, ఎమ్మెల్యేలపై కేసుల పురోగతిని పర్యవేక్షించాలని దాఖలైన పిటీషన్ విచారణలో హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. ఇలాంటి కేసులకు పర్యవేక్షణ అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు పునరుద్ఘాటించిన విషయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ వి. గంగాపూర్వాలా, జస్టిస్ డి.భరత చక్రవర్తిలతో కూడిన డివిజన్ బెంచ్ గుర్తు చేసింది.

ఇజ్రాయిల్‌కు నిర్మాణ కార్మికులు పంపేందుకు హర్యానా కసరత్తు

- తీవ్రంగా ఖండించిన సిడబ్ల్యూఎఫ్ఐ

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్‌కు 10 వేల మంది కార్మికులను పంపడానికి హర్యానాలోని బిజెపి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ప్రయత్నాలను భారత నిర్మాణ కార్మికుల సమాఖ్య (సిడబ్ల్యూఎఫ్ఐ) తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయిల్‌కు 10 వేల మంది నైపుణ్య కార్మికుల నియామకం కోసం హర్యానా ప్రభుత్వానికి చెందిన 'హర్యానా కౌశల్ రోజ్‌గార్ నిగమ్' (హెచ్‌కెఆర్‌ఎన్) ఈ నెల 15న ప్రకటన విడుదల చేసింది. ఇందులో నిర్మాణ రంగ కార్మికులే ఎక్కువగా ఉన్నారు. ఈ ప్రకటనను సిడబ్ల్యూఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకించింది. మన దేశంలో పేద నిర్మాణ కార్మికులను దోపిడీ చేయడానికి ఇది ఒక దుష్ట పన్నాగంగా విమర్శించింది. ఇజ్రాయిల్‌లో వివిధ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న పాలస్తీనా కార్మికులను అక్కడి అధికారులు బలవంతంగా వెళ్లగొడుతున్నారని, అందుకే అక్కడ కార్మికుల కొరత తీవ్రంగా ఉందని సిడబ్ల్యూఎఫ్ఐ గుర్తు చేసింది. ఇజ్రాయిల్‌లో నైట్ క్లబ్‌ల్లో బౌన్సర్ల నియామకానికి కూడా హెచ్‌కెఆర్‌ఎన్ ప్రకటన ఇచ్చిందని, ఈ బౌన్సర్లను పాలస్తీనాపై దాడులకు ఉపయోగించుకునే అవకాశం ఉందని సిడబ్ల్యూఎఫ్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. మన దేశంలోని కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపే ప్రమాదకరమైన చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 22,23 తేదీల్లో నిరసనలు తెలియజేయాలని సిడబ్ల్యూఎఫ్ఐ పిలుపునిచ్చింది.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | శాఖా కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన హళ్లి హోసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తి దిగువ సంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	అక్షయ బ్యాటరీ కో, పాట్నర్లు. డి వి వి రవికుమార్, ఎన్.సునీల్ కుమార్, వి.భరత్ చౌదరీ, కిషోర్ యార్లగడ్డ, రాంబాబు సి మరియు వెంకట లక్ష్మి ఎర్ర, దేవుళ్ల శ్రావణి మరియు దేవుళ్ల బుల్లమ్మాయి ద్వారా ప్రాతినిధ్యం/ డో.నం.1-40 ఎఫ్ నం.408 ఆర్ఎస్ నం.404/1, ఆర్ ఆర్ హైట్స్ పోరంకి విజయవాడ-521137/ 241151000001 మరియు 241155000006.	ఆస్తి-1 : విజయవాడ 521002, కానూరు, గౌరీశంకర్ రెసిడెన్సీ, శ్రీ సాయి మారుతి రెసిడెన్సీ, ఫ్లాట్ నం.టిఎఫ్ 16, ఆర్.ఎస్.నం.3/4, డో.నం.18-136 వద్ద ఉన్న మొత్తం ఆ రెసిడెన్షియల్ ఆస్తి. కొలిచే పరిధి : తూర్పు : ఫ్లాట్ నం.17, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : కారిడార్. ఆస్తి-2 : విజయవాడ-521002, కానూరు, గౌరీశంకర్ రెసిడెన్సీ, శ్రీ సాయి మారుతి రెసిడెన్సీ, ఫ్లాట్ నం.టిఎఫ్ 17, ఆర్.ఎస్.నం. 3/4, డో.నం.18-136 వద్ద ఉన్న మొత్తం ఆ రెసిడెన్షియల్ ఆస్తి. కొలిచే పరిధిలో తూర్పు : కారిడార్, పడమర : ఫ్లాట్ నం.16, ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై. ఆస్తి-3 : తూర్పు గోదావరి-533308, మండపేట, 17వ బ్లాక్, 1వ వార్డు, డో.నం.17 : 1 24/1 వద్ద ఆర్.ఎస్.నం.594/1, 594/2 మొత్తం ఆ రెసిడెన్షియల్ ఆస్తి. కొలిచే పరిధిలో తూర్పు : ఇతరులకు చెందిన స్థలం, పడమర : వీర్రాజు కి చెందిన ఆస్తితో డో.నం.17 1 24 1, ఉత్తరం : కె.సూర్యనారాయణ గోడ, దక్షిణం: ఇతరులకు చెందిన స్థలం. ఆస్తి-4 : విజయనగరం-535558, గొల్లపేట, ఆర్.ఎస్.నం.306/25, డో.నం.9-128 వద్ద ఉన్న మొత్తం ఆ రెసిడెన్షియల్ ఆస్తి. కొలిచే పరిధిలో తూర్పు : కర్రు పైడి నాయుడు కు చెందిన స్థలం, పడమర : రోడ్డు, ఉత్తరం : కర్రు పైడి నాయుడుకు చెందిన స్థలం, దక్షిణం : ఎల్.బంగారయ్యకు చెందిన స్థలం. మొత్తం ఆస్తితో కలిపి అన్నీ భవనములు మరియు నిర్మాణాలు అందులో ఫిక్చర్స్, ఫిట్టింగ్స్ మరియు అన్నీ ప్లాంట్ మరియు యంత్రాలు భూమికి జోడించబడి ఉంటాయి లేదా భూమికి జోడించబడిన దేనికైనా వర్తమానం మరియు భవిష్యత్తు రెండూ శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి/ లాంఛనప్రాయ స్వాధీనతా తేది : 15 డిసెంబర్, 2023	15-06-2023 Rs. 4,99,74,742.00/-	విజయవాడ/తూర్పు గోదావరి/ విజయనగరం

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 20 డిసెంబర్, 2023
ప్రదేశం : విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్



ఆయనను ఒప్పించడం కష్టమనుకున్నా..

"సలార్'లో పృథ్వీరాజ్ సుకుమారన్‌ను సెకండ్ హీరోగా ఒప్పించడం కష్టమవుతుందేమో అనుకున్నా. కానీ, ఆయనకు స్క్రిప్ట్ నచ్చింది. వెంటనే అంగీకరించారు." అని దర్శకుడు ప్రశాంత్ నీల్ అన్నారు. ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' చిత్రం డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ప్రమోషన్లలో భాగంగా ప్రశాంత్ నీల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పృథ్వీరాజ్‌పై ప్రశంసలు కురిపించారు. "వరదరాజ మన్నార్ పాత్రలో ఒదిగిపోయే నటుడి కోసం చాలా కసరత్తు చేశాం. బాలీవుడ్ నటులను తీసుకోవాలని కొందరు సలహాలిచ్చారు. ప్రేమ, ద్వేషం రెండూ చూపించగల నటుడు ఆయన మాత్రమే. పృథ్వీ ఒక సన్నివేశాన్ని నటుడి కోణంలోనే కాదు దర్శకుడిలా కూడా ఆలోచిస్తారు. 'సలార్' కోసం ఎన్నో ఆలోచనలు పంచుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన లేకపోతే 'సలార్' లేదు' అని అన్నారు.

ఏప్రిల్ నుంచి 'తలైవా 171'

'ప్రస్తుతం 'తలైవా 171' సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 2024 నాటికి అవి పూర్తవుతాయి. ఇది పూర్తిస్థాయి యాక్షన్ సినిమా. చాలా ఏళ్ల తర్వాత రజనీకాంత్ ఇలాంటి సినిమాలో నటించనున్నారు. "అనిరుధ్, నేను వెళ్లి ఆయనకు కథ వినిపించాం. వెంటనే ఆయన నన్ను కౌగిలించుకుని ఆల్ ది బెస్ట్ చెప్పారు. చాలా సంతోషించాను' అని లోకేష్ కనగరాజ్, ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ సినిమా గురించి తెలియగానే మొదట కమల్ హాసన్ ఫోన్ చేసి అభినందించినట్లు కూడా తెలిపారు. ఈ చిత్రంలో శివకార్తికేయన్ కీలకపాత్ర పోషించనున్నారు.



69వ సినిమాకు విజయ్ ఓకే...



కోలీవుడ్ హీరో విజయ్ తన 69వ చిత్రానికి అంగీకరించారు. ప్రస్తుతం వెంకట్‌ప్రభు దర్శకత్వంలో 68వ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో త్రిష హీరోయిన్. ఎజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. యువన్ శంకర్‌రాజా సంగీతాన్ని అందిస్తున్నారు. 70వ సినిమాకు అట్లీ దర్శకత్వం వహిస్తారనే ఊహాగానాలు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. తాజా చిత్రానికి యువ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ వ్యవహరిస్తారనేది సమాచారం. ఇప్పటికే ఆయన కథ చెప్పగా విజయ్ ఓకే చేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది.

'హనుమాన్' ట్రైలర్ విడుదల



తేజ సజ్జా, ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న 'హనుమాన్' సినిమా ట్రైలర్ మంగళవారం విడుదలైంది. తమ్ముడి కోసం అక్క వరలక్ష్మి అడ్డు నిలవడం వంటి కొన్ని ఆసక్తికర సన్నివేశాలతో కట్ చేసి, సినిమాపై ఆసక్తి కలిగించారు. ఈ సినిమాలో అమృత అయ్యర్ కథానాయిక కాగా, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. వినయ్ రాయ్ విలన్‌గా చేస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా జనవరి 12న తెలుగు సహా పలు భారతీయ, విదేశీ భాషల్లో విడుదలవుతోంది.

మణికంఠన్ హీరోగా ...



జైభీమ్ చిత్రంతో గుర్తింపు పొందిన నటుడు మణికంఠన్ తాజాగా ఓ కొత్త సినిమాలో నటించబోతున్నారు. నటిగా శాన్వి మేఘన, గురు సోమసుందర రాజన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. సినిమాకారం పతాకంపై ఎస్.వినోద్‌కుమార్ నిర్మాత. రాజేశ్వర్ కలిసామి దర్శకత్వం వహిస్తున్నారు. కోయంబత్తూర్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. దర్శకుడు రాజేశ్వర్ మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబానికి చెందిన యువకుడు వృత్తి, కుటుంబపరంగా ఎదుర్కొనే సవాళ్లు, చేసే సాహసాలను చూపే కథాంశంగా తెరకెక్కిస్తున్నామని చెప్పారు.

పరీక్షల కోసమే...



హీరోయిన్ శ్రీలీల ముంబైలో ఎంబిబిఎస్ ఫైనలియర్ పరీక్షలు రాస్తున్నారు. ఈనెల 18 నుంచి 24 వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి. అందుకే ఆమె గత కొన్ని రోజులుగా పరీక్షల ప్రిపరేషన్‌లో ఉండి సినిమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ ఏడాది ఆమె స్కంద, భగవంత్‌కేసరి, ఆదికేశవ, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాల్లో నటించిన విషయం విదితమే. గుంటూరుకారంతో పాటుగా మరో రెండు సినిమాల షూటింగ్‌లు కొనసాగుతున్నాయి.

అంగన్‌వాడీ పిల్లలకు వండి పెట్టలేం

- డిఇఒకు తెలిపిన ఎండిఎం కార్మికులు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వంట చేసి పెట్టాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారని, తాము అంగన్‌వాడీల పోరాటానికి మద్దతు ఇస్తున్నందున వంట చేసి పెట్టబోమని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు డిఇఒ బి.లింగేశ్వరరెడ్డికి తెలిపారు. మంగళవారం డిఇఒకు ఆ సంఘం నాయకులు బి.సుధారాణి, రామలక్ష్మి, సత్యవతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుంచి అంగన్‌వాడీ పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో స్కూల్లో వంట చేయాలని అధికారులు చెప్పారని, అయితే, తామంతా అంగన్‌వాడీల సమ్మెకు మద్దతిస్తున్నామని తెలిపారు. అందువల్ల తాము పిల్లలకు వండి పెట్టలేమి తేల్చి చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలు తగవు

- దళిత హక్కుల పోరాట సమితి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ సర్కారు అవలంబిస్తోన్న కుట్రలను తక్షణమే నిలిపివేయాలని విశాఖపట్నం దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారానికి 992వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పోరాట సమితి ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌పై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికీ ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోగా, ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తామనడం సరికాదన్నారు. దీక్షల్లో సమితి ఉపాధ్యక్షులు వి.అప్పలకొండ, సహాయ కార్యదర్శి టి.కామేశ్వరరావు, జి.ఈశ్వరరావు, కె.రాజగోపాల్, ఎం.మన్మధరావు, ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

జిసిసి చైర్‌పర్సన్‌గా స్వాతీరాణి కొనసాగింపు

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)



జిసిసి చైర్‌పర్సన్‌గా డాక్టర్ శోభ స్వాతీరాణి మళ్లీ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 48 కార్పొరేషన్లకు చైర్మన్ల పునర్నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్వాతీరాణి రెండోసారి జిసిసి చైర్‌పర్సన్‌గా నియామకమయ్యారు. గిరిజనుల నుంచి సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, అరుకు కాఫీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, జిసిసి ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయడంలో చైర్‌పర్సన్ డాక్టర్ స్వాతీరాణి కృషి చేశారు. ఆమె సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ చైర్‌పర్సన్‌గా నియమించింది.

నీటి సంపులోపడి చిన్నారి మృతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన ముత్యాలు, బాగ్యమ్మ దంపతుల కుమారుడు మేఘశ్యామ్ (2) నీటిసంపులో పడి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. ముత్యాలు కుమారుడు మేఘశ్యాం ఇంటి వద్ద మంగళవారం ఆడుకుంటూ ఉండగా ప్రమాదవ శాత్తు పక్కనే ఉన్న నీటి సంపులోకి పడి మృతిచెందాడు. చిన్నారి మృతితో ఇందిరమ్మకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్లంటే చులకనే!

- జాతీయ రహదారులూ నత్తనడకనే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రోడ్ల నిర్మాణం అంటే రాష్ట్ర ప్రభుత్వానికే కాదు కేంద్రానికీ చిన్న చూపు మాదిరే కనిపిస్తోంది. రాష్ట్ర రహదారులు, జిల్లా రహదారుల మాదిరే జాతీయ రహదారుల నిర్మాణ పనులూ కూడా నత్త నడకన నడుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనులు కూడా ఇప్పుడు నత్తనడకన నడుస్తున్నాయి. రాయలసీమ జిల్లాల నుండి రాష్ట్ర రాజధాని అమరావతికి అతితక్కువ సమయంలో చేరుకునేందుకు వంపులు లేని ఆరులైన్ల రోడ్డుగా చేపట్టిన అనంతపురం- అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం దాదాపు నిలిచిపోయింది. కేంద్రం ఈ రోడ్డును రూ.9వేల కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు ప్రకటించి ఇప్పుడు పక్కన పెట్టేసింది. ఆరువందల కిలోమీటర్ల దూరం వుండే ఈ జాతీయ రహదారిలో 390 కిలోమీటర్లు నాలుగులైన్లు, 210 కిలోమీటర్లు ఆరులైన్లతో 2017లో చేపట్టిన ఈ రోడ్డు పనులు రెండున్నర ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. డిజైన్లను మార్చినా ఇప్పటికీ పనులు పూర్తికాని పరిస్థితి వుంది. ఈ ప్రాజెక్టులో కర్నూలు నుండి దోర్నాల వరకు వున్న 130 కిలోమీటర్ల రోడ్డు పనుల్లో ఆత్మకూరు వరకు మాత్రమే పనులు సాగుతున్నాయి. మిగిలిన పనులు నిలిచిపోయాయి. నిత్యం రద్దీగా వుండే కెజి రోడ్డులో కుంట నుండి దోర్నాల వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డును రూ.250 కోట్లతో డబుల్‌రోడ్డుగా మార్చేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయినా పనులు మొదలు పెట్టని పరిస్థితి వుంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే విజయవాడ, గుంటూరు నుండి శ్రీశైలం వెళ్లే వారికి మెరుగైన ప్రయాణ సౌకర్యాన్నిస్తుంది. వినుకొండ నుండి గుంటూరు వరకు 90 కిలోమీటర్ల నాలుగులైన్ల రోడ్డు పనులు సర్వేలకే పరిమితమయ్యాయి. కోస్తా జిల్లాల్లో తీరప్రాంతాలను కలుపుతూ చేపట్టిన కత్తిపూడి ఒంగోలు జాతీయ రహదారి పని నాలుగేళ్లుగా సాగుతోంది. తీర ప్రాంత జిల్లాల్లో చెన్నయ్ కలకత్తా రోడ్డుపై రద్దీని తగ్గించి వేగంగా రవాణా జరిగే ఈ ప్రాజెక్టు నత్తనడకన నడుస్తోంది. రాష్ట్రంలో మొత్తం 8,690 కిలోమీటర్ల మేర 55 జాతీయ రహదారులు వున్నాయి. హైదరాబాద్ నుండి తిరుపతి దూరాన్ని తగ్గించేలా కొత్తపల్లి, వెలుగోడు, బండి ఆత్మకూరు, నంధ్యాల వరకూ చేపట్టిన జాతీయ రహదారి పనులు ఇప్పటిదాకా మొదలు పెట్టని పరిస్థితి వుంది. జాతీయ రహదారి 150సి సూరత్ నుండి చెన్నయ్ వరకు చేపట్టిన ఎక్స్‌ప్రెస్ హైవే పనులు కూడా నత్తనడకన నడుస్తున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా చేపట్టకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయని ఎన్ఎహెచ్ఎఐ అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు భూముల విలువను మార్కెట్ రేట్ల ప్రకారం కాకుండా పూర్తిగా తగ్గించి ఇస్తామని చెబుతుండటంతో రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రాని పరిస్థితి వుంది. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే తప్ప రహదారుల నిర్మాణం పూర్తి కాదని అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- విజయనగరం జిల్లాకు చెందిన తల్లీ, కుమారుడు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

హైదరాబాద్ సంగారెడ్డిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం దిబ్బగుడివలస గ్రామానికి చెందిన తల్లీ, కుమారుడు దుర్మరణం చెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు... దిబ్బగుడివలసకు చెందిన కొట్నాన సత్యనారాయణ, భార్య మహితో కలిసి జీవనం సాగిస్తున్నారు. సత్యనారాయణ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ముగ్గురు కలిసి మంగళవారం ఉదయం ఆలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సంగారెడ్డి వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో తల్లి మహి, కుమారుడు దేవాన్ష్ అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు గాయపడిన సత్యనారాయణను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా మరణించిన మహి, దేవాన్ష్ మతదేహాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి అంత్యక్రియలు కోసం స్వగ్రామం దిబ్బగుడివలస తీసుకువస్తున్నారు. తల్లీ కుమారుడు మృతితో దిబ్బగుడివలసలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

- జిబిసికి నీరు విడుదల చేయాలని డిమాండ్
- టిడిపి, సిపిఐ, జనసేన నేతల సంఘీభావం

ప్రజాశక్తి-ఉరవకొండ



గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు సాగునీరు విడుదల చేసి ఆదుకోకపోతే ఆత్మహ త్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిబిసికి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున రైతులు మంగళవా రం ఉరవకొండ సమీపంలోని అనంతపురం-బళ్లారి రహదారిపై ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు టిడిపి, సిపిఐ, జనసేన పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తోపాటు రైతులు మాట్లాడుతూ 15 రోజుల క్రితమే కాలువకు నీరు బంద్ చేయడంతో దాదాపు 26వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు ఎండిపోతున్నాయన్నారు. హంద్రీనీవా కాలువ నుంచి నీటిని మళ్లించి పంటలను కాపాడాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. హంద్రీనీవా నుంచి చిత్తూరు జిల్లా పుంగనూరుకు తీసుకెళ్తున్న నీటిని ఈ ప్రాంతానికి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కనీసం ఒక తడి నీరు ఇచ్చి పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పంటలు నష్టపోయి రైతులు దాదాపు రూ.300 కోట్లు నష్టపోతారన్నారు. ప్రభుత్వానికి చేతకాకపోతే తమకు అప్పగిస్తే రైతులకు నీటిని అందిస్తామన్నారు. 2016లో కూడా ఇలాంటి పరిస్థితి వస్తే హంద్రీనీవా నుంచి జిబిసి కాలువకు నీటిని అందించి పంటలను కాపాడామని గుర్తు చేశారు. మరోవైపు పంటలకు నీరందక ఎండిపోతుంటే మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం బాధాకరమన్నా రు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సాగునీరు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళన వద్దకు చేరుకుని ఎమ్మెల్యే కేశవ్‌తోపాటు పలువురిని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ టిడిపి మండల కన్వీనర్ చిన్నమారయ్య, నాయకులు తిమ్మరాజు, చంద్రశేఖర్, రాజాస్వామి, తిప్పారెడ్డి, వీరసింహా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు సుల్తాన్, సంజమ్మ, జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మరో 41 మంది ఎంపీలపై సస్పెన్షన్

- ఈ సెషన్‌లో మొత్తం 141 ఎంపీలపై వేటు
- అప్రజాస్వామికంలో ఆల్‌టైం రికార్డ్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

అప్రజాస్వామిక చర్యల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆల్‌టైమ్ రికార్డ్ సృష్టించింది. ప్రజావాణిని వినిపించే ప్రతిపక్షాల సభ్యులను పార్లమెంటు నుంచి గెంటివేసే తన మందబలంతోనే సమావేశాలను కొనసాగించింది. ప్రజాస్వామ్య మందిరంగా పరిగణించే చట్టసభల్లో సమాలోచనలు, సమగ్ర చర్చ జరగాలంటే ప్రతిపక్షాల ప్రాతినిధ్యం అవశ్యం. కానీ మోడీ సర్కార్ ప్రతిపక్ష సభ్యులు సభలో ఉన్నా.. లేకపోయినా గంపగుత్తగా సస్పెన్షన్ వేటు వేస్తూ నిరంకుశత్వాన్ని చాటుకుంటోంది. పార్లమెంటు భద్రతతో సహా దేశ ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చకు పట్టుబట్టినదే తడవుగా సదరు సభ్యులపై మోడీ సర్కార్ వేటు వేస్తూ వచ్చింది. సోమవారం లోక్‌సభలో మంగళవారం 49 మంది ప్రతిపక్షాల సభ్యులపై సస్పెన్షన్ విధించారు. సోమవారం వేటు పడ్డ 78 మందితో కలిపి ఈ శీతాకాల సమావేశాల్లో మొత్తంగా 141 మంది సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. భారత పార్లమెంటు చరిత్రలో ఇంత పెద్ద సంఖ్యలో ఒక సెషన్‌లో సభ్యులు సస్పెన్షన్‌కు గురికావడం ఇదే తొలిసారి. మంగళవారం సస్పెన్షన్‌కు గురైనవారిలో ఎన్‌సిపి నేత సుప్రియా సూలే, కాంగ్రెస్‌కు చెందిన శశిథరూర్, మనీష్ తివారీ, జమ్ముకాశ్మీర్ నేత ఫరూఖ్ అబ్దుల్లా కూడా ఉన్నారు. పార్లమెంటులో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని, సోమవారం సస్పెండ్ అయిన ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని 'ఇండియా' ఫోరానికి చెందిన సభ్యులంతా మంగళవారం సభ ప్రారంభమయ్యాగానే ముక్తకంఠంతో పట్టుబట్టారు. దీనిపై సమాధానం చెప్పేందుకు సాహసించలేని మోడీ సర్కార్ నిలదీసిన ఎంపీలందరిపైనా 'ప్రవర్తనా నియమావళి' ఉల్లంఘన కింద సస్పెండ్ చేసింది. ఈ శీతాకాల సమావేశాల మొత్తానికి 49 మందిని సస్పెండ్ చేస్తున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. బిజెపి ప్రభుత్వ పట్టువిడని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని 'ఇండియా' ఫోరం ఎంపీలు అటు సభలోనూ, ఇటు సభ వెలుపలా ఆందోళన చేపట్టారు.

పార్టీల వారీగా సస్పెండ్ ఎంపీలు

కాంగ్రెస్ 18, జెడియు 10, డిఎంకె 6, టిఎంసి 4, ఎస్‌పి 3, నేషనల్ కాన్ఫరెన్స్ 2, ఎన్సీపీ 2, ఐయుఎంఎల్ 1, ఆప్ 1, విసికె 1, బిఎస్పీ (పార్టీ సస్పెండ్ ఎంపి) 1 మంగళవారం నాటి సమావేశాల్లో సస్పెండ్‌కు గురయ్యారు. స్పీకర్ ఆదేశాలు ధిక్కరించారనే పేరుతో సభ్యుల సస్పెన్షన్ కు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు.

ఉభయ సభలు వాయిదా

ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలో మంగళవారం ఉభయ సభలు స్తంభించాయి. భద్రతా వైఫల్యం ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయడంతో పాటు తమ ఎంపిలపై సస్పెన్షన్ ను ఎత్తివేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. వెల్లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. దీంతో ఉభయ సభలు వాయిదా పర్వం తొక్కాయి. నిమిషాల్లో సభలను వాయిదా వేశారు. మరోవైపు, సస్పెన్షన్ కు గురైన ఎంపిలు అడిగిన 27 ప్రశ్నలను లోక్‌సభ ప్రశ్నల జాబితా నుంచి తొలగించారు. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే లోక్‌సభలో మూడు బిల్లులు ఆమోదం పొందాయి. నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ చట్టం (ప్రత్యేక నిబంధనలు) రెండవ (సవరణ) బిల్లు, కేంద్ర వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు, తాత్కాలిక పన్నుల సేకరణ బిల్లు లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదించారు.



పార్లమెంట్ ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న 'ఇండియా' ఫోరం ఎంపిలు

అమిత్ షా రాజీనామా చేయాల్సిందే : 'ఇండియా' డిమాండ్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో భద్రత వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, చొరబాటుదారులకు పాస్ ఇచ్చిన బిజెపి ఎంపిపై చర్యలు తీసుకోవాలని 'ఇండియా' ఫోరంలోని వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్షాల సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం పార్లమెంటులో ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వామపక్షాల ఎంపిలు ఆందోళన చేపట్టారు. సిపిఎం ఎంపిలు పి.ఆర్ నటరాజన్, జాన్ బ్రిట్టాస్, వి.శివదాసన్, ఏఏ రహీం, సిపిఐ ఎంపి పి.సంతోష్ కుమార్, కెసి(ఎం) ఎంపి జోషి కె.మణి తదితరులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అలాగే సస్పెండ్ అయిన ఎంపిలంతా పార్లమెంట్ ద్వారం ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేబూని 'మోడీ, షా డౌన్ డౌన్' అంటూ నినాదాలు హోరెత్తించారు.

ప్రజాస్వామ్యానికి మంచిది కాదు: ఖర్గే

బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. దేశ ప్రజాస్వామ్యానికి ఇది దుర్దినం అని ఆయన వాపోయారు. 'చాలా మంది ఎంపిలు తమ అభిప్రాయాలను పార్లమెంట్ ముందుంచేందుకు ప్రయత్నించారు. కానీ మోడీ, షా పార్లమెంట్‌కు రావడానికి కూడా ఇష్టపడటంలేదు. వారణాసి, అహ్మదాబాద్‌లకు వెళ్లేందుకు వారికి తీరిక ఉంది కానీ.. చట్టసభలకు హాజరయ్యే ఓపిక లేకపోయింది. ఇది ప్రజాస్వామ్యాన్ని అగౌరవపర్చడమే' అని ఆయన విమర్శించారు. సభలో ప్రతిపక్షాల ప్రజా గళాన్ని వినిపించేందుకు పాటు పడాల్సిన లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్లు ఆ పని చేయకుండా సభ్యులను సస్పెండ్ చేయడం సరికాదని ఆయన అన్నారు.

కాంగ్రెస్ ఎంపి అధీర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ పార్లమెంట్ లోపల బిజెపి అరాచకానికి పాల్పడుతోందని, పార్లమెంటరీ వ్యవస్థపై ఆ పార్టీకి నమ్మకం లేదని తప్పుబట్టారు. పార్లమెంటుకు చట్టబద్ధత లేకుండా పోతోందని కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపి కార్తీ చిదంబరం మాట్లాడుతూ "ప్రధాని వచ్చి తన బిల్లులను ఆమోదించినప్పుడు, రబ్బర్ స్టాంప్ హౌస్ ద్వారా ఆమోదం పొందినప్పుడు ఇది టోకెన్ హౌస్ అవుతుంది" అని ఎద్దేవా చేశారు.

ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా? : ఆప్ ఎంపి సుశీల్ కుమార్ రింకు

ఆమాద్మీ పార్టీ ఎంపి సుశీల్ కుమార్ రింకు మాట్లాడుతూ "నిజం మాట్లాడేవారిని, ప్రశ్నలు అడిగేవారిని సభ నుంచి సస్పెండ్ చేశారు. పార్లమెంట్‌లో దుర్భాషలాడి, ఎవరి వల్ల లోక్‌సభ భద్రతకు విఘాతం కలిగిందో వారు లోపల కూర్చున్నారు. దేశ ప్రజల గొంతును పెంచడంతో ఈ సస్పెన్షన్ జరుగుతుంది" అని అన్నారు. పార్లమెంటులో జరుగుతున్న నీచ రాజకీయాలను ప్రజలు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వ తీరును బిఎస్పి ఎంపి డానిష్ అలీ తదితరులు కూడా తీవ్రంగా ఖండించారు.

ఎమర్జెన్సీ పరిస్థితి: సుప్రియా సూలే

ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే మాట్లాడుతూ 'పార్లమెంటు భద్రతా వైఫల్యంపై వివరణకు డిమాండ్ చేస్తున్నాము. రైతుల కోసం మేం డిమాండ్ చేసే మమ్మల్ని ఎందుకు సస్పెండ్ చేస్తారు? (పార్లమెంట్) లోపల కూర్చున్నారు. ఇది అత్యవసర పరిస్థితి" అని అన్నారు. ప్రతిపక్ష ముక్త్ భారత్‌ను ప్రభుత్వం కోరుకుంటోందని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ విమర్శించారు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సంస్కరణ రాయాల్సిన మోడీ సర్కార్ కల్పిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ద్రోహం చేయడమేనని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యానికి స్మశాన వాటికగా పార్లమెంట్ : హర్‌సిమ్రత్ కౌర్ బాదల్

పార్లమెంట్‌ను ప్రజాస్వామ్యానికి స్మశాన వాటికగా మార్చాలని ప్రభుత్వం కోరుకుంటోందని ఎస్ఎడి ఎంపి, మాజీ కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ విమర్శించారు. ఎంపిలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేయడంపై హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ తన వేదనను వ్యక్తం చేస్తూ, "కొత్త పార్లమెంటును ప్రజాస్వామ్యానికి స్మశాన వాటికగా మార్చాలని ప్రభుత్వం కోరుకుంటోంది" అని ఆరోపించారు. "నాకు మాటలు రావడం లేదు.. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించే ముందు వాళ్లు ఏమనుకున్నారు? దీన్ని ప్రజాస్వామ్యానికి స్మశాన వాటికగా మార్చాలనుకుంటున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇలాగైతే మరిన్ని సీట్లు కోల్పోతారు : మోడీ అక్కసు

న్యూఢిల్లీ : ప్రతిపక్షాల ఐక్యతపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోమారు అక్కసు వెళ్లగక్కారు. ప్రభుత్వాన్ని కూలదోయడమే 'ఇండియా' ఫోరం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో ఇటీవల చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై ఆయన స్పందిస్తూ ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఘటనను ఖండించాలన్నారు. అయితే ప్రతిపక్షాలు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాగే వ్యవహరిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో వారి సీట్ల సంఖ్య మరింత తగ్గుతుందన్నారు. బిజెపి అధిక స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రతిపక్షాలు తీవ్ర నిరాశకు గురయ్యాయని, అందుకే పార్లమెంటు నిర్వహణను అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

ప్రకటనలకు రూ. 967 కోట్లు

న్యూఢిల్లీ : 2019-20 నుండి 2023-24 వరకూ ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ద్వారా పత్రికలలో ప్రకటనల నిమిత్తం రూ.967.46 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రం మంగళవారం లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలియజేసింది. 2020వ సంవత్సరపు పత్రికా ప్రకటనల విధానం ప్రకారం ప్రింట్ మీడియా ద్వారా సీబీసీ ప్రచార కార్యక్రమాలు చేపడుతోందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. సీబీసీ ద్వారా ఈ నెల 12వ తేదీ వరకూ ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం రూ.967.46 కోట్లు ఖర్చు చేశామని ఆయన వివరించారు. 2019 మార్చి 31 వరకూ రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్‌పేపర్స్ ఫర్ ఇండియా (ఆర్ఎన్ఐ) వద్ద వార్తా పత్రికలు సహా 1,19,995 పత్రికలు నమోదయ్యాయని తెలిపారు. ఈ సంఖ్య 2020లో 1,43,423గా, 2021లో 1,44,520గా, 2022లో 1,46,045గా, 2023లో 1,48,363గా ఉన్నదని అన్నారు.

హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు

చెన్నయ్ : తమిళనాడులో వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు. తూతుకూడి జిల్లాలోని శ్రీవైకుంఠం రైల్వే స్టేషన్‌లో చిక్కుకుపోయిన 800 మందిని రక్షించేందుకు రెస్క్యూ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తోంది. ఎన్‌డిఆర్ఎఫ్, వైమానికదళం, రైల్వే, స్థానిక అధికారులతో కలిసి శ్రీవైకుంఠం రైల్వే స్టేషన్‌లోనే చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. స్టేషన్‌లో చిక్కుకుపోయిన వారిలో 300 మందిని దగ్గరలోని ఒక పాఠశాలలో, మిగిలిన వారిని రైల్వే స్టేషన్‌లో ఉంచినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్‌లో ఒక చిన్నారి, గర్భిణీ సహా అనేక మంది ప్రయాణికుల ప్రాణాలను రక్షణ దళాలు హెలికాప్టర్ల సాయంతో రక్షించగలిగాయి. శ్రీవైకుంఠంకు 38 కిలోమీటర్ల దూరంలోని వంచి మాణియాచ్చి రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిన ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులను, రైళ్లను నడుపుతున్నారు. తిరునల్వేలిలో అనేక ప్రాంతాలను వరద చుట్టుముట్టింది.

60 ఏళ్లలో ఎన్నడూ చూడలేదు : స్టాలిన్

దక్షిణాది జిల్లాల్లో ఏడాది కాలం కురవాల్సిన వర్షాలు కేవలం ఒక్కరోజులోనే పడ్డాయని, కేంద్రం అవసరైన నిధులను పంపాలని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కోరారు. సహాయక, పునరావాస కార్యక్రమాలను ఆయనే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తిరునల్వేలి, తూతుకూడిలో కురిసినంత భారీ వర్షాలు గత 60 ఏళ్లలో తాను ఎన్నడూ చూడలేదన్నారు. బాధితులకు ఒక్కో కుటుంబానికి రూ.6 వేలు చొప్పున సహాయం అందజేస్తున్నట్లు స్టాలిన్ తెలిపారు.

చైనాలో పెను భూకంపం

- 118 మంది మృతి
- 536 మందికి గాయాలు

బీజింగ్ : వాయువ్య చైనాలోని గన్సు ప్రావిన్స్‌లో సోమవారం అర్ధరాత్రి 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపం జనజీవితాలను అతలాకుతలం చేసింది. భూకంప ధాటికి రహదారులు, ఇళ్లు ధ్వంసయ్యాయి. దీంతో 118 మంది మరణించారు. 536 మంది గాయపడ్డారు. చైనా భూకంప నెట్‌వర్క్‌ల కేంద్రం వెల్లడించిన ప్రకారం సోమవారం రాత్రి 11:59 గంటలకు భూకంపం సంభవించింది. లియుగౌ టౌన్‌షిప్‌కు సుమారు 8 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్లు లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. కంపన తీవ్రతకు 1,55,393 ఇళ్లు నేలమట్టమయ్యాయని, రహదారులు ధ్వంసమయ్యాయని తెలిపారు. విద్యుత్ స్థంబాలు నేలకొరగడంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రాత్రి వేళ సహాయక చర్యలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. కానీ సహాయక సిబ్బంది హెడ్ లైట్స్, సెల్‌ఫోన్ వెలుగుల్లోనే సహాయక చర్యలు కొనసాగించారు. వేలాది మంది ప్రాణాలను రక్షించారు. భూకంప బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ ధైర్యం చెప్పారు. అలాగే క్షతగాత్రులను సకాలంలో రక్షించాలని, వాతావరణ మార్పులను నిశితంగా పర్యవేక్షించాలని కూడా ఉన్నతాధికారులను ఆదేశించారు. బాధిత ప్రాంతాలకు వీలైనంత త్వరగా సహాయ సామాగ్రిని తరలించాలని కోరారు. విద్యుత్, కమ్యూనికేషన్లు, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చేయాలని నిర్దేశించారు.

ఈజిప్టు అధ్యక్ష ఎన్నికల్లో సిసికే పట్టం

- 89.6 శాతం ఓట్లతో గెలుపు



కైరో : ఈజిప్టు అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షులు అబ్దెల్-ఫత్తా అల్-సిసి ఘన విజయం సాధించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోలైన ఓట్లలో సిసి సుమారు నాలుగు కోట్ల ఓట్లు లేదా 89.6 శాతం ఓట్లతో ఆయన విజయం సాధించినట్లు ఈజిప్ట్ నేషనల్ ఎలక్షన్ అథారిటీ (ఎన్ఇఎ) ప్రకటించింది. కైరోలో విలేకరుల సమావేశంలో ఎన్ఇఎ ఛైర్మన్ హజెమ్ బదావీ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో స్వదేశంలో, విదేశాలలో దాదాపు 4.48 కోట్ల మంది ఓటు వేశారని, మొత్తం 6.7 కోట్ల మంది అర్హులైన ఓటర్లలో 66.8 శాతం పోలింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఇది ఈజిప్ట్ చరిత్రలోనే అత్యధిక పోలింగ్ శాతమన్నారు. రిపబ్లికన్ పీపుల్స్ పార్టీకి నాయకత్వం వహిస్తున్న హజెమ్ ఒమర్ 4.5 శాతం ఓట్లు సాధించగా, ఈజిప్షియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఫరీద్ జహ్రాన్, ఈజిప్షియన్ వాఫ్ద్ పార్టీకి చెందిన అబ్దెల్-సనాద్ యమామా తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత జాతిని ఉద్దేశించి సిసి ప్రసంగించారు. 'దేశానికి నాయకత్వం వహించే లక్ష్యం కోసం నన్ను ఎన్నుకున్నారు' అని తెలిపారు. ప్రస్తుతం ఈజిప్టు అనేక సవాళ్లతో పోరాడుతోందని అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడులు 'ఈజిప్ట్ యొక్క జాతీయ భద్రతకు' ముప్పుగా మారాయని అన్నారు. అయితే జాతీయ భద్రత, ప్రజల ప్రయోజనాలను రక్షించే, ఆర్థిక సామర్థ్యాలను ఈజిప్టు కలిగిఉందని కూడా తెలిపారు. ఈజిప్టు అధ్యక్ష ఎన్నికల ఓటింగ్ స్వదేశంలో ఈ నెల 10, 12 తేదీల్లో జరగా, విదేశాల్లో ఉన్న ఈజిప్షియన్లు ఈనెల 1-3 తేదీల్లో ఓట్లు వేశారు. 121 దేశాల్లో పోలింగ్ జరిగింది.

దేశంలో అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్

- టాప్ 5 శతకోటీశ్వర్ల జాబితాలో చోటు
- ఈ ఏడాది అదానీ, అంబానీలకంటే అధిక ఆర్జన



న్యూఢిల్లీ : దేశంలో అత్యంత సంపన్నులు ఎవరంటే, ముందుగా గుర్తుకు వచ్చే పేర్లు అంబానీ, అదానీలవే. కానీ ఈ ఏడాది భారత్‌లో అత్యధిక సంపదను ఆర్జించిన వ్యక్తుల జాబితాలో జిందాల్ గ్రూప్ ఛైర్‌పర్సన్ సావిత్రి జిందాల్ అగ్రస్థానంలో నిలిచారు. ఎకనామిక్ టైమ్స్ సంస్థకు చెందిన బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, ఆమె ఈ ఏడాది ఏకంగా దాదాపు రూ.7.97 లక్షల కోట్లు (9.6 బిలియన్ డాలర్లు) సంపాదించారు. దీంతో 25.3 బిలియన్ డాలర్ల సంపదతో ఆమె భారత్‌లోనే అత్యంత సంపన్నురాలైన మహిళగా నిలిచారు. అంతేకాదు దేశంలోని అగ్రశ్రేణి శతకోటీశ్వర్ల జాబితాలో 5వ వ్యక్తిగా రికార్డులకెక్కారు.

జిందాల్ గ్రూప్‌ను స్థాపించిన ఓంప్రకాశ్ జిందాల్ భార్యయే సావిత్రి జిందాల్. ఆయన మరణానంతరం, సావిత్రి జిందాల్ 'ఓపీ జిందాల్ గ్రూప్' ఛైరపర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ గ్రూప్‌లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, జిందాల్ స్టెయిన్‌లెస్ లిమిటెడ్ లాంటి పలు కంపెనీలు ఉన్నాయి. ఈ ఏడాది స్టాక్ మార్కెట్లో.. ఈ జిందాల్ గ్రూప్ కంపెనీల షేర్లు అన్నీ భారీ లాభాలు ఆర్జించాయి. దీంతో సావిత్రి జిందాల్ సంపద అమాంతం పెరిగింది. ఫలితంగా భారతదేశంలోని కుబేరుల జాబితాలో ఆమె ఐదో స్థానానికి చేరుకున్నారు.

అగ్రశ్రేణి శతకోటీశ్వర్లు వీరే

బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, దేశంలో ఈ ఏడాది అత్యధికంగా కోట్లు గడించినవారిలో హెచ్‌సిఎల్ టెక్ అధినేత శివ్‌నాడార్ 8 బిలియన్ డాలర్లతో 2వ స్థానంలో నిలిచారు. రియల్ ఎస్టేట్ సంస్థ డిఎల్ఎఫ్ లిమిటెడ్ ఛైర్మన్ కెపి సింగ్ 3వ స్థానంలో ఉన్నారు. ఈ ఏడాదిలో ఆయన సంపద 7.15 బిలియన్ డాలర్లు మేర పెరిగింది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ బిర్లా, షాపూర్ మిస్త్రీ 6.3 బిలియన్ డాలర్ల సంపదతో తరువాతి స్థానాల్లో ఉన్నారు.

అంబానే నబంర్ వన్

అపరకుబేరుడు, రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీ సంపద ఈ ఏడాది 5.2 బిలియన్ డాలర్లు పెరిగింది. అయినప్పటికీ ఆయన ప్రపంచ కుబేరుల జాబితాలో 13వ స్థానంలో ఉన్నారు. అయితే భారత్‌లో నంబర్ వన్ స్థానానికి ఎగబాకారు. ఆయన మొత్తం ఆర్జన 92.3 బిలియన్ డాలర్లకు పెరిగింది. సన్‌ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వి, రవి జైపురియా, ఎంపీ లోథా, సునీల్ మిత్తల్ ఆ తరువాతి స్థానాల్లో నిలిచారు.

అదానీకి గండిపడింది!

హిండెన్‌బర్గ్ ఇండెక్స్ నివేదిక ప్రకారం, ఈ ఏడాది అదానీ గ్రూప్ షేర్లు భారీగా నష్టపోయాయి. దీనితో గౌతమ్ అదానీ సంపద భారీగా తగ్గిపోయింది. దీంతో ఆయన ఆదాయానికి 35.4 బిలియన్ డాలర్ల మేర గండిపడింది. కానీ ఆయన మొత్తం సంపద 85.1 బిలియన్ డాలర్లుగా ఉంది. దీంతో ఆయన ఇప్పటికీ భారత్‌లో రెండో అత్యంత సంపన్నుడిగా కొనసాగుతున్నారు.

తైవాన్‌కు అమెరికా ఆయుధ విక్రయాలను ఖండించిన చైనా

బీజింగ్ : తైవాన్ ప్రాంతానికి అమెరికా ఆయుధాల విక్రయాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఈ విక్రయంపై తీవ్ర అసంతృప్తితోనూ, వ్యతిరేకతతోనూ ఉన్నామని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మంగళవారం ప్రకటించారు. తైవాన్‌కు 300 మిలియన్ డాలర్ల ఆయుధాల విక్రయానికి సంబంధించి ఇటీవల అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ చేసిన ప్రకటనపై స్పందిస్తూ చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వు కియాన్ పై వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రకటనతో చైనా-అమెరికా ఉమ్మడి కమ్యూనిక్స్ ముఖ్యంగా ఆగస్టు 17 కమ్యూనిక్‌ను అమెరికా ఉల్లంగించిందని తెలిపారు. అమెరికా చర్య చైనా సార్వభౌమాధికారం, భద్రతను తీవ్రంగా దెబ్బతీసిందని, తైవాన్ జలసంధి అంతటా శాంతి-స్థిరత్వానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తుందని విమర్శించారు. అలాగే తైవాన్ వేర్పాటువాదులకు తప్పుడు సంకేతాలను పంపిస్తుందని తెలిపారు. చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని నిలిపివేయాలని అమెరికాను కోరారు. చైనాను అదుపు చేసేందుకు తైవాన్‌ను ఉపయోగించుకోవాలనే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుందని హెచ్చరించారు. చైనా జాతీయ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను ధృడంగా పరిరక్షించడానికి, జలసంధి అంతటా శాంతి, స్థిరత్వాన్ని కాపాడ్డానికి ఆర్మీ సంసిద్ధతతో ఉందని స్పష్టం చేశారు.

నెతన్యాహుతో మోడీ ఫోన్‌లో సంభాషణ

న్యూఢిల్లీ / గాజా : ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని బేఖాతరు చేస్తూ గాజాలో మారణ హోమాన్ని సృష్టిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుతో ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఫోన్‌లో సంభాషించారు. ఈ విషయాన్ని ప్రధాని కార్యాలయం (పిఎంఒ) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సముద్రంలో నౌకాయాన భద్రతపైనా వీరిరువురు చర్చించినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. యుద్ధ ఖైదీలను విడుదల, యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాల్సిన ఆవశ్యకత గురించి ప్రధాన మంత్రి మోడీ, నెతన్యాహుకు చెప్పారని ఆ ప్రకటన తెలిపింది. ."భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు కార్మికులను పంపే ప్రతిపాదన గురించి మోడీ ప్రస్తావించినట్లు పిఎంఒ తెలిపింది. అశాంతి వాతావరణంలో, థాయ్‌లాండ్ వంటి వివిధ దేశాలు తమ పౌరుల భద్రతను పరిగణనలోకి తీసుకుని గాజా నుంచి ఖాళీ చేయిస్తున్నాయి. దీంతో ఇజ్రాయెల్‌లో కార్మిక శక్తి తగ్గిపోతోంది. ఈ స్థితిలో ఇజ్రాయెల్ కార్మికులను పంపేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధమైంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఈ వారం కాల్పుల విరమణపై ఓటు వేయవచ్చు.

గతంలో అమెరికా ఈ ప్రతిపాదనను వీటో చేయడం ద్వారా అడ్డుకుంది. పాలస్తీనా భూభాగమైన గాజాను ఇజ్రాయెల్ సైన్యం ధ్వంసం చేసింది. సోమవారం రాత్రి నుంచి నిరంతర వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ ట్యాంకులు గాజాలోకి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులు జరుపుతున్నాయి. ఇజ్రాయిల్ దాష్టీకాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

రఫాపై ఇజ్రాయెల్ భీకర దాడులు

దక్షిణ గాజాలోని రఫా పట్టణంపై ఇజ్రాయెల్ యుద్ధోన్మాదంతో విరుచుకుపడుతోంది. శరణార్థి శిబిరాలు, ఆస్పత్రుల సమీపంలోనూ అమానవీయంగా దాడులు చేస్తోంది. తాజా ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. మతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు.

పోరాటమే ఊపిరిగా

- ఎమర్జెన్సీ నుండి నేటి వరకు
- నాడు విద్యార్థిగా... నేడు జర్నలిస్టుగా ..
- జైల్లో ఉన్న ప్రబీర్ పుర్కాయస్థ జ్ఞాపకాలపై ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో చర్చ

న్యూఢిల్లీ: జైల్లో ఉన్న న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ జ్ఞాపకాలపై ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో చర్చ నిర్వహించారు. రచయితలు, జర్నలిస్టులు, విద్యార్థులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. "కీపింగ్ అఫ్ ది గుడ్ ఫైట్: ఎమర్జెన్సీ నుండి నేటి వరకు" అన్న పుస్తకంపై నిర్వహించిన ఈ చర్చా కార్యక్రమానికి లెఫ్ట్‌వర్డ్ బుక్స్ కో- హోస్టుగా వ్యవహరించింది. పుర్కాయస్థ రాజకీయ ప్రస్థానం, ఆయన కృషి, క్రియాశీలత దేశంలో చోటుచేసుకున్న పలు రాజకీయ, సామాజిక-ఆర్థిక మార్పులకు ఎంతగానో దోహదకారిగా నిలిచాయని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ రచయిత, చర్చల్లో పాల్గొన్న వక్తల్లో ఒకరైన గీతా హరిహరన్ మాట్లాడుతూ, 'ప్రబీర్‌ను ఒక వ్యక్తి కాదు సమిష్టి శక్తి . ఉద్యమంలోనే పుట్టాడు, ఉద్యమంలోనే ఎదిగాడు. ఇతర ఉద్యమాలతో కలిసి మార్పు కోసం ఉద్యమించారు. ఆయన పోరాటం అసంఖ్యాక ప్రజానీకానికి మెరుగైన జీవితాన్ని ఇవ్వడం కోసం, సమాజంలో మార్పులకు దోహదకారిగా నిలిచింది', అని చెప్పారు. 1975 ఆగస్టులో అంటే దేశం అంతటా ఎమర్జెన్సీ ప్రకటించిన తరువాత మూడు నెలలకు తీవ్రమైన అణచివేత, ప్రాథమిక హక్కుల హననం సాగింది. ఆ సమయంలో పుర్కాయస్థను జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) క్యాంపస్ నుండి ఎత్తుకెళ్లి చెరసాలలో పెట్టారు. అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం (మిసా) కింద కేసు బనాయించారు. అలాగే మొన్న అక్టోబరు3న న్యూస్ క్లిక్ వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థను,ఆ వెబ్ పోర్టల్ అడ్మినిస్ట్రేటివ్ అధిపతి అమిత్ చక్రవర్తిని అరెస్టు చేశారు. దానికి ముందు న్యూస్ క్లిక్ సిబ్బంది ఆఫీసు క్యాబిన్లపైన, ఇళ్లపైన ఇడి దాడులు సాగాయి. ప్రబీర్, అమిత్‌లపై దుర్మార్గమైన చట్టం ఉపా కింద కేసులు బనాయించారు. ప్రబీర్ నాడు విద్యార్థిగా, నేడు జర్నలిస్టుగా అరెస్టయ్యారు.

1975లో జెఎన్‌యు విద్యార్థి యూనియన్‌కు ఎన్నికైన అశోక్‌లతా జైన్‌ను బహిష్కరించినందుకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రక నిరసనలో పాల్గొన్నందుకు ప్రబీర్‌ను అపహరించుకుని తీసుకెళ్లి జైలులో పెట్టారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత అంటే 2023డిసెంబరు 15న అదే క్యాంపస్‌లో నిరసనలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందుకు సంబంధించి 16 మంది విద్యార్థులకు యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ నోటీసులు జారీ చేసింది. జమ్మూ కాశ్మీర్‌లోని హైకోర్టు ఉపా చట్టం కింద అరెస్టయిన జర్నలిస్టు ఆసిఫ్ సుల్తాన్‌కు అయిదేళ్ల తరువాత మొన్న డిసెంబరు 12న జమ్మూ కాశ్మీర్ హైకోర్టు విముక్తి కల్పించింది.

ప్రబీర్ పుస్తకం, గురువారం నాటి సమాంతర చర్చలు భారత ప్రజాస్వామ్యంపై ప్రజల్లో స్పృహ కొరవడడానికి కారణాలను విశ్లేషించాయి. ఎమర్జెన్సీ అనుభవాలను ప్రజల స్మృతి పథం నుంచి చెరిపివేయడం, హక్కులు, స్వేచ్ఛపై ఈ రోజు ప్రజల్లో నెలకొన్న నిర్లిప్తతే దీనికి కారణమని వక్తలు అభిప్రాయపడ్డారు.

భారత సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే మాట్లాడుతూ, 'మా స్వేచ్ఛను ఒక గొప్ప వ్యక్తి పాదాల వద్ద ఉంచకూడదని, మేము నిర్ణయించుకున్నాము' అన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ మాటలను సందర్భోచితంగా ఉటంకించారు. మళ్లీ అటువంటి పరిస్థితి ఎన్నడూ రానివ్వకూడదని ఆయన ఉద్బోధించారు. ఉమర్ ఖలీద్‌తో సహా పలువురు కార్యకర్తల అరెస్టుల గురించి హెగ్డే ప్రస్తావిస్తూ, "మనకు లిఖితపూర్వక రాజ్యాంగం ఉంది, రాజ్యాంగాన్ని నిర్వహించే సంస్థలుఉన్నాయి, కానీ ఈ సంస్థలు విఫలమైనప్పుడు , మనస్సాక్షి ఉన్న ఈ పురుషులు, స్త్రీలు ముందుకొచ్చి మంచి పోరాటం సాగిస్తున్నారు, రాజ్యాంగం పౌరునికి, పౌరునికి మధ్య ఒక గంభీరమైన బంధాన్ని ఏర్పరిచింది అదే ఈ దేశ ప్రజలంతా ఐకమత్యంగా కలిసి పని చేయడం, కలిసి జీవించడం అని ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని సమర్థించినందుకు పుర్కాయస్థ తన జీవితకాలంలో రెండుసార్లు బాధితుడయ్యాడని హెగ్డే పేర్కొన్నారు. పాత్రికేయుడు తన పుస్తకంలో పేర్కొన్న మాటలనే ఆయన ప్రయోగిస్తూ, ఒక మంచి పౌరుణ్ణి బాధితుడ్ని చేయడమంటే చరిత్ర సష్టిలో మన భాగస్వామ్యాన్ని హరించడమేనని ఆయన అన్నారు. చరిత్ర నిర్మాతలు ప్రజలేనన్న విషయాన్ని పుర్కాయస్థ తన పుస్తకంలో నొక్కి వక్కాణించిన విషయాన్ని హెగ్డే ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్యానెల్ చర్చలో పరిశోధకురాలు ఇంద్రాణి మజుందార్, సఫాయి కరంచారి ఆందోళన్ (ఎస్‌కెఎ) కార్యకర్త, వ్యవస్థాపక సభ్యుడు బెజవాడ విల్సన్, హిందూ పబ్లిషింగ్ గ్రూప్ డైరెక్టర్, జర్నలిస్ట్ ఎన్. రామ్ కూడా ఈ చర్చలో పాల్గొన్నారు.

భారతదేశంలో ప్రస్తుత కాలాన్ని "హిందుత్వ నిరంకుశ పాలన"గా ఎన్‌రామ్ పేర్కొన్నారు. "సంస్థలు బంధించబడుతున్నాయి... మానిప్యులేట్ చేయబడు తున్నాయి మీడియా స్వేచ్ఛ పూర్తి స్థాయి దాడిలో ఉంది" అని రామ్ హెచ్చరించారు.

న్యూస్ క్లిక్‌పై జరిగిన దాడుల గురించి ఎన్ రామ్ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఇదంతా మెకార్థైట్ ప్రచారం అని, మీడియాకే పరిమితని అనుకోరాదని, కొత్త సామాజిక-రాజకీయ, సైద్ధాంతిక నిర్మాణంలో భాగంగా సంఘ్ పరివార్ సమాచార ఆవరణ వ్యవస్థలోకి పెద్దయెత్తున విషాన్ని చొప్పిస్తోందని, ఈ ప్రమాదకరమైన ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన కోరారు.

బెజవాడ విల్సన్ మాట్లాడుతూ, "ప్రతిపక్ష-ముక్త్ భారత్" (దేశంలో ప్రతిపక్షం అనేది లేకుండా చేయడం) కోసం చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలన్నారు. 'నిరంకుశ రాజ్యానికి వ్యతిరేకంగా ప్రజలంతా కలిసికట్టుగా పోరాడాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

నిరాశావాదాన్ని తిరస్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పుర్కాయస్థను ఉటంకిస్తూ, హరిహరన్ చివరిలో ఇలా ముక్తాయించారు, "మన ఇటీవలి గతం గురించిన కథ అణచివేతను వివరించడానికే పరిమితం కారాదు, మనం . చూసిన, రాసిన ప్రతిఘటన గురించి పేర్కొనకుంటే ఆ కథ అసంపూర్ణంగానే మిగిలిపోతుంది" అని చెప్పారు.



ఉత్తరప్రదేశ్‌లో అంబులెన్స్‌కూ దిక్కులేదు

- తోపుడు బండిపై భార్య మృతదేహాన్ని తరలించిన భర్త

లక్నో : గుండెపోటుతో ప్రభుత్వాస్పత్రిలో మరణించిన తన భార్య మతదేహాన్ని తోపుడు బండిపై మోసుకెళ్తూ కనిపించాడు ఓ భర్త. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లాలో ఈ అమానవీయ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఎటా జిల్లా అస్రౌలి గ్రామానికి చెందిన వేద్ రామ్ భార్య మోహర్‌కు సోమవారం గుండెపోటు రావడం వల్ల చికిత్స నిమిత్తం ఆమెను ఫిరోజాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఇక్కడి ట్రామా సెంటర్‌లో ఆమెకు మంగళవారం చికిత్స అందించారు. పరిస్థితి విషమించి వైద్య అందుతుండగానే ఆమె తుది శ్వాస విడిచారు. దీంతో మహిళ మతదేహాన్ని పోస్టుమార్టం పరీక్షల తర్వాత ఇంటికి తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు మతురాలి భర్త, కుటుంబ సభ్యులకు సూచించారు. ఆ మేరకు అంబులెన్స్ ఏర్పాటు చేయాల్సిందిగా భర్త ఆస్పత్రి సిబ్బందిని వేడుకున్నారు. ఇందుకోసం చాలా సమయం ఆస్పత్రిలోనే వేచి ఉన్నారు. ఎంతకీ ఎవరూ స్పందించకలేదు. దీంతో చేసేదేమీలేక చనిపోయిన భార్య మతదేహాన్ని, భర్త తన బంధువు సాయంతో అక్కడే ఉన్న ఓ తోపుడు బండిపై వేసుకొని ఇంటి బాట పట్టాడు. దీనిని గమనించిన కొందరు స్థానికులు ఆ అమానవీయ దశ్యాలను ఫోన్లలో బంధించారు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అవి వైరల్‌గా మారి ఉన్నతాధికారుల దష్టికి వెళ్లింది. ఈ ఘటనపై స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్ జైన్ విచారణకు ఆదేశించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే తమ ఊరు పక్క జిల్లాలో ఉందన్న కారణంతోనే అంబులెన్స్ నిరాకరించినట్లు మతురాలి భర్త వాపోయారు. ఇతర జిల్లాలకు అంబులెన్స్‌లను పంపలేమని, వాహనం కూడా అందుబాటులో లేదని వైద్యులు చెప్పారని ఆయన బోరున విలపించారు. ఇదేనా బిజెపి చెప్పే 'డబుల్ ఇంజిన్' సర్కార్ అంటూ నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.



మీ కోసం
మెత్తగా దంచిన వాము చూర్ణాన్ని ఒక గ్లాసు మజ్జిగలో కలిపి తీసుకుంటే కఫం పలచబడుతుంది. శ్వాస మార్గాలు శుభ్రం అవుతాయి.

జీవన సౌరభం
పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

అవ్వ దాతృత్వం



పార్వతీపురం జమీందారు మేడపై పచార్లు చేస్తున్న సమయంలో ఓ పండు ముదుసలి నెత్తి మీద తట్టతో నిమ్మ పళ్ల అమ్ముతూ కనిపించింది. ఆ వయసులో కష్టపడుతున్న ఆమెను చూసి ఆశ్చర్యపోయిన జమీందారు ఆమెను లోపలికి పిలిపించాడు. జమీందారు దగ్గరికి వెళ్లిన అవ్వ, 'బిడ్డా రుపాయికి ఆరు పళ్లు. ఎన్ని ఇమ్మంటావు' అంది. 'పళ్ల తరువాత కొంటాను గాని, ఈ వయసులో ఎందుకు కష్టపడుతున్నావు' అని ఆయన ప్రశ్నించాడు.

అవ్వ బోసినోరంతా కనిపించేలా నవ్వి, 'చెబుతాను విను బాబు' అంటూ తన కథ చెప్పింది. 'నా భర్త చనిపోయి పదేళ్లయ్యింది. పిల్లలు పెద్దవాళ్లై తలో దిక్కూ వెళ్లారు' అంది. ఆమె స్థితికి జమీందారు జాలిపడి 'నువ్వు ఒంటరివి కదా! దివాణంలో ఓ గది కేటాయించి నీ బాగోగులు చూస్తాను. ఇక్కడుండిపో' అన్నాడు. 'పెద్ద మనసున్న వాడివే. అయితే నా కథ పూర్తిగా విను. ఊరి చివరన ఓ పూరిల్లు, పెద్ద పెరడు నా నివాసం. అందులో నా భర్త నిమ్మ చెట్లను పెంచాడు. వాటి పళ్లే ఇవి. ప్రతిరోజూ పొద్దున్నే బుట్టనిండా పళ్లు పెట్టుకుని ఊళ్లోకి వచ్చి తిండిగింజలు వచ్చేవరకు అమ్ముతాను. మిగతా వాటిని అనాథాశ్రమంలో ఉచితంగా ఇస్తాను. రోజు సంపాదనలో నా తిండికి సరిపడా డబ్బులు దగ్గర పెట్టుకుని, మిగిలిన వాటితో అనాథాశ్రమంలో పిల్లలకు పంచుతాను' అంది. 'పళ్లన్నీ అమ్ముకుని ఎక్కువ డబ్బులు వెనకేసుకోక, ఏ రోజుకారోజు అమ్ముకుని హైరానా పడడం దేనిక'న్నాడు జమీందారు. 'వెనకేసుకుని ఏం చేస్తాను బాబు. పైగా రోజూ ఇంత దూరం నడుస్తున్నాను కాబట్టే నా ఆరోగ్యం కూడా చక్కగా ఉంది. తిండికి కొద్దిగా డబ్బులు చాలు' అని అవ్వ ఎంతో నిబ్బరంగా చెప్పింది. కష్టపడుతూ జీవించడం, ఉన్నంతలో తృప్తి పడడం, దానం చేసే గుణం వున్న అవ్వ నుండి ఎంతో నేర్చుకోవాలి అని మనసులో అనుకుంటూ జమీందారు అవ్వ దగ్గర నిమ్మకాయలు కొన్నాడు.



కథ, బొమ్మ : **సాతివల్లి చందన నాగ వెంకట సత్య బ్రహ్మణి,**
7వ తరగతి, శ్రీ తిమ్మరాజు ఉన్నత పాఠశాల, వెంకటరాయపురం, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా. 99485 62198.

నేను గీసిన బొమ్మ





కె. బాల వర్షిత్
7వ తరగతి, శ్రీసాయి విద్యానికేతన్, అనకాపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వచ్చీ రాని ఇంగ్లీషే ప్రత్యేక గుర్తింపు తెచ్చింది!



చాలామంది నటులు ఉంటారు. అనేక రకాలుగా నటించి ప్రేక్షకుల మన్ననలను అదుకుంటారు. కానీ, ఒక్కొక్కరికి ఒక్కో ప్రత్యేక ముద్ర ఉంటుంది. ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఆ నటుడిని చూడగానే అదే గుర్తొస్తుంది. ఆ నటుడు తప్ప అలా ఇంకెవరకూ చేయలేరు అనిపిస్తుంది. రంగస్థలం మీద రాణించి, బుల్లితెర మీద తెగ నవ్వించి, వెండితెర మీద తళుక్కుమని మెరుస్తున్న క్యారక్టరు ఆర్టిస్టు రాపేటి అప్పారావుకు వచ్చీరాని ఇంగ్లీషుతో జరిపే సంభాషణే ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చింది. ఆయన ఇంగ్లీషు వాక్యాలు వింటుంటే ప్రేక్షకులు పడి పడీ నవ్వుతారు. అలాంటి పాత్రలో ఆయన్ని బాగా గుర్తు పెట్టుకుంటారు. ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన అప్పారావు 'జీవన'తో మాట్లాడారు. తన కళారంగ ప్రస్థానం గురించి వివరించారు.

ఆఫీసు బాయ్‌గా ఉద్యోగారంభం

అప్పారావు 1967 మార్చి 1న విశాఖపట్నం జిల్లా కె.కోటపాడు మండలం గుండుపాలెం దగ్గరలోని చౌడువాడలో జన్మించారు. వారి కుటుంబం 1971లో విశాఖనగరంలోని అక్కయ్యపాలెంలో స్థిరపడింది. కాస్త వయసు వచ్చాక ఓ ప్రయివేటు కంపెనీలో ఆఫీసు బాయ్‌గా చేరి, ఆ తర్వాత ఆటోమొబైల్ కంపెనీలో చేరారు. అలా 20 ఏళ్ల ఉద్యోగ ప్రయాణంలో బాయ్ నుంచి సీనియర్ క్లర్కు వరకూ ఎదిగారు. ఈ క్రమంలోనే తమ కంపెనీకి వచ్చే లెటర్లను డిస్‌ప్యాచ్ విభాగానికి తీసుకెళుతూ, ఆ లెటర్లను చదువుతూ ఇంగ్లీషు పదాలు ఒంట పట్టించుకున్నారు. అలా బట్టీ పట్టిన ఇంగ్లీషు పదాలే నేడు ఆయన హాస్యంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. "నేను పలికే ఇంగ్లీషు పదాలు, వాక్యాలు నాకు మంచి గుర్తింపు తెచ్చాయి. ఆ విధంగా ప్రేక్షకులు నిండుగా నవ్వుకోవడం నాకూ ఆనందాన్నిస్తోంది..." అని ఆయన అంటున్నారు.

రంగస్థలంపై రాణింపు

తమ నివాసానికి దగ్గరలో ఉన్న మాదేటి గార్డెన్స్‌లోని గౌరీ సేవాసంఘం గ్రంథాలయానికి అప్పారావు రోజూ వెళుతూ ఉండేవారు. సాయంత్రం పూట అక్కడ కొంతమంది కళాకారులు నాటకాల కోసం రిహార్సల్స్ చేసేవారు. నటన అంటే ఉన్న ఆసక్తితో అప్పారావు వారిని గమనిస్తూ, అనుకరిస్తూ, ఆ కళాకారులతో పరిచయం పెంచుకున్నారు. అలా 1984లో మాదేటి లక్ష్మణరావు ప్రమేయంతో 'మంచం మీద మనిషి' అనే నాటకంలో నటించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత రెండేళ్ల పాటు మేడే ఉత్సవాల్లో 'శ్రీరామాంజనేయ యుద్ధం'లో శతృఘ్నుని పాత్ర పోషించి మెప్పించారు. తర్వాత అనేక పౌరాణిక, సాంఘిక నాటకాల్లో వివిధ పాత్రలు పోషించారు. బుర్రకథ పితామహులు షేక్ నాజర్ శిష్యబృందంలో ప్రముఖులు కొమరశ్రీ దగ్గర బుర్రకథాగానంలోని మెళకువలను నేర్చుకున్నారు. ప్రముఖ మిమిక్రీ కళాకారులు నేరెళ్ళ వేణుమాధవ్‌ని అనుకరిస్తూ మిమిక్రి, స్కిట్లు చేసేవారు. అప్పటి రంగస్థల నటులు షణ్ముఖ ఆంజనేయరాజు, సంపత్ లక్ష్మణరావు, ఎ.వి.సుబ్బారావు, పీసపాటి నరసింహమూర్తి వంటి ప్రముఖుల ప్రభావం ఆయన మీద ఎంతో ఉంది. 1994-95లో ఆంధ్రా యూనివర్శిటీలో రంగస్థల విభాగపు కోర్సును పూర్తి చేసి డిప్లమో పొందారు.

సత్యానందం మాస్టారి శిష్యుడిగా ...

ఎందరో యువ అగ్రనటులను నటనలో మెళకువలను నేర్పి తీర్చిదిద్దిన లంకా సత్యానందం మాస్టారు దగ్గర అప్పారావు నటనలో శిక్షణ పొందారు. అత్తిలి కృష్ణారావు, రామవరపు శరత్‌బాబు, అబ్బూరి గోపాలకృష్ణ, ఆర్.వి.బాలసుబ్రహ్మణ్యం వంటి ప్రముఖుల పరిచయం అప్పారావును నాటక రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లింది. నాటి నాటక రంగ ప్రముఖులు ఎ.వెంకటేశ్వరరావు, కలియుగ అర్జునుడుగా పేరు గాంచిన అచ్చంనాయుడు తదితర ప్రముఖులతో కలిసి నటించారు.

శుభవేళతో సినీరంగ ప్రవేశం

2000లో బి.వి.రమణ దర్శకత్వంలో రామోజీరావు ఉషాకిరణ్ మూవీస్ నిర్మించిన 'శుభవేళ' సినిమాలో ఆయన సినీ నట జీవితం మొదలైంది. పటాస్, సరిలేరు నీకెవ్వరు, రాజా ది గ్రేట్, భీమ్లా నాయక్ వంటి 250కు పైగా సినిమాల్లో నటించారు. సరిలేరు నీ కెవ్వరులో ఆయన పోషించిన టిక్కెట్ కలెక్టర్ (టిసి) పాత్ర తరువాత మరో 80 సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. 2014లో దర్శకుడు బి.చిన్నికృష్ణ ద్వారా జబర్దస్త్‌లో అప్పటికే పేరున్న షకలక శంకర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ షోలో నటించి, బుల్లితెర ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. షకలక శంకర్, రచ్చ రవి, చలాకీ చంటి, రాకెట్ రాఘవ, రామప్రసాద్, బుల్లెట్ భాస్కర్, సరదా సత్తిపండు, ప్రకాష్ తదిరుల టీముల్లో పనిచేసి, 'ఆసమ్ అప్పి'గా పేరొందారు.

అప్పారావు బుల్లితెర ప్రవేశం 2007లో ఓ కామెడీ షోతో జరిగింది. ఈటీవి కామెడీ గ్యాంగ్‌లో కొండవలస లక్ష్మణరావు, తెలంగాణా శకుంతల, జయలలిత, గౌతంరాజు, తిరుపతి ప్రకాష్, మచ్చా జ్యోతి, కరాటే కళ్యాణి తదితరులతో కలిసి భాగస్వామ్యం వహించారు. తరువాత వివిధ ఛానెళ్ల షోలలో ఇచ్చిన ప్రదర్శనలతో హాస్యపు జల్లులు కురిపించారు.

ఆయన నటనకు గానూ అనేక సంస్థలు పురస్కారాలతో సత్కరించాయి. ఇంటర్నేషనల్ ఎచీవర్స్ కౌన్సిల్, ఏషియా వేదిక్ కల్చర్ ఫౌండేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో తమిళనాడులోని హోసూరులో 2022లో ఐకాన్ అవార్డు అందించింది. రంగస్థలంపై ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అవార్డులు అందుకున్నారు.

ప్రేక్షకులను అలరించటమే లక్ష్యం



జబర్దస్త్, ఎక్స్‌ట్రా జబర్దస్త్ ద్వారా మంచి పేరు సంపాదించుకున్నాను. కానీ, వీటివల్ల కనీసం 200 సినిమా అవకాశాలు కోల్పోయాను కూడా. మార్కెట్లో మంచి గుర్తింపుతో మరిన్ని అవకాశాలొస్తున్నాయి. నా ఇంగ్లీషు డైలాగులు బాగా పాపులర్ అయ్యాయి. కమెడియన్, లెక్చరర్, ప్రిన్సిపల్, సాఫ్ట్‌వేర్ ఎండి, టిక్కెట్ కలెక్టర్‌గా సినిమాల్లో వివిధ పాత్రలు పోషించాను. హోసూరులోని ఓ సంస్థ నాకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఓపిక ఉన్నంతకాలం ఇలా బుల్లితెర, వెండితెరపై నటిస్తూ ప్రేక్షకులను అలరించాలనేది నా ఆకాంక్ష.

- రాపేటి అప్పారావు,
సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్, విశాఖపట్నం

రంగవల్లి

19 చుక్కలు, 3 వరుసలు, 3 వచ్చేవరకు





కాటిబోయిన చందన శ్రీ అంజని

మా చిరునామా :
మెయిల్ ఐడీ : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రోడ్డెక్కిన రైతులు

- ధాన్యం టాక్టర్లతో నిరసన
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



రావిచంద్రి కూడలిలో రైతులు, పోలీసుల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్‌పేట మండలానికి చెందిన రైతులు తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రోడ్డెక్కారు. తమ ధాన్యం కొనడం లేదని తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ పలు గ్రామాల రైతులు మండలంలోని రావిచెంద్రి కూడలి వద్ద ధాన్యం లోడ్ల ట్రాక్టర్లతో నిరసనకు దిగారు. ఎల్ఎన్‌పేట మండలంలో మొత్తం 12 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ ఏర్పాటు చేసింది. వాటి ద్వారా ఇప్పటివరకు 2,026 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నారు. సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు ప్రభుత్వం 11 మిల్లులకు అనుమతిచ్చింది. వారు ధాన్యం విలువకు సమానమైన సుమారు రూ.11 కోట్లను బ్యాంకు గ్యారంటీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ మొత్తానికి సరిపడా ధాన్యం ఇచ్చేయడంతో ట్రక్ షీట్లు జనరేట్ కావడం లేదు. దీంతో, మిల్లులకు ధాన్యం తరలింపు సాధ్యం కావడం లేదు. ధాన్యం అమ్ముకునేందుకు మూడు నాలుగుసార్లు తిరుగుతున్నా కొనుగోలు చేయకపోవడంతో బత్తిలి-అలికాం రహదారిపై రైతులు ధాన్యం లోడ్ల ట్రాక్టర్లతో ఆందోళన చేపట్టారు. దీంతో, ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. సమస్యను పరిష్కరించాల్సిందేనని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ధాన్యం కొనకుండా మమ్మల్ని బెదిరిస్తారా' అంటూ పురుగులు మందు తాగేస్తామంటూ హెచ్చరించారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, వ్యవసాయ శాఖ అధికారి పైడిలత వారితో మాట్లాడారు. బ్యాంకు గ్యారంటీలు వచ్చిన వెంటనే వేరే మండలాలకు చెందిన ధాన్యాన్ని రాత్రికిరాత్రే కొనుగోలు చేసి తెల్లవారేసరికి బ్యాంకు గ్యారంటీ పూర్తయిందని మిల్లర్లు చెప్తున్నారని అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో, ఉన్నతాధికారులతో రెవెన్యూ అధికారులు మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల వద్ద దింపే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. రైతుల ఆందోళనతో ధనుకువాడ నుండి వాడవలస, దబ్బపాడు మీదుగా తురకపేట చేరుకునేందుకు వాహనాలను పోలీసులు మళ్లించారు. దీంతో, ఆ రోడ్డు రద్దీగా తయారై భారీ ట్రాఫిక్ స్తంభించింది.

గౌతమ్ నవ్‌లఖాకు బెయిల్

ముంబయి : ఎల్గార్ పరిషద్-మావోయిస్టులతో సంబంధాల కేసులో ఉద్యమకారులు గౌతమ్ నవ్‌లఖాకు బాంబే హైకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష పూచీకత్తుతో హైకోర్టు బెయిల్ మంజూరు చేసినా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విజ్ఞప్తితో ఉత్తర్వులపై మూడు వారాల స్టే విధించింది. బెయిల్ మంజూరు చేయడానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడానికి ఆరు వారాల గడువు ఇవ్వాలని ఎన్ఐఎ విజ్ఞప్తి చేయగా, హైకోర్టు మూడు వారాల సమయం ఇచ్చింది. నవ్‌లఖాను 2018 ఆగస్టులో అరెస్టు చేశారు. గత ఏడాది నవంబర్‌లో హౌస్ అరెస్టుకు సుప్రీంకోర్టు అనుమతించింది. దీంతో ప్రస్తుతం నవీ ముంబయిలోని తన నివాసంలో నవ్‌లఖా గృహనిర్బంధంలో ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నవ్‌లఖా బెయిల్ పిటీషన్‌ను ప్రత్యేక కోర్టు నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. గతంలో బెయిల్‌కోసం ముందుగా హైకోర్టులో పిటీషన్ వేయగా, ప్రత్యేక కోర్టుకు వెళ్లాలని తెలిపింది. నాలుగు వారాల్లో విచారణను ముగించాలని కూడా ప్రత్యేక కోర్టును ఆదేశించింది.

గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌లో భారీ కోత

- తెలుగు రాష్ట్రాలకు నిధులు విడుదల చేయని కేంద్రం
- ఎపికి రూ. 41 వేల కోట్ల కుదింపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల్లో భారీగా కోతలు పెడుతోంది. కేంద్రం నుండి రావాల్సిన నిధుల్లో ఇప్పటివరకు పది శాతం కూడా రాలేదని తెలిసింది. తాజాగా సమాచార హక్కు చట్టం కింద ఇనగంటి రవికుమార్ దాఖలు చేసిన ఒక దరఖాస్తుకు వచ్చిన సమాధానం ప్రకారం గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులో కేంద్రం భారీగా కోత పెట్టింది. ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన నిధులను ముందుగానే రాష్ట్రాలకు ఖరారు చేస్తారు. అయితే ఇలా ఖరారైన నిధులనూ కేంద్రం విడుదల చేయడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలకు వచ్చిన నిధులను పరిశీలిస్తే ఈ కోతలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు గతేడాది రూ.13,174 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా రాగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 5,014 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇవి నామమాత్రపు నిధులని రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ రూపేణా రాష్ట్రానికి 46,834 కోట్లు వస్తుందని రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో పొందుపరిచారు. అయితే డిసెంబర్ 15వ తేదీ వరకు కేవలం ఐదు వేల కోట్ల వరకు మాత్రమే రావడంతో ఆర్థికశాఖ ఆందోళన చెందుతోంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను మరింతగా రాబట్టేందుకుగాను తరచూ కేంద్ర ఆర్థిక శాఖతో సంప్రదింపులు సాగిస్తున్నామని ఆర్థికశాఖ చెబుతున్నప్పటికీ, తాజాగా కేంద్ర హోంశాఖ ప్రకటించిన లెక్కలతో అసలు విషయం వెల్లడైంది. ఇక తెలంగాణకు కూడా అతి తక్కువ మొత్తంలోనే నిధులు వచ్చినట్లు తేలింది. గతేడాది 3,359 కోట్లు రాగా, ఈ ఏడాది కేవలం 1,148 కోట్లు మాత్రమే రావడం గమనార్హంఇలా ఉండగా, ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా కేవలం మూడు న్నర నెలలు మాత్రమే ఉండడం గమనార్హం. దీంతో మిగిలిన కాలంలో ఎంత మొత్తంకేంద్రం విడుదల చేస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

ఆర్‌టిసి ఛైర్మన్‌గా మల్లికార్జునరెడ్డి కొనసాగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి బోర్డు ఛైర్మన్‌గా పదవీకాలం ముగిసిన ఎ మల్లికార్జునరెడ్డికి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎపిఎస్ఆర్‌టిసి ఛైర్మన్‌గా మల్లికార్జునరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా ఎంసి విజయానందరెడ్డి, డైరెక్టర్లుగా విజయనగరం జోనల్ ఛైర్మన్ జి బంగారమ్మ, విజయవాడ జోనల్ ఛైర్మన్ పినిపే మహేష్, నెల్లూరు జోనల్ ఛైర్మన్ బి సుప్రజ, కడప జోనల్ ఛైర్మన్ ఎం మంజుల, ఎ రాజారెడ్డిని నాన్ అఫీషియల్స్‌ను నియమించారు. అలాగే అఫీషియల్స్ నుండి రవాణాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి, ఆర్థికశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, జిఎడి కార్యదర్శి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి, ఆర్‌టిసి ఆర్థిక సలహాదారులతో పాటు కేంద్ర ప్రభుత్వానికి చెందిన మరో ఐదుగురు ఉన్నతాధికారులు డైరెక్టర్లుగా వుంటా రు. ఎపిఎస్‌ఆర్‌టిసి పాలకమండలిలో నాన్ అఫీషియల్ డైరెక్టర్లు ఏడుగురు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఉన్నతాధికారులు ఐదుగురు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉన్నతాధికారులు ఐదుగురితో పాలక మండలిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐపిఎల్ చరిత్రలో స్టార్క్‌కు రికార్డు ధర



రూ.24.50కోట్లకు కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంతం

దుబాయ్: ఆస్ట్రేలియాకే చెందిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఐపిఎల్ చరిత్రలో రికార్డు ధరకు అమ్ముడైన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. దుబాయ్ వేదికగా మంగళవారం జరిగిన మినీ వేలంలో స్టార్క్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంఛైజీ ఏకంగా రూ.24.75 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో గతంలో ప్యాట్ కమిన్స్(రూ.20.5 కోట్లు) పేర ఉన్న రికార్డు ధరను తుడిచేశాడు. రూ.2 కోట్ల కనీస బేస్ ధరతో వేలం రేసులో నిలిచిన యార్కర్ కింగ్‌ను దక్కించుకొనేందుకు కోల్‌కతా నైట్ రైడర్స్, గుజరాత్ టైటాన్స్ చివరి వరకు పోటీపడ్డాయి. కానీ, చివరకు కోల్‌కతా భారీ ధరకు స్టార్క్‌ను కొనుగోలు చేసింది. ఆ తర్వాత పాట్ కమిన్స్‌ను రూ.20.5కోట్లకు సన్‌రైజర్స్ కొనుగోలు చేయగా.. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ రూ.14 కోట్లతో చెన్నై దక్కించుకోవడంతో టాప్-3లో నిలిచాడు. టీమిండియా పేసర్ హర్షల్ పటేల్‌ను రూ.11.75కోట్లకు పంజాబ్ కింగ్స్, యువ ఆటగాడు సమీరి రిజ్విని చెన్నై రూ.8.4కోట్లకు, షారుక్ ఖాన్‌ను రూ.7.4కోట్లకు గుజరాత్ చేజిక్కించుకున్నాయి. వెస్టిండీస్ పేసర్ అల్జారీ జోసెఫ్ కోసం ఫ్రాంఛైజీలు విపరీతంగా పోటీపడ్డాయి. అతడి కనీస ధర రూ.కోటి కాగా... చివరికి అతడిని రూ.11.5 కోట్లకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబి) దక్కించుకుంది.

స్టార్క్‌కు అంత ధర ఎందుకంటే..

ఆస్ట్రేలియా లెఫ్టార్మ్ పేసర్ స్టార్క్ ఎలాంటి పిచ్‌పై అయినా ప్రభావవంతంగా బౌలింగ్ చేస్తాడని పేరుంది. ఆసీస్ జట్టులో స్టార్క్‌తో కలిసి ఎన్నో ఏళ్లుగా కొత్త బంతిని పంచుకుంటున్న మరో పొడగరి పేసర్ జోష్ హేజెల్‌వుడ్‌ను ఏ ఫ్రాంఛైజీ కొనుగోలు చేయలేదు.

మినీ వేలంలో అత్యధిక ధర పలికిన ఆటగాళ్ళలో కొందరు..

1. మిచెల్ స్టార్క్(ఆస్ట్రేలియా)	రూ.24.75కోట్లు	కోల్‌కతా నైట్ రైడర్స్
2. ప్యాట్ కమిన్స్(ఆస్ట్రేలియా)	రూ.20.5కోట్లు	సన్‌రైజర్స్ హైదరాబాద్
3. డారిల్ మిచెల్(న్యూజిలాండ్)	రూ.14.0కోట్లు	చెన్నై సూపర్ కింగ్స్
4. హర్షల్ పటేల్(భారత్)	రూ.11.75కోట్లు	పంజాబ్ కింగ్స్
5. అల్జారీ జోసెఫ్(వెస్టిండీస్)	రూ.11.5కోట్లు	(బెంగళూరు)ఆర్సీబి
6. స్పెన్సర్ జాన్సన్(ఆస్ట్రేలియా)	రూ.10.0కోట్లు	గుజరాత్ టైటాన్స్
7. రిలీ రూసో(దక్షిణాఫ్రికా)	రూ.8.0కోట్లు	పంజాబ్‌కింగ్స్
8. సమీర్ రిజ్వి(భారత్)	రూ.8.4కోట్లు	చెన్నై సూపర్‌కింగ్స్
9. షారుక్ ఖాన్(భారత్)	రూ.7.4కోట్లు	గుజరాత్ టైటాన్స్
10. రొవ్‌మన్ పావెల్(వెస్టిండీస్)	రూ.7.4కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
11. కుమార్ కుషగ్ర(భారత్)	రూ.7.2కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
12. ట్రావిస్ హెడ్(ఆస్ట్రేలియా)	రూ.6.8కోట్లు	సన్‌రైజర్స్ హైదరాబాద్
13. ఉమేశ్ యాదవ్(భారత్)	రూ.5.8కోట్లు	గుజరాత్ టైటాన్స్
14. శివమ్ దూబే(భారత్)	రూ.5.8కోట్లు	రాజస్తాన్ రాయల్స్
15. గెరాల్డ్ కోయెట్జీ(దక్షిణాఫ్రికా)	రూ.5.0కోట్లు	ముంబై ఇండియన్స్
16. యశ్ దయాల్(భారత్)	రూ.5.0కోట్లు	బెంగళూరు(ఆర్సీబి)
17. క్రిస్ వోక్స్(ఇంగ్లండ్)	రూ.4.2కోట్లు	పంజాబ్ కింగ్స్
18. శార్దూల్ ఠాకూర్(భారత్)	రూ.4.0కోట్లు	చెన్నై సూపర్ కింగ్స్
19. హ్యారీ బ్రూక్(ఇంగ్లండ్)	రూ.4.0కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
20. రాబిన్ మింజ్(భారత్)	రూ.3.6కోట్లు	గుజరాత్ టైటాన్స్

చేతులెత్తేసిన బ్యాటర్స్

రెండో వన్డేలో దక్షిణాఫ్రికా చేతిలో 8వికెట్ల తేడాతో ఓటమి



జోర్జి (119 నాటౌట్)

గబెర్హా(సెయింట్ జార్జెస్): రెండో వన్డేలో భారత బ్యాటర్స్ చేతులెత్తేయడంతో దక్షిణాఫ్రికా చేతిలో 8వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 46.2 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 42.3ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దక్షిణాఫ్రికా ఓపెనర్ జోర్జి(119నాటౌట్) సెంచరీతో రాణించాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్.. రెండో బంతికి వికెట్ల ముందు దొరికిపోయాడు. తిలక్ వర్మ(10) కూడా విఫలం కావడంతో టీమిండియా 46పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో తొలి వన్డే హీరో సాయి సుదర్శన్, కెప్టెన్ కెఎల్ రాహుల్‌లు అర్ధసెంచరీలతో కదం తొక్కారు. సాయి సుదర్శన్ (62; 83 బంతుల్లో 7ఫోర్లు, సిక్సర్), కెప్టెన్ కెఎల్ రాహుల్ (56; 64బంతుల్లో, 7ఫోర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. సాయి సుదర్శన్‌ను లిజాడ్ విలియమ్ బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరాడు. సంజూ శాంసన్(12), రింకూ సింగ్(17), అక్షర్ పటేల్(7) ఇలా వచ్చి అలా వెళ్లారు. దీంతో భారత ఇన్నింగ్స్ 46.2 ఓవర్లలో 211 పరుగులకు కుప్పకూలింది. దక్షిణాఫ్రికా పేసర్లలో బర్గర్‌కు మూడు, హెండ్రిక్స్, కేశవ్ మహరాజ్‌కు రెండేసి, విలియమ్స్, మార్‌క్రమ్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా ఓపెనర్లు హెండ్రిక్స్(52), జోర్జి(119) తొలి వికెట్‌కు 130పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. డుస్సెన్(36) త్వరగా ఔటైనా.. కెప్టెన్ మార్‌క్రమ్(2నాటౌట్), జోర్జి కలిసి మ్యాచ్‌ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జోర్జికి లభించగా.. మూడో, చివరి వన్డే 21(గురువారం) జరగనుంది.

స్కోర్‌బోర్డు..

భారత్ ఇన్నింగ్స్: గైక్వాడ్ (ఎల్‌బి)బర్గర్ 4, సాయి సుదర్శన్ (సి)క్లాసెన్ (బి)విలియమ్స్ 62, తిలక్ వర్మ (సి)హెండ్రిక్స్ (బి)బర్గర్ 10, కెఎల్ రాహుల్ (సి)మిల్లర్ (బి)బర్గర్ 56, సంజు శాంసన్ (బి)హెండ్రిక్స్ 12, రింకు సింగ్ (స్టంప్)క్లాసెన్ (బి)మహరాజ్ 17, అక్షర్ పటేల్ (సి)వెర్రెయన్నె (బి)మార్‌క్రమ్ 7, కుల్దీప్ యాదవ్ (సి)హెండ్రిక్స్ (బి)మహరాజ్ 1, ఆర్షదీప్ సింగ్ (సి)మిల్లర్ (బి)హెండ్రిక్స్ 18, ఆవేశ్ ఖాన్ (రనౌట్)ముల్డర్ 9, ముఖేశ్ కుమార్ (నాటౌట్) 4, అదనం 11. (46.2ఓవర్లలో ఆలౌట్) 211పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/46, 3/114, 4/136, 5/167, 6/169, 7/172, 8/186, 9/204, 10/211 **బౌలింగ్:** బర్గర్ 10-0-30-3, విలియమ్స్ 9-1-49-1, హెండ్రిక్స్ 9.2-1-34-2, ముల్డర్ 4-0-19-0, కేశవ్ మహరాజ్ 10-0-51-2, మార్‌క్రమ్ 4-0-28-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెండ్రిక్స్ (సి)ముఖేశ్‌కుమార్ (బి)ఆర్షదీప్ 52, జోర్జి (నాటౌట్) 119, డుస్సెన్ (సి)సంజు (బి)రింకు సింగ్ 36, మార్‌క్రమ్ (నాటౌట్) 2, అదనం 6. (42.3ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 215పరుగులు. **వికెట్ల పతనం:** 1/130, 2/206 **బౌలింగ్:** ముఖేశ్ కుమార్ 8-2-46-0, ఆర్షదీప్ సింగ్ 8-0-28-1, ఆవేశ్ ఖాన్ 8-0-43-0, అక్షర్ పటేల్ 6-0-22-0, కుల్దీప్ యాదవ్ 8-0-48-0, తిలక్ వర్మ 3-0-18-0, రింకు సింగ్ 1-0-2-1, సాయి సుదర్శన్ 0.3-0-8-0

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68